మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 92 • పేజీలు:12+16 • వెల: రూ.5 సోమవారం • 5-3-2018 www.manamnews.com /manamnews

పాక్‌లో దళిత హిందూ

మహిళకు పట్టం

సెనేటర్‌గా ఎన్నికైన కృష్ణ కుమారి కోలి

7లో..

లెఫ్ట్ 'చేయి' కలపాల్సిందే!

- త్రిపుర ఓటమితో సీపీఎం పునరాలోచన
- కాంగ్రెస్‌తో కలిసేందుకు సానుకూలం?
- గతంలోనే సీతారాం ఏచూరి ప్రతిపాదన
- అప్పట్లో తిరస్కరించిన పార్టీ కేంద్ర కమిటీ
- మనుగడకు పొత్తు తప్పదంటున్న నేతలు
- త్రిపుర అనుభవంతో మారనున్న వ్యూహం
- ఏచూరి.. బెంగాల్ లాబీ కాంగ్రెస్‌కు అనుకూలం
- కేరళ విభాగం.. కరత్ వ్యతిరేకం
- వచ్చే నెలలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం

మూడోది కాదు..

ముఖ్య కూటమి!

ఈ దేశానికి కొత్త దశ.. దిశ చూపిస్తా

- 70 ఏళ్ల తర్వాత దేశం ఎటుపోతోంది
- ఇప్పుడు కూడా రైతు ఆత్మహత్యలేనా?
- నీళ్ల వాటాలు తేల్చడానికి ఇంకా ఎన్నేళ్లు
- వాళ్లు తినేది బంగారం.. మనది మన్నా
- అమెరికాలో రాష్ట్రాలకు సర్వాధికారాలు
- ఇక్కడ కూడా అలాగే ఎందుకు ఉండదు?
- ఉపాధి కూలీల డబ్బులూ ఢిల్లీ నుంచేనా
- కేంద్ర ప్రభుత్వ పథకాలేవీ బాగలేవు
- పంటబీమా ప్రీమియాలు కట్టించుకుంటరు
- పంట దెబ్బతింటే రూపాయి కూడా ఇవ్వరా
- తెలంగాణ నుంచే మార్పు షురూ కావాలె
- మీ ఆశీస్సులతో 100% విజయం సాధిస్త
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఫోన్ చేసిన్రు
- హేమంత్ సోరెన్ కూడా మద్దతు పలికిన్రు
- ప్రగతిభవన్ వేదికగా కేసీఆర్ భావోద్వేగం
- వెల్లువలా తరలివచ్చిన తెలంగాణ జనం

హైదరాబాద్, మార్చి 4 (మనం ప్రతినిధి):

దేశంలో కొత్తగా వచ్చేది మూడో కూటమి కాదని.. ఇదే ముఖ్యకూటమి కావొచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పది లక్షల మైళ్ల ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే మొదలవుతుందని.. ప్రజల ఆశీస్సులుంటే ఈ దేశానికి కొత్త దశ.. దిశ చూపిస్తానని ఆయన స్పష్టం చేశారు. థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని, అవసరమైతే దేశానికి తానే నాయకత్వం వహిస్తానని కేసీఆర్ చెప్పడంతో ఆదివారం ఒకవైపు ఫోన్లు.. మరోవైపు అభిమానుల తాకిడి ఉప్పెనలా తాకింది. రాష్ట్రం నలు మూలల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రగతిభవన్‌కు మిగతా 6లో..





దేశ రాజకీయాల్లో

కేసీఆర్ ఏం ఉద్ధరిస్తారు?

ఆయన ఫ్రంట్‌కు టెంట్లు కూడా దొరకవ్..

- మోదీ నాలుగేళ్ల పాలనలో ఎనలేని అభివృద్ధి
- కర్ణాటకతోపాటు తెలంగాణలో విజయం మాదే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ధీమా

హైదరాబాద్, మార్చి 4(మనం ప్రతినిధి):

రాష్ట్రంలో ఏం చేయలేకపోయిన కేసీఆర్ దేశ రాజకీయాలను ఏం ఉద్ధరిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాటల గారడీతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని, టీఆర్ఎస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారని ఆయన విమర్శించారు. కాలం చెల్లిన పార్టీలు బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకపోతున్నాయని, వరుస విజయాలతో దూసుకుపోతున్న బీజేపీని చూసి కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేయకుంటే తల నరుక్కుంటానని తానే గద్దెనెక్కి మిగతా 6లో..

మూడో ఫ్రంట్‌కు ముహూర్తం వచ్చిందా?

కలిసొచ్చేందుకు జాతీయ పార్టీలు సిద్ధం..

టీఎంసీ, జేఎంఎం రాక దాదాపు ఖాయం



3లో..

- ఆచితూచి ధోరణిలో డీఎంకే, జేడీఎస్, ఎస్పీ
- కూటమి బలపడితే కలవనున్న 17 పార్టీలు
- తానూ మద్దతిస్తానంటున్న పవన్‌కల్యాణ్
- గతంలో కేంద్రమంత్రిగా చేసిన సీఎం కేసీఆర్
- నాటి పరిచయాలతో పలువురు నేతలతో చర్చ

ఇదీలోకం!



కన్రాడ్ సంగ్మాకు పీఠం



- మేఘాలయ కొత్త సీఎంగా రేపు ప్రమాణం
- కొలువుదీరనున్న ఎన్‌పీపీ సంకీర్ణ సర్కారు
- బీజేపీ సహా నాలుగు పార్టీల అండదండలు
- 34 మంది ఎమ్మెల్యేల మద్దతున్నట్లు ప్రకటన

సిరుల గని సిన్నబోయేనా?

ఉత్పత్తి లక్ష్యానికి దూరంగా సింగరేణి

- పదిహేనేళ్ల రికార్డుకు తొలిసారి బ్రేక్ !
- నిర్దేశిత లక్ష్యం 66 మిలియన్ టన్నులు
- 11 నెలల్లో 54 మిలియన్ టన్నుల ఉత్పత్తి
- 62 మిలియన్ టన్నులకు లక్ష్యం కుదింపు
- కొత్త గనుల కేటాయింపులో జాప్యమే కారణం
- యాజమాన్యం ప్రణాళిక లోపమే: కార్మికులు

హైదరాబాద్, మార్చి 4(మనం ప్రతినిధి):

ప్రభుత్వరంగ సంస్థగా ప్రత్యేక గుర్తింపు పొందిన సింగరేణి కాలరీస్ సంస్థ తడబాటుకు గురయ్యింది. పదిహేనుళ్లుగా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను క్రమం తప్పకుండా సాధిస్తూ వస్తున్న సింగరేణి ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని చేరుకోవడంలో తడబడుతుంది. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్య సాధనకు చాలా దూరంలో ఉంది. మరో 26 రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 66.06 మిలియన్ మిగతా 6లో..



ముహూర్తం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథిః చవితి రా.12.40 తదుపరి పంచమి; నక్షత్రం : చిత్త రా.8.16 తదుపరి స్వాతి; వర్జ్యం : రా.2.03- 3.42; దుర్ముహూర్తం : మ.12.04 - 12.51, మ.3.12 - 3.59; రాహుకాలం : ఉ.8.04 - 9.32; అమృతఘడియలు : మ.1.54 - 3.30; శుభసమయం : ఉ.6.00-7.00;

సూర్యోదయం : 6.35,

సూర్యాస్తమయం : 6.20

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో సోమవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 28 శాతం

ఏపీ ప్రజల తరఫున..

కేసీఆర్‌కు థ్యాంక్స్

జాతీయ స్థాయిలో థర్డ్ ఫ్రంట్ ఏర్పడాలి

- తెలుగువాడిగా కేసీఆర్‌కు మద్దతిస్తున్నా
- ఆయనది.. నాది ఒకే భావజాలం
- అంజయ్యకు అవమానంతో టీడీపీ
- తెలంగాణ రాష్ట్రం కోసం టీఆర్ఎస్
- సక్రమ విభజన జరగకే జనసేన పార్టీ
- భవిష్యత్తు అంతా జాతీయ పార్టీలదేనట
- 2019లో ప్రాంతీయ పార్టీలే కీలకం
- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

హైదరాబాద్, మార్చి 4:

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వాగతించారు. ఏపీకి హోదా ఇవ్వాలని, ఆ విషయంలో ఒక స్పష్టత తీసుకురావాలని కేంద్రాన్ని డిమాండ్ చేసినందుకు ఆయన ఏపీ ప్రజల తరఫున కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్యను అవమానించకపోతే మిగతా 6లో..



ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధం

- రెండ్రోజుల్లో అధికారిక ప్రకటనకు అవకాశం
- స్థాన చలనంపై పోలీసు వర్గాల్లో విస్తృత చర్చ
- నగర సీపీగా జితేందర్‌కు బాధ్యతలు!

హైదరాబాద్, మార్చి 4 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐపీ ఎస్ అధికారుల బదిలీలకు రంగం సి ద్ధమయ్యింది. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ స్థానంతో పాటు ఇతర అన్ని కీలక విభాగాల్లో పని చేస్తున్న ఐపీఎస్‌లకు బదిలీలు జరుగుతాయని సమాచారం. ప్రస్తుతం ఈ విషయంపై మిగతా 6లో..



అరుణారెడ్డికి 2 కోట్లు: సీఎం

హైదరాబాద్, మార్చి 4: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన జిమ్నాస్టిక్ ప్రపంచకప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన హైదరాబాదీ బుద్దా అరుణా రెడ్డికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహం ప్రకటించారు. ప్రపంచ్ కప్‌లో కాంస్య పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా అరుణారెడ్డి చరిత్ర సృష్టించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అరుణారెడ్డి ఆదివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ముఖ్యమంత్రి ఆమెను అభినందించి, సత్కరించారు. నగదు ప్రోత్సాహం ప్రకటించారు. ఆమె కోచ్ బ్రిజ్ కిశోర్‌కు కూడా సహాయం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్రీడల మంత్రి పద్మారావు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, అరుణారెడ్డి తల్లి సుభద్రమ్మ, సోదరి పావని పాల్గొన్నారు.


అరుణారెడ్డిని అభినందిస్తున్న సీఎం కేసీఆర్, తదితరులు

మల్కాజిగిరిలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

- 2 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్.. రిమాండ్

మేడ్చల్, మార్చి 4(మనంన్యూస్): మేడ్చల్ జిల్లాలోని మల్కాజిగిరిలో నిషేధిత మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు 2 లక్షలకు పైగా విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ కార్నివాల్ క్లబ్, సికింద్రాబాద్ సెంట్రల్ షాపింగ్ మాల్ సమీపంలో మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. దీంతో శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో రెండు బృందాలుగా ఏర్పడి అక్కడికి చేరుకున్నట్లు తెలిపారు. అనుమానితులను ఆపి సోదాలు చేస్తుండగా.. యాప్రాల్ కార్నివాల్ క్లబ్ సమీపంలో కీసర మండలం నాగారం గ్రామానికి చెందిన పులిచర గిరిధర్(20) డ్రగ్స్‌తో దొరికాడని చెప్పారు. అతని వద్ద 5 బోల్ట్స్ ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం నేరేడ్‌మెట్ సికింద్రాబాద్ సెంట్రల్ షాపింగ్ మాల్ ప్రాంతంలో పాత నేరేడ్‌మెట్‌కు చెందిన పి.ఎస్.ధనుంజయ్ నాయర్(22), కాప్రా శాంతి విహార్‌కాలనీకి చెందిన వరుణ్ సింగ్(23)లు డ్రగ్స్ విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని చెప్పారు. వీరి నుంచి ఎండిఎంఏ పిల్స్‌ను, 2 సెల్ ఫోన్లను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని చెప్పారు. విచారణలో డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి తీసుకొస్తున్నట్లు నిందితులు వెల్లడించారని చెప్పారు. కాగా, నిందితులు ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.


పోలీసుల అదుపులో నిందితులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు

వరంగల్‌లో ప్రతిమ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్

- శంకుస్థాపన చేసిన మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు

వరంగల్, మార్చి 4(మనం బ్యూరో): వరంగల్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రతిమ కేన్సర్ ఇనిస్టిట్యూట్ భవన నిర్మాణానికి మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ములుగు రోడ్డు-నేషనల్ హైవే-163, ఓఆర్ఆర్, ఆరేపల్లి జంక్షన్‌లో పది ఎకరాల విస్తీర్ణంలో 200పడకలతో అత్యాధునిక వైద్య సౌకర్యాలు కలిగిన ఆస్పత్రిని వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ గ్రూపు చైర్మన్ బోయినపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజలకు క్యాన్సర్ చికిత్సను చేరువ చేయాలనే ఉద్దేశంతో వరంగల్‌లో ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 10ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అత్యాధునిక డయాగ్నస్టిక్స్, రేడియోథెరపీ, కీమోథెరపీ, శస్త్ర చికిత్సలు, పాలివేటివ్ కేర్ (తీవ్రమైన వ్యాధిగ్రస్తులకు అందించే సేవలు) ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వల్ల మధ్యతరగతి వారికి క్యాన్సర్‌కు సంబంధించిన అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్, పర్యాటక, సాంస్కృతికశాఖ, ఎస్టీ డెవలప్‌మెంట్‌శాఖ మంత్రి అజ్మీర చందులాల్, ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, కొండా సురేఖ, దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

న్యూఢిల్లీ, మార్చి 4: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) పరిధిలో పది, పన్నెండో తరగతులు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభవుతున్నాయి. మొత్తం 28 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి 16,38,428 మంది దరఖాస్తు చేసుకోగా, పన్నెండో తరగతికి సంబంధించి 11,86,306 మంది దరఖాస్తు చేసుకున్నారని సీబీఎస్ఈ అధికారులు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు దేశంలో 4,453 కేంద్రాల్లో, విదేశాల్లో 78 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పన్నెండో తరగతి పరీక్షలను దేశంలో 4,138 కేంద్రాల్లో, విదేశాల్లో 71 కేంద్రాల్లో నిర్వహిస్తారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పారు. డయాబిటిస్‌తో బాధపడుతున్న విద్యార్థులు తమకు కావాల్సిన ఆహారాన్ని పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లేందుకు అనుమతిస్తామని బోర్డు అధికారులు చెప్పారు.

డోంట్ కాపీ.. బీ హ్యాపీ!

చదివింది రాస్తేనే ధీమా

- చూసి రాయడంలో ఉండదు..
- కష్టపడి తెచ్చుకున్న మార్కులతో సంతృప్తి
- అవే భవిష్యత్‌కు ఆనంద సూచికలు
- తల్లిదండ్రులు పిల్లలను గమనించాలి
- చదవలేకపోతే వారితో చర్చించాలి
- కౌన్సెలింగ్‌తో ఫలితం ఉంటుంది
- వ్యక్తిత్వాన్ని కాపీ చేస్తే చక్కని భవిష్యత్తు
- విద్యార్థులకు మానసిక నిపుణుల సూచన

పదో తరగతి పరీక్షల్లో కాపీ కొడుతూ పట్టుబడితే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామంటూ తెలంగాణ విద్యాశాఖ అధికారులు చేసిన హెచ్చరిక వివాదాస్పదంగా మారింది. దీనిని బాలల హక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. దీనిపై సీఎం కేసీఆర్‌కు సైతం లేఖ రాసింది. బాలబాలికలపై క్రిమినల్ కేసులు పెట్టి జైళ్లకు పంపించే చట్టాలు మన దేశంలో లేవు. ఇలాంటి చర్యలతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి వారి హక్కులకు భంగం కలిగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు బాలల హక్కుల సంఘం పేర్కొంది. ఈ చర్చకు మూలం విద్యార్థులు ఎందుకు కాపీ కొడతారు? దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎలా స్పందిస్తారు, పిల్లలకు ఎటువంటి సూచనలు, సలహాలు ఇవ్వాలి.. మరో వారం రోజు ల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'మనం' ప్రత్యేక కథనం

హైదరాబాద్ సిటీ, మార్చి 4(మనం ప్రతినిధి): కాపీ కొట్టడం, కొట్టేందుకు ప్లాన్ చేసుకోవడం.. రెండూ విద్యార్థులకు భయం పుట్టించే విషయాలే! పరీక్షల షెడ్యూల్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రిపరేష న్ సరిగ్గాలేని పిల్లలు షార్ట్‌కట్‌ల కోసం వెతుకుతుంటారు. సిలబస్‌ను కుదించుకోవడం, ఫార్ములాలు బట్టీ పట్టడం, బండగుర్తులు పెట్టుకోవడం, ముఖ్యమైనవనుకున్న ప్రశ్నలు మాత్రమే చదువడం తదితర ప్రయత్నాలు చేస్తారు. ఇవేవీ ఉపయోగపడని సందర్భాలలో ఎగ్జామ్ హాలులో తలతిప్పే ప్రయత్నం చేస్తారు. అయితే చదివింది రాయడంలో ఉన్న ధీమా చూసి రాయడంలో ఉండదు. కాపీ చేయడం అనే ఆలోచన రాకుండా విద్యార్థులకు రాకుండా ఉపాధ్యాయులు జాగ్రత్త పడితే చాలు. పిల్లలు హ్యాపీగా పరీక్ష రాసి వస్తారు. పాఠాలను పిల్లల బుర్రల కెక్కించగలిగితే పరీక్షల్లో వాళ్లకు తలతిప్పే అవసరం ఉండదని తల్లిదండ్రులు గుర్తించాలి. పరీక్షలు దగ్గరపడుతున్నాయి. రోజులు లెక్కబెట్టుకుంటూ రివిజన్ పూర్తి చేయడానికి పిల్లలు వారితో పాటు తల్లిదండ్రు లూ తమ శాయశక్తులా కుస్తీలు పడుతున్నారు. సిలబస్ పూర్తయిందని పెద్దలు ఊపిరి పీల్చుకున్నా పిల్లలు ఎగ్జామ్స్ ఎలా రాస్తారో ఎన్ని మార్కులు వస్తాయో అన్న ఎదురు చూపులు తప్పవు. వీటన్నింటిని పక్కన పెట్టేసి పిల్లలు కాపీ కొట్టారనో డిబార్ అయ్యారనో అన్న వార్త వినబడితే తల్లిదండ్రులు ఎలా స్పందిస్తారు..? ఆవేశంలో అనాలోచితంగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం కన్నా.. పిల్లల మేలు కోరుకునే తల్లిదండ్రులుగా ఈ అంశాలను పరిగణలోనికి తీసుకోవాలని పిల్లల మనస్తత్వ నిపుణులు సూచిస్తున్నారు..

ఎందుకు చదవలేకపోతున్నారు?

అమ్మాయి లేదా అబ్బాయి కాపీ ఎందుకు కొడుతున్నారు? చదువు మీద ఏకాగ్రత ఎందుకు చూపించలేకపోతున్నారు? భావోద్వేగపు సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఇంట్లో, స్కూల్లోనూ వాతావరణం ఎలా ఉంది? తదితర అంశాలన్నీ గమనించాలి. ఇలా పరీక్షల్లో కాపీ కొడుతూ పట్టుబడ్డ విద్యార్థులపై 'ఇండియన్ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్' ఓ పరిశోధన నిర్వహించింది. వాళ్లకు ఓ ప్రశ్నపత్రం ఇచ్చి జవాబులు రాబట్టింది. ఈ పరిశీలనలో 52శాతం నుంచి 56శాతం వరకు పిల్లలకు చదువంటే భయమని తేలింది. పుస్తకాల్లో ఉన్నది తాము అర్థం చేసుకున్నది వేరుగా ఉండి కాపీ కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారట.

కౌన్సెలింగ్ ముఖ్యం..

ఎలా చేసినా కాపీ, కాపీయే.. దొరికిపోతే టీచర్ చేతిలో తిట్లు అవమానాలే! ఇంకా పై స్థాయిలో జరిగితే అప్పటికప్పుడు డిబార్ కూడా అయ్యే ముప్పు పొంచి ఉంది. యేటా పరీక్షల సమయంలో ఆత్మహత్యా ప్రయత్నం చేసే వారిలో డిబార్ అయిన పిల్లలే ఎక్కువగా ఉంటున్నారని పలు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. పరీక్ష సమయంలో పిల్లలు కాపీ చేయకుండా చూడటానికి ఇన్విజిలేటర్‌ను నియమిస్తారు. విద్యార్థి కాపీ చేస్తూ దొరికిపోయాడంటే ''నన్నే చీట్ చేస్తాడా!'' అనే ఆవేశంతో అందరి ముందు ఇన్‌సల్ట్ చేస్తారు. అలా తిట్టడం, డిబార్ చేయడం వల్ల ఇక ముందు మళ్లీ చేయడు. అన్న భావనకూడా ఉండొచ్చు. కానీ ఇతరుల ముందు దోషిగా నిలబడటం, వచ్చే ఏడు అదే క్లాస్‌మేట్స్, అదే ఫ్రెండ్స్‌ను ఫేస్ చేయాలన్న నిజం విద్యార్థికి చిన్నతనంగా అనిపిస్తుంది. తల్లిదండ్రులకు, చుట్టూ ఉన్నవారికి తమ ముఖాన్ని ఎలా చూపించాలన్న భావన మరో ఆలోచనను రానీయదు. ఇలాంటి సమయాల్లో పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మన దగ్గర విద్యార్థులకు అంతగా కౌన్సెలింగ్ లేదంటారు.. సైకాలజిస్ట్ హిప్నోకమలాకర్. చీటింగ్ చేశాడు.. అనగానే పోయి మీ పేరెంట్స్‌ను తీసుకురా అని గద్దిస్తారు. తాము చేసింది తప్పని అప్పటికే పిల్లలు భయపడుతూ ఉంటారు.తల్లిదండ్రుల కోపాన్నికూడా తట్టుకోలేక తోచిన నిర్ణయం తీసుకుంటారు.

పిల్లలతో చర్చించడమే..!

ఈ పరిణామం నుంచి పిల్లలను బయట పడేయాలంటే, వారితో ఇలాంటి విషయాల గురించి ముందుగానే చర్చించడం మంచిది. మెట్రో పాలిటన్ నగరాలలో పేరెంట్స్‌పై చేసిన పరిశోధన ద్వారా తేలిందేందంటే 70శాతం మంది తల్లిదండ్రులు కాపీయింగ్ గురించి పిల్లలతో మాట్లాడరు. ఎందుకంటే తమ పిల్లలు తప్పు చేయరని వారికో గట్టి నమ్మకం. పరీక్షల ముందు పరిణామాలను చర్చించగలిగితే కాపీయింగ్ అటు తర్వాత సంభవించే ఆత్మహత్య ప్రయత్నాలను చాలా వరకు నివారించవచ్చు. పెద్దల ఓదార్పు, దగ్గరితనం, భరోసా.. పిల్లలు తప్పుడు ఆలోచనల వైపు దృష్టి మరలకుండా కాపాడుతాయి. కష్టపడి చదివి తెచ్చుకున్న మార్కులు, ర్యాంకులు ఏవైనా అవి తమ భవిష్యత్‌కు ఆనంద సూచికలు అవుతాయని తెలియకజెప్పిన వారవుతారు. కాపీ చేయడంకాక ఎదుటి వారి మంచి వ్యక్తిత్వాన్ని కాపీ చేసినట్లయితే భవిష్యత్తుకు మంచి పునాది అవుతుందని తెలియజేయడం తల్లిదండ్రుల బాధ్యతే!



విద్యా వ్యవస్థలోని లోపాలే కారణం..


10/10 గ్రేడ్ రావాలని తల్లిదండ్రుల ఆంక్షలు, ప్రభుత్వ నిబంధనలు విద్య వ్యాపారంగా మారిన ప్రస్తుత తరుణంలో మార్కుల పెంపుకోసం ప్రైవేటు స్కూళ్లు చేస్తున్న తప్పుడు పని ఒకటి అయితే ప్రాక్టికల్స్‌లో ఇంటర్నల్‌గా ఈ అలవాటును ప్రైవేటు యాజమాన్యాలే పెంచిపోషిస్తున్నాయి. పర్సంటేజీలు రాకుంటే పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు రద్దు చేస్తామన్న హెచ్చరికల నేపథ్యంలో అడ్మిషన్లు రావేమో అన్న భయంతో వారే చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. పిల్లలు బాగా చదవకపోవడానికి ఒక మేధోపరమైన అంశమే కాకుండా కుటుంబపరమైన, సామాజిక పరమైన ఎన్నో అంశాలతో ముడిపడి ఉంటుంది. ఇది గమనించి తీర్చిదిద్దాల్సిన వారే.. ఇవేవీ పట్టించుకోకుండా ఉపాధ్యాయులు మార్కులు ర్యాంకులు, రావాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడమే కాపీ కొట్టడానికి కారణం. కాపీయింగ్‌కు తల్లిదండ్రులకు ఎటువంటి సంబంధం ఉండదు. విద్యావ్యవస్థలోనే పూర్తిగా మార్పులు రావాలి. నిమిషం లేటు నిబంధనతో ఎంతోమంది విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

- హిప్నోకమలాకర్, మానసిక నిపుణులు..

వేల ఏళ్ల క్రితమే చిత్రకళ

గుహల గోడలపై చిత్రాలు.. ప్రాచీన మానవులకూ తెలుసు

నేటి ఆధునిక మానవులలోనే కాదు ప్రాచీన మానవుడిలోనూ కళాత్మక ధోరణి ఉందని తాజా ఉదంతం తెలియజేస్తోంది. మన పూర్వీకుల కాలంలోనే అంటే సుమారు 64 వేల సంవత్సరాల క్రితం గుహలలో జీవిస్తున్న ఆదిమ మానవుడు వేసిన చిత్రాలను పరిశోధకులు తాజాగా గుర్తించారు. అప్పట్లో గుహ గోడలపై వివిధ ఆకృతులను గీసిన వైనం ఇప్పుడు బయటపడింది.



ఫోటో రైటప్: నియాండెర్తల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం

- మాటల ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం
- హామీల అమలులో టీఆర్ఎస్ విఫలం: ఉత్తమ్
- ప్రజలారా.. తిరగబడండి: జానారెడ్డి

నిజామాబాద్, మార్చి 4(మనం న్యూస్ బ్యూరో): మోసపూరిత వాగ్దానాలతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంకోసం ప్రజలకిచ్చిన హామీలేవి ఇప్పుడు ఆయనకు గుర్తుకులేవని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్క హామీ నెరవేర్చని సీఎం కేసీఆర్ ప్రజలను మోసంచేస్తున్నాడని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాలను మోసంచేసిందని ఆరోపించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లాలోని బోధన్‌లో బస్సు యాత్ర సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. టీఆర్ఎస్ తమను మోసం చేసిందని, దగా చేసిందని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా బోధన్ ప్రజలకు చెక్కర ఫ్యాక్టరీ తెరిపిస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఫ్యాక్టరీ తెరిపిస్తామని వివరించారన్నారు. ఇక్కడ ఎంపీ కవిత, ముఖ్యమంత్రి కేసీఆర్‌లో వాగ్దానాలు చేశారని నాలుగేళ్ళు అవుతున్నా ఇంతవరకు నిజాం చెక్కర పరిశ్రమ తెరవలేదని మండిపడ్డారు. దీనికి ఆ పార్టీ నేతలు ఏంజవాబు చెబుతారని ఉత్తమ్ నిలదీశారు. ఆదివారం నాడు బోధన్ పట్టణంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ ప్రజాచైతన్య యాత్ర సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి మాటల ప్రభుత్వంగా పేరుగాంచిన టీఆర్ఎస్ సర్కారును దించేయాలని పిలుపునిచ్చాడు. చేతల ప్రభుత్వాన్నికి అధికారం ఇద్దామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. హామీల ప్రభుత్వంగా మారిన టీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్‌ను బొంద పెట్టండి..

బోధన్ ప్రజలను టీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కవితలు మోసంచేశారని, బోదన్‌లో ప్రజలను మోసం చేసిన టీఆర్ఎస్‌ను బొంద పెట్టి సుదర్శన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాల ని ఉత్తమ్ ప్రజలకు పిలుపునిచ్చారు, కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే చెక్కర రైతులను ఆదుకునేందుకు అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకం గా పనిచేసిన యువకులు, నిరుద్యోగులు, విద్యార్థులను కేసీఆ ర్ ఘోరంగా మోసంచేశారని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి తన ఇంట్లోనే నాలుగు ఉద్యోగాలు ఇచ్చుకున్నాడు తప్ప రాష్ట్రంలో ఎవరికి ఉద్యోగం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులు ఎంత చదువుకున్నా ఒక్క పైసా కట్టే అవసరంలేకుండా చేపట్టిన ఫీజు రియంబర్స్‌మెంట్‌ను కూడా నీరుగార్చేశారని ఆయన విమర్శించారు. రైతులు ఆత్మహత్య చేసుకొని వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతే కేసీఆర్ మాత్రం అవినీతి సొమ్ముతో జల్సాలుచేస్తూ అడ్డగోలుగా బలిసి కాంగ్రెస్ నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శిం చారు. నేడు తెలంగాణలో రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, కనీస మద్దతు ధరలులేవు, మార్కెట్‌లలో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసే వారు ఖమ్మంలో రైతులు మద్దతు ధరలు కావాలని అడిగితే గిరిజన రైతులని కూడా చూడకుండా బేడీలువేసి జైల్లో పెట్టారు ఇలాంటి ముఖ్యమంత్రి వ్యవసాయం గురించి, రైతుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. తెలంగాణలో మహిళలు తీవ్రంగా అవమానాలకు గురవుతున్నారని ఉత్తమ్ విమర్శించారు. దేశంలో మహిళా మంత్రిలేని మంత్రివర్గం ఇదొక్కటేనని, మహిళలకు అభయ హస్తం పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. కాగా, అధికారంలోకి వచ్చిన వంద రోజులలో నిజాం చెక్కర పరిశ్రమను తెరిపిస్తామన్న హామీ ఏమైందంటూ ఎంపీ కవితను మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ నిలదీశారు. హామీల అమలు మరిచి తండ్రికి భజన చేయడం తప్ప ఎంపీ కవిత చేసిందేమీ లేదని మండిపడ్డారు. ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేయడంలో విఫలమైన టీఆర్ఎస్ నాయకులు దద్దమ్మలని షబ్బీర్ అలీ విమర్శించారు. కేసీఆర్ పెద్ద లోఫర్ అయితే కేటీఆర్ చిన్న లోఫర్ అని షబ్బీర్ అలీ దుయ్యబట్టారు.


బోధన్ సభలో ఉత్తమ్, షబ్బీర్ అలీ, వీహెచ్ తదితర నేతలు

మూడో ఫ్రంట్ ఒక నాటకం

నాలుగేళ్ళుగా అటు దేశానికి బీజేపీ, ఇటు రాష్ట్రానికి టీఆర్ఎస్ ఏమి చేయలేకపోయాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. దీంతో ప్రజలు తిరగబడే అవకాశం ఉందని వారిని పక్కదారి పట్టిం చేందుకు కేసీఆర్ జాతీయ స్థాయిలో మూడో ఫ్రంట్ అంటూ కొత్త నాటకానికి తెరలేపారని టీపీసీసీ అధ్యక్షు డు ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మోదీతో సన్నిహితంగా మెలిగిన కేసీఆర్ ఇప్పుడు బీజేపీని విమర్శించడం ఒక నాటకమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఒక్క హామీ నెరవేర్చలే: జానారెడ్డి



హైదరాబాద్, మార్చి 4: కేసీఆర్ ప్రజలను మోసం చేశారు, ఇచ్చిన హామీలలో ఒక్కటికూడా నెరవేర్చలేదని సీఎల్పీ నేత జానారెడ్డి మండిపడ్డారు. రైతులకు, కూలీలకు మేలుచేసే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలలో పట్టంకట్టాలంటూ పిలుపునిచ్చారు. నాలుగేళ్ళు అవుతున్నా ఒక్క హామీ అమలుచేయలేని టీఆర్ఎస్ ప్రభుత్వానికి పాలించే అర్హతలేదన్నారు. అలవిగాని హామీలు గుప్పించి ప్రజలను మోసంచేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకి అవసరమయ్యే ఎన్నో చట్టాలను తీసుకొచ్చిందని చెబుతూ.. ఆరోగ్యశ్రీ పథకంలేకుంటే వైద్యంకోసం రైతన్న తన భూములను అమ్ముకోవాల్సి వచ్చేదని చెప్పారు. కాంగ్రెస్ పథకాలను పేరు మార్చి కొనసాగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఘనతగా చెప్పుకుంటున్నాయని జానారెడ్డి ఆరోపించారు. నాలుగేళ్లు గడుస్తున్నా డబుల్ బెడ్‌రూం పథకం, దళితులకు మూడెకరాల భూపంపిణీ ఎందుకు అమలుచేయడంలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కేసీఆర్ కేంద్రానికి వెళ్తానని కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. మేధావులు ఆలోచించి, విద్యార్థులు ఎదురు తిరిగి, రైతులు ఏకమై ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

కో'టీ'శ్వరుడు

- చాయ్ అమ్మకంతో నెలకు 12 లక్షలు

పుణే, మార్చి 4: టీ తాగడం వల్ల కలిగే లాభాల సంగతి సరే.. అమ్మే వారికి వచ్చే లాభాల విషయం ఎవరూ చెప్పరు. పుణేకు చెందిన ఓ టీ కొట్టు యజమాని నెలవారీ సంపాదన తెలిస్తే.. వామ్మో.. అని ఎవరైనా నోరు తెరవాల్సిందే. ఎందుకంటే ఒకటీరెండు కాదు ఏకంగా నెలకు రూ.12 లక్షలు సంపాదిస్తున్నాడట. 'యెవ్లే టీ హౌస్' పేరుతో నవనాథ్ యెవ్లే అనే వ్యక్తి టీ అమ్ముతూ ఇంతేసి లాభాలను ఆర్జిస్తున్నాడట.. అంతకుముందు నాలుగేళ్ల పాటు స్థానిక రుచులపై అధ్యయనంచేసి ఓ ప్రత్యేకమైన టీ తయారు చేశాడు. ఇప్పుడదే ఓ బ్రాండ్‌గా మారింది.



సీఎం కేసీఆర్ వెంటే నేనుంటా

- పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి 4: దేశ రాజకీయాల్లో తన అవసరం ఉంటే ముందు నడుస్తానని సీఎం కేసీఆర్ పేర్కొనడం గొప్పవిషయమని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్ కేంద్ర రాజకీయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎంగా తెలంగాణను అభివృద్ధిపథంవైపు నడిపించిన కేసీఆర్ కేంద్ర రాజకీయాల్లోకి వెళితే దేశం బంగారు భారతంగా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే తామంతా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు తీసు కురావడానికి అవసరమైతే తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తానంటూ సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే! దీనిపై వివిధ వర్గాల నుంచి సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని పలు రంగాలకు చెందిన ప్రముఖులు స్వాగతిస్తున్నారు. సీఎం ప్రకటనపై శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మాదాపూర్ /హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ వి.పూజిత జగదీశ్వర్ గౌడ్, నియోజకవర్గ ప్రజలు, డివిజన్ కార్యకర్తలు ఆదివారం ప్రగతిభవన్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రధాని కావాలి

- బీసీ విద్యార్థి చైర్మన్ బాలరాజుయాదవ్

హైదరాబాద్, మార్చి 4(మనం ప్రతినిధి): కాంగ్రెస్, బీజేపీ పాలనతో దేశ ప్రజలు విసిగిపోయారని తెలంగాణ విద్యార్థి, బీసీ జేఏసీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ అన్నారు. ఆదివారం టీఎస్‌జాక్, ఓయూజాక్, టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల రాజుయాదవ్ మాట్లాడుతూ నూతన విజన్, ఎన్నో కలలో ప్రజలు సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి రావాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. పేదలు, రైతులు, విద్యార్థుల పట్ల సీఎం కేసీఆర్‌కు అమితమైన ప్రేమ ఉందన్నారు. కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి రావాలని, ప్రధాని కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో షేక్ సైదా, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

థర్డ్ ఫ్రంట్‌కు మూడొచ్చిందా?

- కలిసొచ్చేందుకు కొన్ని జాతీయ పార్టీలు సిద్ధం
- టీఎంసీ, జేఎంఎం రాక దాదాపు ఖాయం
- ఆచితూచే ధోరణిలో డీఎంకే, జేడీఎస్, ఎస్పీ
- కూటమి బలపడితే కలవనున్న 17 పార్టీలు
- తానూ మద్దతిస్తానంటున్న పవన్‌కల్యాణ్
- గతంలో కేంద్రమంత్రిగా చేసిన సీఎం కేసీఆర్
- నాటి పరిచయాలతో పలువురు నేతలతో చర్చ



హైదరాబాద్, మార్చి 4: కేంద్రంలో బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జాతీయ రాజకీయాల్లో ఇది తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా దేశంలోని స్థానిక పార్టీలు, కమ్యూనిస్టులను కలుపుకొని టీడీపీ అధినేత ఎన్టీఆర్ 'నేషనల్ ఫ్రంట్'ను ఏర్పాటు చేసి దాని సారథ్యంలో ప్రభుత్వాన్నే ఏర్పాటు చేశారు. ఇప్పుడు కేసీఆర్ దాదాపు అలాంటి ప్రకటన చేయడంతో మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఓవైపు బీజేపీ దూకుడు ప్రదర్శిస్తుంటే.. మరోవైపు ఆ ధాటికి కాంగ్రెస్ ఎదురు నిలవలేక చతికిలపడుతోంది. అదే సమయంలో.. రాష్ట్రాల అభిప్రాయాలను బీజేపీ ఏమాత్రం పట్టించుకోవట్లేదని, కనీస గౌరవం కూడా ఇవ్వట్లేదనే వాదన బలపడుతోంది. బీజేపీ మిత్ర పక్షమైన టీడీపీ, శివసేన అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ తరుణంలో కేసీఆర్ ప్రతిపాదించిన థర్డ్ ఫ్రంట్ కార్యరూపం దాల్చే అవకాశం ఉందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. దేశవ్యాప్త రైతు సమస్యల పరిష్కారం, రాష్ట్రాల అధికారాలను కాపాడుకోవడం లాంటి అంశాలతో జాతీయస్థాయిలో సానుకూల ఫలితాలు సాధించవచ్చునని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. మరి థర్డ్‌ఫ్రంట్‌లోకి ఏయే పార్టీలు రావొచ్చని పరిశీలిస్తే..

అఖిలేశ్, ఇతరులు కలిసొచ్చేనా..!

ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కూడా కొంతవరకు సుహృద్భావ వాతావరణం నెలకొంది. బీజేపీ-టీడీపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో వారు విడిపోతే టీడీపీ సైతం తృతీయ కూటమి దిశగా మొగ్గుచూపే అవకాశాలే ఎక్కువ. మరో వైపు ఒడిశాలో నవీన్ పట్నాయక్ బీజేపీ వైపు మొగ్గుచూపే పరిస్థితులు లేవు. వామపక్ష పార్టీలు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు నుంచి డీఎంకే నేత స్టాలిన్, యూపీలో ములాయం-అఖిలేష్, మాయావతి, బీహార్‌లో లాలూ... అలా అందరితో కలిసి వెళ్లే ప్రయత్నాలను కేసీఆర్ ఇప్పటికే మొదలుపెట్టి ఉంటారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ వామపక్షాలు కాంగ్రెస్ వైపు కూడా చూస్తున్నాయి. దాంతో

మమత, హేమంత్ సోరెన్ ఖాయం

థర్డ్ ఫ్రంట్ ఏర్పడితే అందులో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ చేరటం ఖాయంగా కనిపిస్తోంది. ఫ్రంట్ ఏర్పాటుపై కేసీఆర్ చేసిన ప్రకటన మర్నాడే మమతాబెనర్జీ అందుకు మద్దతు తెలిపారు. నేరుగా సీఎం కేసీఆర్‌కే ఫోన్ చేసి సంపూర్ణ మద్దతు తెలిపారు. ''మేం మీతో ఏకీభవిస్తున్నాము. మీతో కలిసి మేముంటాం'' అని మాటిచ్చారు. ఇక.. జార్ఖండ్ ముక్తిమోర్చా నేత, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా కేసీఆర్‌కు బాసటగా నిలిచారు. జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలన్న కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతించారు.

స్టాలిన్ చూపు ఎటువైపు..!

తమిళనాడులో అధికారంలోకి రాకపోయినా తన గుప్పిట్లో ఉంచుకోవాలని బీజేపీ కాచుక్కుర్చుని ఉంది. ఆ దిశగా ఇప్పటికే స్టాలిన్‌తో బీజేపీ హైకమాండ్ టచ్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. బిహార్ విషయానికి వస్తే నితీష్ ఇప్పటికే బీజేపీ వెంటే ఉన్నారు.

బీజేడీ మద్దతు పలికేనా..!

ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ఆ రాష్ట్రంలో ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తోంది. గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఆ పార్టీ మధ్యలోనే తెగదెంపులు చేసుకుంది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో పాగావేయాలని బీజేపీ వ్యూహాలు పన్నుతోంది. ఇటీవలే అమిత్ షా కూడా.. ఒడిశాలో పాగా వేయడమే తమ ప్రథమ కర్తవ్యమన్నారు. దాంతో బీజేడీ తప్పనిసరి పరిస్థితుల్లో థర్డ్‌ఫ్రంట్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇతర పార్టీలు..

కర్ణాటకలో జేడీఎస్, పంజాబ్‌లోని అకాలీదళ్, మహారాష్ట్రలోని శివసేన, అవసరమైతే బీఎస్పీ, లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ కూడా ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నాయి. అవి.. అటు బీజేపీతోనూ, ఇటు కాంగ్రెస్‌తోనూ కలవలేని పరిస్థితి. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఎన్‌సీపీదీ ఇదే పరిస్థితి. వీరందరూ ఏకతాటిపైకి వస్తే థర్డ్‌ఫ్రంట్ ఏర్పడటం ఖాయం. దేశవ్యాప్తంగా బీజేపీ పాలన పట్ల ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీకి ఎదరుగాలి వీస్తోందని ఉప ఎన్నికల ఫలితాలే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో..బీజేపీని ఎదుర్కొనేలా ప్రాంతీయ పార్టీలు ఏకమవుతున్నాయనే సంకేతాలు కనపడుతున్నాయి.

దూసుకెళ్తున్న బీజేపీ..

భారతీయ జనతా పార్టీ రాజకీయ కదనరంగంలో దూసుకెళుతోంది. 2014లో మొదలైన దాని జైత్రయాత్ర కొనసాగుతూనే ఉంది. దేశంలోని 29 రాష్ట్రాలకు గాను 21 రాష్ట్రాలో కాషాయ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటూ యాత్ర ప్రారంభించిన బీజేపీ.. ఇప్పుడు మధ్య, ఈశాన్య రాష్ట్రాల్లో మొత్తంగా పాగా వేసింది. ఇప్పుడు దానికి దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్ మాత్రమే కొరకరాని కొయ్యగా మారాయి. ప్రస్తుతం కాంగ్రెస్ చేతిలో పంజాబ్, కర్ణాటక, మిజోరాం మాత్రమే మిగిలాయి. పశ్చిమబెంగాల్, ఒడిశా, ఢిల్లీ, తెలంగాణ, కేరళ ప్రాంతీయ పార్టీల చేతిలో ఉన్నాయి. వచ్చే సంవత్సరం జరగబోయే ఎన్నికల్లో కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో పాగా వేయాలని బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎం మూడో కూటమిపై చేసిన ప్రకటన సంచలనంగా మారింది. కాంగ్రెస్, బీజేపీలు కాకుండా.. జాతీయ స్థాయిలో కొత్త శక్తి అవసరం ఉందని.. దేశంలో ప్రబలమైన మార్పు అత్యవసరమని విశ్లేషణలు జోడించారు. మూడో ఫ్రంట్ దిశగా అడుగులు వేస్తే.. దానికి తానే నాయకత్వం వహిస్తానని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో అందరినీ కలుపుకెళ్లాలన్నారు.

అందరినీ దగ్గరికి తీసున్న కేసీఆర్..

గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో కేసీఆర్‌కు వివిధ ప్రాంతీయ పార్టీలకు చెందిన జాతీయస్థాయి నేతలతో పరిచయం ఉంది. దాంతో నెమ్మదిగా అందరినీ చేరదీస్తూ థర్డ్ ఫ్రంట్ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. దీనికి ఇంతవరకు ఆయనకు ప్రతికూల స్పందన ఎదురుకాలేదు. కేంద్రం ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని గణాంకాలతో సహా చెబుతున్న కేసీఆర్ వాదనతో అంతా ఏకీభవిస్తున్నారు.

ఢిల్లీ పర్యటనలో మంతనాలు..

కేసీఆర్ ఇటీవలి ఢిల్లీ పర్యటన 'థర్డ్ ఫ్రంట్' ప్రయత్నాలకు ఊతమిచ్చిందని రాజకీయ పండితులు అంటున్నారు. దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఎలా మారబోతున్నాయనే అంశంపై ఒక అంచనాకు వచ్చిన కేసీఆర్.. ఢిల్లీలో సీనియర్ జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులతో దీనిపై చర్చించినట్టు సమాచారం. ప్రాంతీయ పార్టీలన్నీ జట్టుకడితేనే జాతీయ పార్టీల పెత్తనాన్ని నిలువరించవచ్చని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తోంది.

2014లోనే తెరపైకి థర్డ్‌ఫ్రంట్..!

2014 ఎన్నికలు దగ్గరకొస్తున్న నేపథ్యంలో మరోసారి థర్డ్ ఫ్రంట్ తెరపైకి వచ్చింది. ప్రధాని రేసులో తానుండాలని భావించిన బిహార్ సీఎం నితీశ్ కుమార్ థర్డ్ ఫ్రంట్‌కు నాంది పలికారు. ఆయన ఆధ్వర్యంలోని జేడీయూ థర్డ్ ఫ్రంట్ సమావేశానికి తెరతీసింది. ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో బీజేపీ, యూపీఏయేతర పార్టీల సమ్మేళనం జరిగింది. ఈ సమావేశానికి లెఫ్ట్ పార్టీలు, జేడీయూ, అన్నా డీఎంకే, బీజేడీ, ఎన్సీపీ, తదితర పార్టీలు హాజరయ్యాయి. దాదాపు 17 పార్టీలు థర్డ్‌ఫ్రంట్‌కు అనుకూలంగా ఉన్నాయని ఆ సందర్భంలో నితీశ్ ప్రకటించారు. కాలక్రమంలో అది తెరమరుగున పడిపోయింది.

ప్రశాంత నగరం హైదరాబాద్

- అన్ని శాఖల సమన్వయంతోనే భద్రత
- పోలీస్ శాఖకు క్రెడాయ్ సహకారం
- క్రెడాయ్ ముగింపు వేడుకల్లో డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 4 (మనం ప్రతినిధి): తెలంగాణ ఆవిర్భవించిన నాలుగేండ్లలోనే ఘర్షణలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని, గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో పోలీసింగ్ చేస్తున్నామని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హెచ్ఐసీసీలో నిర్వహించిన క్రెడాయ్ 6వ ప్రాపర్టీ షో ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... 2014 నుంచే హైదరాబాద్ పోలీసింగ్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేశామన్నారు. విదేశాల్లో పోలీసింగ్ వ్యవస్థపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, అలాంటి వ్యవస్థను ఇక్కడ కూడా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. నాలుగేండ్లుగా తెలంగాణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను, తీసుకున్న చర్యలను వీడియోలా రూపొందించి వివరించారు. ప్రజల్లో భద్రతాభావం పెంచడానికి టెక్నాలజీని వాడుకుని వారికి కావాల్సిన సౌకర్యాలు, చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అందుకోసమే రూ. 1200 కోట్లు ఖర్చు చేసి కంమాడ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మిస్తున్నారని, దీనికోసం సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఆగస్టులోపు ఈ భవనం పూర్తి కావాలని సీఎం ఆదేశించినట్టు పేర్కొన్నారు. ప్రాసెస్, ప్రజలు, టెక్నాలజీలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 800 పోలీస్ స్టేషన్లలో ఎక్కడకు వెళ్లినా ఒకే విధమైన పోలీసింగ్ చేస్తున్నామని, అప్పుడే ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం కల్గుతుందన్నారు. జీవించడానికి అనువైన నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. 'నేను సైతం' ప్రాజెక్టు కింద 2 లక్షల సీసీ టీవీలను ఏర్పాటు చేశామని, లండన్ మెట్రోపాలిటన్ నగరం మాదిరిగానే హైదరాబాద్‌లోనూ రాబోయే 3 ఏండ్లలో పది లక్షల సీసీ టీవీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వ్యవస్థను అన్ని శాఖలు ఉపయోగించవచ్చునన్నారు. భద్రత ఉంటేనే మిగిలిన శాఖలు సరిగా పనిచే స్థాయని పేర్కొన్నారు. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం వారి భద్రత కోసమ షీ టీమ్స్ ఏర్పాటు చేశామని, స్పాట్ కలెక్సన్ వ్యవస్థను తొలగించిన మొదటి నగరంగా హైదరాబాద్ నిలిచిందని తెలిపారు. క్రెడాయ్ సంస్థ కూడా పోలీస్ వ్యవస్థ సహకరించాలని, భవనాలు నిర్మించేటప్పుడు తగినంత పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రూ. 50 కోట్లతో డిజిటల్ వ్యవస్థలో పోలీసులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ వెర్టికల్ సిస్టమ్‌కు కూడా ప్రతిపాదనలున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చలాన్ కట్టలాల్సిందేనన్నారు.

ప్రజల్లో స్పందన సంతోషాన్నిచ్చింది

ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్రెడాయ్ 6వ ప్రాపర్టీ షోకు ప్రజల్లో ఇంతటి స్పందన రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. దాదాపు 50 వేల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 120 మంది డెవలపర్స్ తమ ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. దీనికోసం దాదాపు 150 స్టాళ్లను ఏర్పాటు చేశాం. ఇతర నగరాలతో పోల్చితే మన వద్ద నిర్మాణ రంగం గణనీయంగా అభివృద్ధి చెందింది. తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగాన్ని టీ ఎస్ ఐపాస్‌లోకి తీసుకవస్తే కొంత భారం తగ్గే అవకాశం ఉంటుంది.

-ఎస్.రాంరెడ్డి,
క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్





ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోని ఎదురుగా అర్ధనగ్నంగా నిరసన నిలుపుతున్న మహిళ


బెర్లుస్కోనీ.. నీ కథ ముగిసింది!

- అర్ధ నగ్నంగా మహిళ నిరసన

మిలాన్, మార్చి 4: ఇటలీ సార్వత్రిక ఎన్నికల్లో ఓ మహిళ వినూత్న నిరసనకు దిగింది. ఓ మహిళ అర్ధ నగ్నంగా తన శరీరంగాపై 'బెర్లుస్కోనీ.. నీ కథ ముగిసింది' అని రాసుకొని నిరసన తెలిపింది. ఆ దేశ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోని ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలో అడుగుపెట్టగానే ఆయన ఎదుట నిలిచి ఆమె నినాదాలు చేసింది. దీంతో ఆయనను పోలీసులు బయటకు తీసుకెళ్లారు. అనంతరం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అతి వాద, ప్రజా పార్టీలు అధికారంలోకి వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో ఇందులో కీలకపాత్ర పోషిస్తున్న బెర్లుస్కోనికి ఈ చేదు అనుభవం ఎదురవడం గమనార్హం. కాగా, 2013 ఎన్నికల్లోనూ ఆయన ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు మహిళా ఉద్యమకారులు తీవ్రంగా నిరసనలు తెలిపారు.

తుది ఏర్పాట్లలో చంద్రయాన్-2

చంద్రుడి ఉపరితలంపై నీటిజాడను వెతికేందుకు ఓ బుల్లి రోవర్‌ను పంపించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. చంద్రయాన్-2 స్పేస్‌క్రాఫ్ట్‌లో సూట్‌కేసు పరిమాణంలో ఉన్న ఈ రోవర్‌ను చంద్రుడిపైకి పంపించనున్నారు. ఇందుకోసం చంద్రుడి దక్షిణ ధ్రువంనుంచి దాదాపు 600 కిలోమీటర్ల దూరంలో ఓ ప్రాంతాన్ని ఎంపికచేశారు. ఇక్కడ చంద్రయాన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ల్యాండ్‌చేసి రోవర్‌తో పరిశోధనలు జరపాలని నిర్ణయించారు. మరో రోవర్‌ను చంద్రుడి కక్ష్యలో తిప్పుతూ పరిశోధన నిర్వహించనున్నారు. భవిష్యత్తులో చంద్రుడిపై చేపట్టే మానవసహిత ప్రాజెక్టులకు ఈ పరిశోధన కీలకం కానుందని ఖగోళ పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



మన సాహితి



మనిషిగా స్వేచ్ఛగా...

జీవితమే ప్రయాణమైనప్పుడు
ఎన్నో మజిలీలుటాయి
ఎన్నో ఆటంకాలు ఎన్నెనో అడ్డంకులు
ఎన్నో గాయాలు... ఎన్నో ఎన్నెనో
అయినా ధైర్యంగానే సాగిపోవడమే
మనిషి సాహసమే కవచం
నిండు గుండెతో నిర్భయత్వమే నీచోదక శక్తి
నిన్ను ఆవలితీరానికి చేర్చేది ఒక మార్గం
నీ ఆశ్రయ ద్వారం నీవు వెతుక్కోకుండా
చేరుకొనేది
ఒక అపూర్వ గమ్యం గమనమే
ఆదర్శాల వ్యక్తులకు ఎన్ని అవరోధాలెదురైనా
అండదండలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు
సాగిపో నిర్భీతిగా!
అది అడవయినా ఊరయినా జనలోకమైనా
నింగీనేల సముద్రాకాశాలైనా నిరంతరంగా
మనిషిగా స్వేచ్ఛగా...

- డాక్టర్ సి.హెచ్. ఆంజనేయులు


Everyday WOMEN
'సామాన్యశాస్త్రం' ప్రదర్శన

అటు అభివృద్ధి, ఇటు ప్రగతి, ఈ రెండూ అనేక విధాలా జీవితంపై ప్రభావం చూపుతాయి. ప్రచార, ప్రసార మాధ్య మాలు వీటి తాలూకు వార్తలు, కథనాలు, చిత్రాలనే అధి కంగా ప్రాచుర్యంలోకి తెస్తుంటాయి. నిజానికి సుప్రసిద్ధం కావలసింది వాటికి అతీతంగా ఉన్న మెజారిటీ ప్రజల జీవితం. అది ఇంకా సామాన్యంగానే ఉంది. మహిళల జీవితాలు పెద్దగా మారనేలేదు. అనాదిగా వారి సుఖశాంతుల స్థితీ గతీ అలాగే ఉంది. అయినా మహిళ భూదేవి. ఆమె ఒక గొప్ప చిత్రం. తన సంతోషం, వేదన, సాహచర్యం, ఆత్మ శాంతి – ఇవన్నీ మనం ఇంకా సన్నిహితంగా చూడవలసే ఉంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరా బాద్‌లోని సామాన్యశాస్త్రం గ్యాలరీలో ఇలాంటి రోజువారీ జీవితాలను ప్రదర్శనకు పెడుతున్నాను. 'Everyday WOMEN' పేరిట జరిగే ఈ ఛాయాచిత్ర ప్రదర్శన. మంగళవారం 6వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు మామిడి హరికృష్ణ ప్రారంభిస్తారు. నెలరోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు అందరికీ ఆహ్వానం. ప్రవేశం ఉచితం.

- కందుకూరి రమేష్ బాబు

కవిసంధ్య-పానుగంటి
కవితల పోటీ ఫలితాలు



ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిసంధ్య, కవిత్వ పత్రిక పానుగంటి ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కవితల పోటీ ఫలితాలు...మొదటి బహుమతి (3,000 రూ.) బంగార్రాజు కంఠ, విజయవాడ (గాడ్స్ డెత్ సర్టిఫికెట్ కవితకు), రెండో బహుమతి (2,000రూ) పి.అశోక్ కమార్, యానాం (ఇంటి పాదాల వద్ద కవితకు), మూడో బహుమతి (1000రూ) బండారి రాజ్‌కుమార్, వరంగల్ (నల్ల కుందేలు కవితకు) గెలుపొందారు. వీరితో పాటు మరో పది మందిని ప్రత్యేక బహుమతులకు ఎంపికచేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సుధామ, పోటీల కన్వీనర్ దాట్ల దేవదానం వ్యవహరించారు. ఈ నెల 21న యానాంలో జరిగే 'ప్రపంచ కవితా దినోత్సవం'లో బహుమతుల ప్రదానం జరుగుతుంది.

- కవిసంధ్య
యానాం.



◆ ఎన్. మదనయ్య

> ప్రజా దృక్పథం గల వారు, ప్రజల కోసం పని చేసే వారైతేనే సమాజం కోసం రాస్తారు. రమణారెడ్డి గారు ఇలాంటి వారు కాబట్టే తనూ వారిలో ఒకరైనా రాజకీయులు, పాలకుల విధానాలను, పద్ధతులను చీల్చి చెండాడారు. విరుపులు, ఒడుపులున్నాయి కాబట్టే ఆయన కలం వీరవిహారం చేసింది. పీడన, తాడనలను ఎండగట్టింది. విషయముంది కాబట్టే కనిపించే ఘటనల వెనుకనున్న వైఖరులను విడమర్చి తత్వబోధన చేసింది. కాబట్టే ఈ వ్యాసాలు సామాజికులకు దన్నుగా, ప్రజా కంటకులకు గన్నుగా ఉన్నాయి. నిష్క్రియా'తంత్రం'లో చిక్కుకుపోయిన ప్రజలకు క్రియాశీలతను నేర్పిస్తుంది. కాబట్టే సామాన్యుడి శంఖారావమైంది, సామాజిక దిక్సూచి అయింది.

నేటి ఘంటానాదం...
ప్రగతికి 'శంఖారావం'

'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి' అన్న నానుడికి, 'శంఖారావం' పుస్తకం చదివిన ఎవరికైనా 'చదివితే శాస్త్రం చదువుకున్న వారు రాసిన పుస్తకాలే చదవాలి' అని కూడా చేర్చుకోవాలనిపిస్తుంది.


శాస్త్రీయ విధానం ఆచరిస్తున్న వారూ, గతి తర్క పద్ధతిలో చరిత్రను అర్థం చేసుకున్న వారూ, సత్య సూత్రాల ఆధారంగా సమాజాన్ని పరిశీలిస్తున్న వారూ అయిన ఎం.వి.రమణారెడ్డిగారు రాసిన వ్యాసాలు, వ్యక్తీకరణలతో కూడిన పుస్తకం కాబట్టి ఇట్లా అనిపించడం సహజమే. ఎందుకంటే బహుముఖ ప్రజ్ఞాశాలి, నిత్య పరిశోధక విద్యార్థి కూడా అయిన ఈయన రచనలు ఎంతటి అవగాహనతో కూడినవో, విషయాన్ని ఎంతగా విశ్లేషిస్తాయో, ఏ రీతిలో పొందు పరుస్తాయో పుస్తకాభిరుచి గలవారికి తెలిసిన విషయమే. వైద్యునిగా, ఉద్యమనిర్మాతగా, మేధావిగా, రాజకీయ నేతగా, పరిపాలకుడుగా ఆయనకున్న విశేష అనుభవమే ఆయన చేత విలువైన రచనలు చేయిస్తుంది. గతంలో ఈయన పుస్తకాలు ఎంతమందికి ప్రేరణ కలిగించాయో, అంతేమందిలో వివేచనాయుత ఆలోచనలు కూడా రేకెత్తించాయి. అందుకే ఆయన రచనలు ఇతర భాషల్లోకీ అనువాదితమైనాయి.

వివిధ సందర్భాల్లో ఆయన చేసిన ప్రసంగాలు, రాసిన వ్యాసాల సంకలనమైన 'శంఖారావం' ఇదే ఒరవడిలో వచ్చిన రమణారెడ్డిగారి ఇతర రచనలకన్నా మరింత విస్తృతమైనది. జీవితకాల అధ్యయనం, పరిశీలన ద్వారా గడించిన అనుభవంతో కూడిన వ్యక్తీకరణలివి. 320 పేజీల ఈ పుస్తకంలో దాదాపు 60 అంశాలపై 64 వ్యాసాలున్నాయి. ఒక్కొక్క ఆర్టికల్ ఎన్నెన్నో విషయాలను విశ్లేషిస్తూ దిశానిర్దేశనం చేస్తుంది. అన్నం ఉడికిందో లేదో తెలుసుకోవడానికి కొన్ని మెతుకులను పట్టుకుని చూసినట్లుగానే ఈ పుస్తకంలోని 'సరుకు', దాని సత్తా తెలుసుకోవడానికి కొన్నిటిని ఇక్కడ చర్చిద్దాం.

పుస్తకం ముందు మాటగా 'రక్త కన్నీరు' అంటూ రాసిన ఆయన స్వగతంలో 'భావి తరాలు నా రచనను అందుకోగలవనే ఆశ చిగురించింది. చారిత్రక గమనంలోని వాస్తవాలను వారికి అర్థం చేయించడం కోసమే నా వ్యాసాలను సంకలన పరిచాను' అని చెప్పడం ఆయన దార్శనికతను చాటుతుంది.

మొదటి వ్యాస శీర్షిక 'మగ పార్లమెంటులో మగువల బిల్లు' టైటిల్‌లోనే మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు ఏమిటో నర్మగర్భంగా సూచిస్తారు. 'ఓ స్త్రీ రేపు రా' అని పార్లమెంటు గోడల మీద రాసినట్లుంది' అని బిల్లు స్థితిగతులను పోల్చడం నేతిబీరలో నేయి ఎంత ఉందో, మగ పార్లమెంటేరియన్ల ప్రయత్నాల్లోనూ అంతే యత్నముందని చెప్పడం ద్వారా వాస్తవాన్ని స్పష్టీకరిస్తారు. 'రాజకీయాధికారాన్ని పంచి ఇవ్వడం చింతపూల చీటీకోక కొనిచ్చినంత తేలిక గాదు' అంటూ మహిళలు ఉద్యమించాల్సిందే తప్ప పురుషులతో కాదు అని రాయడం ద్వారా చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించండో...' అంటూ మగవారి చుట్టూ తిరగటం కంటే, మహిళలు సొంత రాజకీయ పార్టీని స్థాపించుకుంటే అందరికీ దిమ్మదిరుగుతుంది' అంటూ మహిళలకో 'గతి' నిర్దేశనం చేశారు. బిల్లుపై దాగుడుమూతలాడే రాజకీయుల నైజాన్ని తేటతెల్లం చేశారు. ఈయన కూడా రాజకీయుడే, ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేశారు. అయినా ఇట్లా రాశారంటే సమాజం, అందులో సగభాగమైన మహిళలు వారి అభ్యున్నతి పట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రకటిస్తుంది.

రొచ్చుగుంతలో చేపల వేట అన్న ఆర్టికల్‌లో 'ప్రజల ఆహారపు టలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల రైతులు వరిసాగువైపు మొగ్గు చూపుతున్నారు. జొన్నరొట్టె,జొన్న సంకటి ఆహారంగా తీసుకునే జనం ఇప్పట్లో లేరు. ఒకప్పుడు 'ఆబువ్వ'గా పిలుస్తూ పేదజనం అపురూపంగా చూసిన తెల్లన్నం ఇప్పుడు సాధారణ భోజన పదార్థం. మారిన ఈ పరిస్థితుల వల్ల సాగునీటి కొరత అనివార్యంగా ముంచుకొచ్చింది' దీనివల్లే నీటి కోసం పోరాటాలు జరిగే పరిస్థితులొచ్చాయంటూ సాగునీటి కోసం జరిగే ఆందోళనకు అసలు కారణాలు వివరిస్తూనే, ఈ ప్రజావసరంలో నేతల రాజకీయం చొరబడి ఆందోళనలు కాస్తా కొట్లాటలుగా మారడాన్ని విశ్లేషించిన తీరు అక్షరాల్లోని అర్థాలను, పదాల్లోని లోతలను ఎంత చక్కగా వినియోగించుకున్నారో తెలుపుతుంది.



> రాయలసీమ యాసతో కూడిన రాజకీయ విసుర్లతో కూడిన పంచ్‌లు వేస్తూ కనిపించే వాస్తవాల వెనుక కనిపించని సత్యాలు తెలియజేయడం ఈయన శైలి. విషయ వివరంలో సీమ సంస్కృతి, భాషను చాకచక్యంగా వాడుకున్నారు. చాలకొస్తున్న, బలకొనేలా, ఎగచూసే, ఈ దినం వంటి పదాలు పాఠకుడి మనస్సులో సీమదనాన్ని ఎక్కిస్తాయి. 'ఉండీ వొకటే, లేకా వొకటే...' వంటి నుడికారాలు ఆయన రాతల్లోని సీమ జాణతనం చదువరుల్లో భావోద్వేగాలను రేపుతుంది. దీనికి తోడు ... మగ పార్లమెంటులో మగువల బిల్లు, రమణుల కోసం రాజ్యాంగాన్ని సవరించడం..., రొచ్చుగుంతలో చేపలవేట, శవాలపై చిందులు వేస్తున్న తొగాడియాలు' వంటి విరుపులు విషయానికి ప్రతీకలుగా ఉండడంతో పాటు, ప్రజా దృక్పథంతో, రాయలసీమ రమణీయ చమత్కారాలతో రాజకీయాలపై సెటైర్లు వేయడం చదువరు భావోద్రేకాలను కట్టి పడేస్తాయి.

'పోలవరం మాటున పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో రాసిన దాంట్లో వైఎస్ 'శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులన్నీ, ఆయన చెబుతున్న గడువులో పూర్తి కావాలంటే, ప్రపంచ బ్యాంకునే ఎత్తుకురావాలి తప్ప, విడతలు, విడతలుగా కేంద్ర ప్రభుత్వమిచ్చే అప్పు ఏ మూలకూ చాలదు' అని రాయడంలో వైఎస్ మాటల్లోని మర్మం, ప్రయత్నాల్లో వాస్తవికత చెప్పడం... అంతే కాదు రాజకీయుల మాటల్లోనే కాదు, చేతల్లోనూ డొల్లతనమే అని చెప్పడం... ఆయన రాజకీయ విమర్శనా సునిశితత్వాన్ని తెలియజేస్తుంది.

'కొత్త పుంతల్లో బడ్జెట్ కాలక్షేపం అన్న వ్యాసంలో 'ఒక్కోసారి వాడిగా వేడిగా, ఒక్కో సారి నవ్వులాటగా, మరోసారి అభ్యంతరకరంగా అసభ్యంగా, అంతలోనే సంబరంగా... బడ్జెట్ మీద చర్చలు మన శాసనసభలో రసవత్తరంగా సాగుతుంటాయి. బాక్సాఫీసు సినిమాకు అవసరమైన హంగులన్నీ సమకూరడంతో ఆ కార్యక్రమాలు చూడటానికి జనం ఎగబడుతుంటారు... టీవీలకు అతుక్కుపోతుంటారు... అవి ఆగిపోతే జనం ఇంటర్వెల్లో ఇంటికి గెంటేసినంతగా నొచ్చుకుంటున్నారు' అన్న వాక్యాలు అసెంబ్లీలో మన ప్రజాప్రతినిధుల చర్చల్లోని చేవను సామాన్యుల భాషలో ఎంత సులభంగా చమత్కరించారో అర్థం చేసుకోవచ్చు.

'ఈ బందులూ రాస్తారోకోలూ ఏ పరమార్థం కోసం?' అన్న విశ్లేషణలో 'మొగుడి మీద కోపమొస్తే, అక్కసంతా పిల్లల మీద తీర్చుకునే పెళ్లాలూ ఇప్పటికీ కనిపిస్తారు... ఆఫీసరు మీద అలిగితే, ఇంటికొచ్చి సొంత పెళ్లాన్ని చితకబాదే గవర్నమెంటు గుమస్తాలూ ఉన్నారు. అంటూ తాను భాగమైన ప్రజల సైకాలజీ, ప్రతిపక్షాల నైజాన్ని ఎండగట్టారు. తానూ ఒక భాగంగా ఉన్న సమాజంపైనా ఛలోక్తులు వేయడం రమణారెడ్డిగారికే చెల్లింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కొనసాగిన నేపథ్యంలో రాసిన '... సమైక్యతకు అడ్డుపడుతున్న కొన్ని సమస్యలు' అన్న వ్యాసంలో 'తెలుగు మాట్లాడే జనమంతా ఒకే కుటుంబంగా ఏర్పడాలనే తహతహ 'విశాలాంధ్ర'కు పునాది. కానీ, అది క్షణికమైన ఉద్రేకమే తప్ప వాస్తవమైన సమైక్యత సాధించబడలేదన్నది మన చరిత్ర పదేపదే నిరూపిస్తుంది'

'తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాలు చల్లారిపోవడానికి ఉద్యమ నాయకత్వానికి ఎమ్మెలు మంత్రులు, ముఖ్యమంత్రులుగా ఎదగడమే...'

'ఆంధ్ర రాష్ట్రం' ఏర్పాటు సమగ్రమూ కాదు, ... సమైక్యమూ కాదు...' 'పెద్ద మనుషుల ఒప్పందాన్ని తుంగల్లో తొక్కడమైంది. ముల్కీ నిబంధనలు ఒదిలేసి, ఒప్పందం ప్రకారం తెలంగాణాకు దక్కవలసిన ఉద్యోగాలన్నీ కోస్తా పాలుగావడం అక్కడి వారికి మనస్తాపం కలిగించింది. తెలంగాణ పంటపొలాలను కారుచౌకగా కొనుగోలు చేసి, వలస కేంద్రాలు విస్తరించడం తెలంగాణ ప్రజల్లో ఆందోళన కలిగించింది' అని రాయడం సాహసమే తప్ప మరోటి కాదు. ఎందుకంటే సమైక్యమే శరణ్యమన్న మాటలు తూటాల్లా వేదికలపైనుంచి పేలుతూ 'ప్రత్యేక' ఉద్రిక్తతలు కొనసాగిన ఆనాడు ఈ విషయంపై రాసిన ఎవరైనా ఏదో ఒక పక్షంవైపు వకాల్తా పుచ్చుకున్నట్లు రాయడమే కానీ ఇట్లా చారిత్రక వాస్తవాన్ని నిష్పక్షపాతంగా రాయలేదు. అట్లా రాయడమంటే ప్రజలు నిజాలు తెలుసుకోవాలన్న సామాజిక నిబద్ధత ఉన్నట్లుగానే భావించాలి. ఆ నిబద్ధత నుంచే నిర్భీతి, దాని నుచే సాహసం వస్తుంది. అది సాధించారు కాబట్టే రమణారెడ్డిగారు సామాజికులు కాగలిగారు. సమాజం కోసం గతి తార్కిక సత్యాలు రాయగలిగారు.

'శ్రీశ్రీతో ఒకరోజు' అనే వ్యక్తీకరణలో 'మొదట్లో నాకు శ్రీశ్రీ కవిత్వం అర్థమయ్యేదిగాదు. నిజాయితీగా చెప్పాలంటే దానిమీద నాకు చులకనగా గూడా ఉండేది... సొంత ఊర్లో ప్రాక్టీసుకు దిగిన తరువాత గానీ నాకు పేదరికం లోతులు తెలిసిరాలేదు. అప్పటి నుంచి శ్రీశ్రీ గూడా అర్థంగావటం మొదలయింది. దరిమిలా నా ప్రపంచ దృక్పథం మారిపోయింది'అంటూ అక్షరాల్లోని అర్థాలతో పాటు భావాలనూ గ్రహించడం ద్వారా సమాజాన్ని దర్శించడమే అధ్యయనపు పరమార్థమనీ, అప్పుడే ఫలితం దక్కుతుందని స్వీయానుభవం ద్వారా వివరించడంతోనే ఆయన రాతల్లోని వాస్తవికత ఎంతో, అది చేస్తున్న ఉద్బోధ ఏమిటో అర్థమవుతుంది.

'ఆకలి–మానవత్వం' అన్న పరిశోధనాత్మక వ్యక్తీకరణలో 'మనిషిని మానవుడు అని ఎందుకంటున్నాం? ఆ హృదయంలో నుంచి వచ్చే స్పందన, సమాజంలో ఉన్నటువంటి సంస్కారం, ఆ హ్యూమనిటీ అనేది మనిషిని మానవునిగా తయారు చేసింది' అని 'మనిషి' అన్న దానికి అర్థం వివరిస్తూ మనిషి మానవుడిగా ఎదగడానికి కారణం విజ్ఞానం. విజ్ఞానం మేధోపరమైనదైతే వివేచన, విచక్షణ అనేది ఆలోచనతో కూడిన భావోద్వేగం అంటారు. విజ్ఞానం విస్తృతంగా సాధించుకుంటున్న మనిషి వివేచనతో ప్రవర్తిస్తూ మనుషులను, మానవాళిని రక్షించుకుంటూ అభ్యదయకరమైన, ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి కావలసిన తార్కికత జ్ఞానాన్ని, హేతుబద్ధతను కలిగిస్తుందీ పుస్తకం. అందుకే ఈ సంకలనం భావి తరాల సుఖసంతోసాల కోసం, వివేచనాయుత ప్రగతి కోసం 'మనం' అందరమూ పూరించవలసిన శంఖారావమైంది.



నందగిరి ఇందిరాదేవి స్వాతంత్ర్య సమరయోధురాలు, తొలితరం తెలంగాణ తెలుగు రచయిత్రి, సంఘ సేవకురాలు, ఆంధ్రయువతి మండలి వ్యవస్థాపక సభ్యురాలు, తెలంగాణ తల్లి అందించిన తెలుగు బిడ్డ నందగిరి ఇందిరాదేవి.

ఇందిరాదేవి 22.09.1919న హనుమకొండలో జన్మించారు. వీరి తండ్రి ప్రముఖ సంస్కర్త మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాల సహ వ్యవస్థాపకుడు, తెలంగాణ వైతాళికుడు వడ్లకొండ నరసింహారావుగారు.

ఇందిరాదేవి నారాయణగూడ ''ఆంధ్ర బాలికల పాఠశాల'' (ఇప్పటి మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాల)లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసి ఎస్‌డీటీ మహిళా విశ్వవిద్యాలయంలో 1937 (పూనే)లో పట్టభద్రులయిన్నారు. ఆమె పద్నాల్గో యేటే పాఠశాల తరపున సాహిత్య సంచికలను వెలువరించటం, అనేక సామాజిక సాంస్కృతిక ఉద్యమాలలో పాలుపంచున్నారు. ఆంధ్ర యువతి మండలి వ్యవస్థాపక సభ్యులతో ఆమె ఒకరు. ఇందిరాదేవి సాంఘిక సంస్కరణోద్యమ సారథిగా ఎన్నో పోరాటాలు చేశారు. వాటిలో ముఖ్యమైనవి బాల్యవివాహాల పట్ల నిరసన కార్యక్రమాలు. తాను యుక్త వయస్కురాలైన తర్వాతనే వివాహం చేసుకుని నలుగురికి ఆదర్శంగా, మార్గదర్శిగా నిలిచింది. 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్ర మహాసభకు అనుబంధంగా జరిగిన ఆంధ్ర మహిళాసభలకు ఇందిరాదేవి అధ్యక్షత వహించారు.

ఆనాటి నషర్'గా పిలువబడే దక్కన్ రేడియోలో ప్రసంగించిన మొట్టమొదటి తెలంగాణ మహిళ ఇందిరాదేవి. 1937లో నిజాం ప్రభుత్వం ప్రసారం చేయదల్చుకున్న సందేశం తెలుగులో ఇందిరాదేవియే తమ 'వాణి'గా మొట్టమొదటిసారి వినిపించారు.

తరువాత ఇందిరాదేవి ఎన్నో రేడియో ప్రసంగాలు రాశారు. కుటుంబపరమైన ఇతివృత్తాలతో రాసిన ఇందిరాదేవి కథలు, వ్యావహారిక భాషలో, సరళశైలిలో ఉంటాయి. సాహితీ వనంలో ఆమె చేపట్టని ప్రక్రియలేదు. కవితలు, రేడియో ప్రసంగాలు, నాటకాలు, కథలు, గేయాలు, వ్యాసాలు ఒకటేమిటి అన్ని ప్రక్రియలు చేపట్టారు. అలా వీరి రచనలు రెండువందల వరకు ఉన్నప్పటికీ వివిధ పత్రికలలో అచ్చయిన దాదాపు 30 రచనలు మాత్రమే లభించినాయి. ఇంకా ఆమె రాసిన బోలెడు కథలు, నాటకాలు లిఖిత రూపంలో ఉన్నాయి. వాటిని పరిష్కరించి, వెలువరించాల్సిన అవసరం ఉంది.


ఇందిరాదేవి తన కథలలో వరంగల్ జిల్లా ప్రజా జీవితాన్ని చక్కగా చిత్రీకరించారు. అలాగే తన కథలలో స్త్రీ, పురుష మనస్థత్వాలను అందంగా వివరించారు. ఆమె రాసిన కథలు, వ్యాసాలు, నాటకాలు, భారతి, యువ, గృహలక్ష్మి, వినోదిని, ఆంధ్ర జ్యోతి, మాతృభూమి, చిత్రగుప్త, ఆంధ్రకేసరి, శోభ, ప్రజామిత్ర, వనితాజ్యోతి వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురితమయ్యాయి.

ఇందిరాదేవి రచనల్లో హాస్యరసం పాళ్ళు ఎక్కువ. సాహిత్యంలో వారికి హాస్యం అంటే ఇష్టం. నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం– అన్న జంధ్యాల హాస్యోక్తికి నిలువెత్తు నిదర్శనం ఇందిరాదేవి.

2006లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీరి హాస్య రచనలకు 'ధర్మనిధి' పురస్కారాన్ని అందచేశారు.

విశ్లేషణని ఆవిష్కరిస్తూ రాసిన కథ ''పందెం'' చాలా ప్రముఖమైనది. ఈమె కథలతోపాటు ఎన్నో నాటకాలను కూడా రాశారు. ఈమె భర్త శ్రీ నందగిరి వెంకటరావు ప్రముఖ న్యాయవాది, జిల్లా జడ్జిగా పనిచేశారు. ఆయన తొలితరం కథకుల్లో అగ్రగణ్యుడు. ఆంగ్ల, తెలుగు, ఉర్దూ భాషలలో ప్రసిద్ధ కథా రచయిత. 1926 – 35 మధ్యకాలంలో 50కి పైగా ఈయన కథలు రాశారు. గిరి అనే కలం పేరుతో భారతి, ఉదయిని, కృష్ణాపత్రిక, సమదర్శిని, సుజాత, గోలకొండ పత్రికలలో అచ్చయినాయి.

శ్రీమతి ఇందిరాదేవి రాసిన ''మసక మాటున మంచి ముత్యాలు'', సంకలనం రేడియో వ్యాసాల సంపుటి ఆమె రాసిన వ్యాసాలలో కథా నాయకుడు ఎక్కువగా ఆమె శ్రీవారే! మా వారితో పిక్నిక్, మా వారి పెళ్ళి, ఎవరి తరమమ్మా ఈయనతో కాపురం, ఇల్లు ఒక మ్యూజియం, రూల్సు ప్రకారం మా ఇల్లు, ఒక వానరోజు మా యింట్లో, అనుకున్నంత తేలిక కాదు కొత్తకాపురం, పొదుపు కోసంపోతే, పెళ్ళి ప్రమాణం ఎన్నో సాధారణ అంశాలను సైతం నేర్పుతో, అతి సుందరంగా మలచి, పాఠకుల చేత పూర్తిగా చదివించగల నేర్పు వీరి కలానికి ఉంది. వీటిలో కొన్ని మాత్రమే మసక మాటున మంచి ముత్యాలుగా చేర్చారు. ఇందిరాదేవి తన వయస్సు మళ్ళిన కాలంలో సైతం 'బాలానందం' కార్యక్రమాల ద్వారా మంచి స్నేహం విలువ, కష్టాల్లో ఉన్నవారికి సాయపడాలని, సోమరిపోతుగా ఉండకూడదని ఈ విధమైన అనేక నీతికథలను పిల్లలకు, అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో 'అమ్మమ్మ కథలు'గా వివరించారు. ఈ కార్యక్రమమే ఆకాశవాణిలో ఆమె పాల్గొన్న చివరి కార్యక్రమం శ్రీమతి నందగిరి ఇందిరాదేవి 1998 నుంచి అమెరికాలో కుమారుల వద్ద ఉంటూ జనవరి 22, 2007లో తుదిశ్వాస విడిచారు.




సాహితీ తేజోమూర్తి
నందగిరి ఇందిరాదేవి

ఆమె ఎక్కడ వుంటే అక్కడ నవ్వుల జల్లులు... వివాహబంధం వద్దనుకునే యువతీయువకులకు, సంసారంలో నిత్యం భేదాభిప్రాయాలతో, సమస్యలతో, సతమతమవుతున్న జంటలకు వీరి రచనలు – హాస్య గుళికలుగా పనిచేసే మనసుకు హాయిని కలుగచేస్తాయి. హాస్య రసఝురులుగా సంసారంలో సరిగమలు పలికిస్తాయి. తాను రాసిన కథలను సంపుటిగా అచ్చువేయలేకపోయినా దాదాపు 6 దశాబ్దాల పాటు (ఆరు) రచించిన రేడియో ప్రసంగాలలో ప్రముఖమైన వాటిని ఎంపిక చేసి ఆమె 'మసకమాటున మంచి ముత్యాలు' పేరుతో మార్చి 1995లో ఒక సంకలనాన్ని వెలువరించారు. స్త్రీ పురుష సంబంధాల్లోని వైరుధ్యాలు, సామాజిక సమస్యలు, మనిషి మనస్తత్వ వైచిత్రి, అలాగే మహిళా సమస్యలు, సాంఘిక దురాచారాలు మొదలగు అద్దంపట్టే ఎన్నో విషయాలను కథాంశాలను ఇతివృత్తాలుగా చేసుకుని ఆమె వాయిద్యం సరదా, ప్రథమ పరిచయం, ప్రాప్తం, గంగన్న, కాఫీ, షిరీన్ – ఫర్‌షాద్, పందెం, పాపం మొదలగు అనేక కథలు రాసినా కొన్నే లభ్యమవుతున్నాయి. వీటిల్లో మనుషుల్లోని సున్నితమైన మానసిక

◆ **డాక్టర్ చీదెళ్ళ సీతాలక్ష్మి**

గడియారం రామకృష్ణశర్మ శతజయంత్యుత్సవాలు

సందర్భం




సంస్కృత పండితుడు, పరిశోధకుడు, సంస్కరణవాది, చరిత్రకారుడు గడియారం రామకృష్ణశర్మ తెలుగు సాహిత్య ప్రపంచానికి సుప్రసిద్ధులు. 2007లో ఆయన రాసిన 'శతపత్రం' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. తనను గురించి ఆయన చాలా తక్కువ బహిర్గతమయ్యేవారు. కానీ ఆయన తన తొమ్మిది దశాబ్దాల జీవితకాలంలో సాహిత్యానికి ఎనలేని సేవలందించారు. సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు ఆయన రాసిన ఆత్మకథ 'శతపత్రం' ప్రామాణికంగా నిలుస్తుంది. తన సతీమణి కమలమ్మకు ఉన్న సహనాన్ని అభిమానిస్తూ తన ఆత్మకథను ఆమెకు బహూకరించారు. 1919లో అనంతపురం జిల్లాలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన అనంతర కాలంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలంపూర్‌కు కుటుంబంతో వలసవచ్చారు. దేవాలయాలకు సంబంధించి చారిత్రక అంశాల నేపథ్యంతో కూడిన పుస్తకాలు సహా ఆయన మొత్తం 37 గ్రంథాలు రాశారు. 'మాధవ విద్యారణ్య చరిత', 'హిందూ ధర్మం', 'ఆలంపుర క్షేత్ర మహత్మ్యం', 'విజ్ఞానవల్లరి', 'మనవాస్తు సంపద' ఆయన మనకు అందించిన గ్రంథాల్లో కొన్ని. ఆయన సాహిత్యరంగానికి అందించిన సేవలను స్మరిస్తూ తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో శతజయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నారు. 2018 ఏడాది పొడవునా జరిగే ఈ ఉత్సవాలు వచ్చే ఆరో తేదీ మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ తిలక్‌రోడ్డులో గల తెలంగాణ సారస్వత పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ప్రారంభమవుతాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొంటారు. సభాధ్యక్షులుగా తెలంగాణ సారస్వత అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి వ్యవహరిస్తారు. విశిష్ట అతిధిగా ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్, గౌరవ అతిధిగా ప్రముఖ సాహితీవేత్త తన్నమరాజు గిరిజామనోహరబాబు, ఆత్మీయ అతిధిగా గడియారం భార్గవ శర్మ వ్యవహరిస్తారు.

- జె.చెన్నయ్య,
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి

బుద్ధుడి బోధనల 'బుద్ధ'

పుస్తక పరిచయం



బుద్ధుడి ఆలోచనలు ప్రపంచ సాంస్కృతిక సంపద. ఆయన ఆలోచనాసరళిపై ఎన్నో సామాజిక మాధ్యమాల్లో వెల్లివిరుస్తూనే ఉన్నాయి. ఆ కోవలోకి చెందినదే ఈ 'బుద్ధః కొన్ని ఆలోచనలు' పుస్తకం. హింసాత్మక ప్రవృతి పెరిగిన నేటి సామాజిక నేపథ్యానికి బుద్ధుడి ఆలోచననలెంతో ఉపకరరిస్తాయి. అలా బుద్ధుని ఆలోచనల నుంచి వెలువడిన కొన్ని సూక్తులను ప్రముఖ జర్నలిస్టు యింద్రవెల్లి రమేష్ పుస్తకరూపంలో తీసుకొచ్చారు.'అహంభావం సత్యాన్ని అంగీకరించదు', ప్రతిదీ తాత్కాలికమే, దేనికీ ఒత్తిడి చెందకు', 'ఎప్పటికప్పుడు జీవితానికి ప్రారంభోత్సవం మహగొప్పగా ఉంటుంది' వంటి దాదాపు 48 బుద్ధుని సూక్తులతో అందంగా మలిచిన ఈ పుస్తకాన్ని 'బుద్ధ ప్రచురణలు' అందిస్తోంది.

- ఫణి



కోస్తాకు గర్భశోకం

ప్రాజెక్టు ప్రారంభానికి ముందే చేపట్టిన అధ్యయనాలూ (హజాబ్, హాజిద్, క్వ్యారా, హాసియ), సూచనలు పాటించడంలో అసహాయత కారణం కావచ్చు. వ్యయ ప్రయాసలతో కూడిన ముందస్తు నివారణ చర్యలను చేపట్టడానికి యాజమాన్యాలు చూపే నిర్లక్ష్యం కారణం కావచ్చు. వీటిని నియంత్రించాల్సిన వ్యవస్థల అలసత్వం కారణం కావచ్చు. మొత్తానికి ఆంధ్రను అన్నపూర్ణగా మార్చిన కృష్ణా - గోదావరి వ్యవసాయ క్షేత్రాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకున్నాయి.



స్పందన

ప్రపంచ వ్యాప్తంగా శక్తివనరుల ఉత్పాదనలో భారతదేశం 5 వస్థానంలోనూ, వినియోగంలో 7వ స్థానంలోనూ వుంది. అయినప్పటికీ దేశీయ అవసరాల కోసం 78% శిలాజ ఇంధనాల దిగుమతుల మీద ఆధారపడి వున్నాం. 2032 నాటికి శిలాజ ఇంధనాల అవసరం నాలుగింతలవుతుందని అంచనా. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న గృహ పారిశ్రామిక అవసరాల కోసం శిలాజ ఇంధనాల్ని మండించడంతో ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యం, పెరుగుతున్న భూతాపంతో కొండనాలుక్కి మందేస్తే వున్న నాలుక వూడుతున్న చందమవుతోంది. మూడేళ్ళ క్రితం కొలువు దీరిన ప్రభుత్వం పునరుత్పాదక వనరైన సోలార్ పవర్ (సూర్యశక్తి)ను 2022 నాటికి 100 గిగావాట్లకు పెంచాలని సంకల్పం చెప్పుకున్న వాస్తవంలో యిప్పటికి సాధించింది 10 గిగావాట్లు కాగా నిర్దేశిత లక్ష్యం ఎండ మావిని తలపిస్తోంది. ఊహలు పల్లకీలోకీ, బుద్ధి బురదలోకీ లాగుతున్నట్లు వాస్తవ పరిస్థితులు యిలా అఘోరించబట్టే శిలాజ ఇంధనాల కోసం నానాటికీ గిరాకీ పెరుగుతోంది.

ఈ నేపథ్యంలో కృష్ణా గోదావరి బేసిన్‌లో మరిన్ని చమురు క్షేత్రాల ఏర్పాటు కోసం అటు ప్రభుత్వరంగ సంస్థలూ ఇటు రిలయన్స్ లాంటి ప్రైవేటు సంస్థలూ ప్రణాళికలు సిద్ధం చేసి క్షేత్రస్థాయి అన్వేషణ చేపట్టడంతో ఆ ప్రాంతవాసుల్లో (గత అనుభవాల దృష్ట్యా) సహజంగానే భయాందోళనలు తలెత్తుతున్నాయి. కృష్ణా-గోదావరి జిల్లాలలో నిర్వహించిన గ్రామసభల్లో ఆ ప్రాంతవాసులు లేవనెత్తిన సమస్యలకు చమురు కంపెనీలు మసి పూసి మారేడుకాయ సమాధానాలు చెప్పినా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండొచ్చు. చమురూ, గ్యాస్ వెలికితీత వల్ల భూమి లోపలి పొరల్లో కుహరాలు ఏర్పడి తద్వారా భూమి కుంగిపోతుంది లేదా సముద్ర జలాలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చి భూగర్భ జలాల్లో లవణీయత పెరుగుతుంది. అందుచేత ఆ కుహరాల్ని నీటితో నింపడానికి సమాంతరంగా ఇంజెక్షన్ బావులు ఏర్పాటు చేయాలి. అయితే చమురు ఉత్పత్తి మీద వున్న యావ ముందస్తు నివారణ చర్యలైన ఇంజెక్షన్ బావుల మీద వున్నదా అన్నదే సందేహం. అనేక ప్రాంతాల్లో భూమి కుంగిపోతోందని అక్కడి రైతులు గగ్గోలు పెడుతుంటే చమురు సంస్థలు నెపాన్ని భూమి లోపలి పొరల్లో వున్న సున్నపురాయి మీదకి నెట్టివేస్తున్నాయి. వర్షాకాలంలో భూమిలోకి ఇంకుతున్న నీటికి సున్నపు రాయి కరగి ఏర్పడే కుహరాల్లోకి భూమి కుంగిపోతోందే తప్ప చమురు బావులు కాదని సన్నాయి నొక్కుతున్నాయి. ఇక రెండో తీవ్ర సమస్య చమురు బావుల పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములతో భూగర్భ జలాలు కలుషితమవడం, భూమి నైసర్గిక కాంటూరులు మార్పు కావడం ఇందుకు ప్రధానంగా రెండు కారణాలున్నాయి. డ్రిల్లింగ్ సమయాల్లో రసాయనాలు మడ్డి పరిసర ప్రాంతాల్లోకి చిందడం, పారడం కావచ్చు. ప్రమాణాలకు అనుగుణంగా లేని ఆవిరిగుంతలు, దహనగుంతలు కావచ్చు. డ్రిల్లింగ్ సమయంలో ఉబికివచ్చే మడ్డినీ, ఉప్పు నీటిని ప్రత్యేకంగా వేరు చేసి నిర్దేశిత ప్రాంతా ల్లో పారబోయక పోతే దిగ్గల చుట్టూ పారిన ఈ ద్రవ, ఘన వ్యర్థాలు తరువాత వర్షాకాలంలో నీటితో పరిసర వ్యవసాయ క్షేత్రాల్లోకి కొట్టుకువచ్చి నేలలు కలుషితమవుతాయి. సాగర జలాల్లో తవ్వే చమురు బావుల్లోకి నింపే ఉప్పునీటితో సముద్రపు అడుగున భూమిలో వున్న మంచినీటి ఆక్విఫెర్స్ సయితం కలుషితమై తద్వారా తీర ప్రాంత భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి.

సాగరజలాల్లో కలుస్తున్న రసాయనాలూ మడ్డితో అందులోని జీవ జాతుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఇక డ్రిల్లింగ్ రిగ్గుల ఏర్పాటు కోసం నిర్మించే వెల్ ప్యాడ్‌లూ, వాటిని అనుసంధానించే దారుల కోసం సమీప ప్రాంతాల్లో గుంతలు తవ్వడం వలనా, ఆ ప్రాంతంలోని వర్షపు నీరుపారే వాలుల వద్ద అనుసంధానపు రోడ్లలో సరిపడా కల్వర్టులు లేకపోవడం వలనా వర్షాకాలంలో వాన నీటి ప్రవాహ దిశలు మారి భూమికోతకు గురి కావచ్చు.

అంతే కాదు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు వ్యవసాయ అవసరాల కోసం విచ్చలవిడిగా బోరుబావుల తవ్వకంతో సైతం కుహరాలు ఏర్పడి సముద్రజలాలు తీర ప్రాంతాల్లోకి చొచ్చుకు వస్తాయి. అయితే పైన చెప్పిన మానవ తప్పిదాలకు నివారణ లేక కాదు. ప్రాజెక్టు ప్రారంభానికి ముందే చేపట్టిన అధ్యయనాలూ (హజాబ్, హాజిద్, క్వ్యారా, హాసియ), సూచనలు పాటించడంలో అసహాయత కారణం కావచ్చు. వ్యయ ప్రయాసలతో కూడిన ముందస్తు నివారణ చర్యలను చేపట్టడానికి యాజమాన్యాలు చూపే నిర్లక్ష్యంకారణం కావచ్చు. వీటిని నియంత్రించాల్సిన వ్యవస్థల అలసత్వం కారణం కావచ్చు. మొత్తానికి ఆంధ్రను అన్నపూర్ణగా మార్చిన కృష్ణా - గోదావరి వ్యవసాయ క్షేత్రాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకున్నాయి.

బుద్ధ భగవానుడు తన అష్టాంగమార్గంలో అత్యంత ప్రధానంగా సమస్య జీవనాన్ని ప్రభోదించాడు. సుఖజీవనానికి ఆదాయం ఆర్జించాలి. ఒక వైపు మనచుట్టూ వున్న పరిసరాల్ని జీవజాలాన్నీ ధ్వసంచేస్తూ సుఖ జీవనం గడపడం. రెండోవైపు చుట్టూ వున్న పరిసరాలూ, జీవజాలంతో మమేకమై దేనికీ హానిలేకుండా సుఖజీవనం సాగించడం, చమురు కంపెనీలూ, ప్రభుత్వమూ, వ్యవస్థలు, సంబంధిత ప్రజలు ఏవైపు నిలబడాలో తేల్చుకోవాల్సిన సమయం ఇదికాకపోతే మన చుట్టూ ఏమీ మిగలదు. రసాయన కాసారాలూ, మడ్డిపేరుకున్న నేలలూ, కాళ్ళ కింద కుంగిపోతున్న నేలలు, శరీరపు సర్వాంగాలలో అనారోగ్యం తప్ప ఆలోచించండి.

మైలపల్లి అంకారావు
ఆయిల్, గ్యాస్ నిపుణుడు, ఖతార్
00974-50965824

కూరగాయల మార్కెట్లకు 'కంపోస్టు' ప్లాంట్



నగరాల్లోని కూరగాయల మార్కెట్ల కంపోస్టు ప్లాంట్లను ఏర్పాటుచేయాలని గృహ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశించింది. ప్రధాన కూరగాయల మార్కెట్లను గుర్తించి ఈ ప్లాంట్లను ఏర్పాటుచేయాలని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. సంబంధిత మార్కెట్ కమిటీలను సమన్వయం పరుచుకుని ఈ కార్యక్రమాన్ని చేపడతారు.

అత్యంత అధిక ఉష్ణోగ్రతల ఏడాది 2017

సమాచారం




శీతోష్ణస్థితి పరిస్థితులపై రూపొందించిన నివేదికలో దేశ చరిత్రలో 2017 అత్యంత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని భారత వాతావరణ శాఖ తెలియజేసింది. అంతకు ముందు నాలుగేళ్ల ఉష్ణోగ్రతల రికార్డులను 2017 అధిగమించిందని మంత్రిత్వశాఖ నివేదిక పేర్కొన్నది. మాంసానికి ప్రత్యామ్నాయ వృక్షసంబంధ పునరోత్పత్తి వృద్ధి కొనసాగుతోందని, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గదశలో ఉన్నాయని నివేదిక అభిప్రాయపడింది.

ప్లాస్టిక్ సీసాల ప్రమాదం




ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి పదిలక్షల ప్లాస్టిక్ సీసాలు ఉత్పత్తి అవుతున్నాయి. 2021 నాటికి వీటి ఉత్పత్తి మరో 20 శాతం పెరుగుతుందని అంచనా. ఫలితంగా వాతావరణ మార్పులు మరింత వేగంగా సంభవించి పర్యావరణ ఉత్పాతాలకు కారణమయ్యే ప్రమాదం పొంచివుంది.

మహి పేజీకి వ్యాసాలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manammahimahi@gmail.com



వ్యవసాయ విప్లవం

పుస్తక పరిచయం



పర్యావరణ వ్యవసాయంపై ఆలోచించడానికి ఇదే తగిన సమయం. పర్యావరణ వ్యవసాయమనేది ఇటీవల వాడుకలోకి వచ్చిన నూతన భావన. గ్రామీణ భూములను సామాజికంగా, పర్యావరణ పరంగా తగురీతిలో అభివృద్ధి చేయడం ఈ భావన లక్ష్యం. ఉత్పత్తి విధానంలో అత్యధిక స్థాయిలో జీవవైవిధ్యాన్ని సాధించడం కూడా పర్యావరణ వ్యవసాయం ధ్యేయం. 'ఎకో అగ్రిరివల్యూషన్'లో మనిషి - భూమి, వాతావరణాన్ని రచయిత మెహతా సంపూర్ణంగా చర్చించారు. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) వ్యవసాయ విధానంలో భారీస్థాయిలో వెలువడుతున్న ప్రమాదకర ఉత్పత్తుల నుంచి పర్యావరణహిత, తులనాత్మక వ్యవసాయం వైపు అడుగులు పడాల్సిన అవసరాన్ని ఈ పుస్తకంలో మెహతా వివరిస్తారు. పర్యావరణ వ్యవసాయానికి బయో ఎరువులు, బయో పురుగుమందుల ఎంత అవసరమో ఈ పుస్తకంలో తెలిపారు.

మహి డెస్క్

పట్టుదప్పిన పులుల పరిరక్షణ



ఇంటర్వ్యూ

ఉల్లాస్ కారంత్ భారతీయ పులుల సంరక్షణ కార్యకర్త. ప్రభుత్వం సర్వేలు చేయించడం మానుకుని వాటిని శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు వదిలిపెట్టాలని సూచించారు. ఆయన వన్యప్రాణుల సంరక్షణా సొసైటీ - ఇండియా కార్యక్రమానికి డైరెక్టర్‌గా ఉన్నారు. దేశంలో పులుల గణన కోసం 1990లో ఆయన కెమెరా ఉచ్చుల (ట్రాప్) విధానాన్ని అనుసరించడంలో ఆయన మార్గదర్శకుడిగా నిలిచారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా విమర్శిస్తారు. 'టైగర్ ప్రాజెక్టు' అమలులో భారత్ ఎందుకు సంతృప్తికరంగా నిర్వహించలేదో ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు.

ప్ర: 2016 కంటే 2017 మొదటి అర్ధభాగంలో పులుల మరణాల సంఖ్య ఎక్కువని జాతీయ పులుల సంరక్షణా సంస్థ (ఎన్‌టీసీఏ) అంచనా వేసిందికదా, ఇది ఆందోళన కలిగించే అంశమేనా?

జ: భారత్‌లో రమారమి 3000 పులులున్నాయని అంచనా. ఇందులో సంతానోత్పత్తికి తగినవి వెయ్యి ఆడ పులులున్నాయి. అవి మూడేళ్లకోసారి మూడు పులులకు జన్మనిస్తాయి. అంటే సంఖ్యాపరంగా ఏడాదికి 750 నుంచి 1000 పులులు పెరుగుతాయన్నమాట. అంతేసంఖ్యలో మరణాలు సంభవిస్తాయి. మరణించిన వాటిలో కొన్నిటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నాం. వాస్తవానికి ఎన్ని పులులు మరణిస్తున్నాయో మనం లెక్కించలేం. అవి సహజసిద్ధంగా మరణిస్తున్నాయా లేక అక్రమంగా వేట తదితర వాటివల్ల మరణిస్తున్నాయా? అన్నది ఆందోళనకరం. ఈ అంశాన్ని వివిధ పద్ధతుల ద్వారా తీక్షణంగా పరిశీలించాలి. కానీ, ప్రభుత్వం దీన్ని అనుసరించడం లే దు. ప్రస్తుత పరిస్థితులను ఆలోచిస్తే పులుల సంఖ్య పెరుగుతోందని ప్రభుత్వవర్గాల్లో అంచనా ఉంది. ప్రభుత్వ తాజా అంచనా ప్రకారం 2,226 పులులున్నాయి. ప్రపంచ పులులసంఖ్య (3.890)లో ఇది 60 శాతంగా గమనించవచ్చు.

ప్ర: మీ ఆశావాదానికి ఆధారమేమిటి?

జ: 1970లో మేము 'టైగర్ ప్రాజెక్టు' ప్రారంభించిన ప్పుడు పులుల సంఖ్య సుమారు రెండు వేలుంటుంది. 50 ఏళ్ల తరువాత అది 3,000 పెరుగుతుందనుకుందాం. ప్రపంచంలో ఇది ఆహ్వానిచందగినదే. కానీ, దాన్ని గొప్ప విజయంగా భావించలేం.

ప్ర: మీరు భావించే గొప్ప విజయానికి అంచానలేమిటి? మీరు చెప్పే ఆదర్శ సంఖ్య ఎంత?

జ: మూడు లక్షల చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం పులుల జీవనానికి అనువైన ప్రదేశం మనకున్నది. అంత వైశాల్యంలో పది శాతం పులులు మాత్రమే మనకున్నాయి. 2016లో పులులసంఖ్యను రెట్టింపు చేయాలని ప్ర భుత్వం పథకం రూపొందించింది. ఇది అవాస్తవ ఆలోచన. మనం 30 ఏళ్లలో సాధించలేనిది ఐదేళ్లలో ఎలా సాధిస్తాం? ఇది సాధించాలంటే మనం ముందుగా రక్షిత ప్రాంతాన్ని పెంచాలి. పులులు లేని ప్రాంతాలను కూడా పులుల రిజర్వ్ ప్రాంతాలుగా ప్రకటించాలి. వాతావరణ మంత్రిత్వశాఖలో ఎన్‌టీసీఏ ఉద్యోగస్వామ్యంగా మారింది.

ప్ర:ఈ పరిస్థితుల్లో ఏం చేస్తే బాగుంటుందనుకుంటున్నారు?

జః ఈ క్రమంలో నేను బయటి వ్యక్తిగా భావించడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఎన్‌టీసీఏతోను, జాతీయ వన్యప్రాణుల బోర్డుతో సంబంధాలున్నాయి. అయినప్పటికీ నేను విఫలమయ్యాను. ఇది నిజంగా కఠిన ఉద్యోగస్వామ్యం.

ప్ర: అంటే నిధుల కొరత ఉందా?

జ: కెన్, బెత్వా నదులపై డ్యాంలు నిర్మించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. దీనివల్ల టైగర్‌రిజర్వ్ ప్రాంతం మునిగిపోతుంది. మనదేశంలో 90 శాతం ప్రాంతాలకు నీటి అనుసంధానం ఉంది. అయితే, అంతమాత్రాన ముందూ వెనుకా ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటే ఎలా? మిగిలిన పది శాతం ప్రాంతాల విషయంలోనైనా పెద్దపెద్ద ప్రాజెక్టులు చేపట్టేముందు ఆలోచించాల్సి ఉంది.

మహి డెస్క్

వన్యప్రాణుల వినాశనం

మథనం

మన జంతుజాలం సంక్షోభంలో పడింది. గత నాలుగు దశాబ్దాలలో వన్యప్రాణుల జనాభాలో సగానికి పైగా నశించాయని, 2020 నాటికి భూగోళంపై 68 శాతానికి పైగా అంతరించి పోతాయని పలు అధ్యయనాలు వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది. 2017లో 15వేల మంది శాస్త్రవేత్తలు మానవవాళి మనుగడ ప్రమాదపు అంచుకుపోతోందని రెండవసారి హెచ్చరిక చేస్తూ కార్పొరేట్ అభివృద్ధి నమూనా పునాదిగా సాగుతున్న ప్రభుత్వ విధానాల కారణంగా 'జంతుజాల విధ్వంసం, జంతువుల వేట సంక్షోభం, అంతరించిపోతున్న జీవజాతుల దోపిడీ, వాణిజ్యాల' కారణంగా భూగోళ వినాశానికి దగ్గరవుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో భూగోళంపై వన్యప్రాణుల సంరక్షణ కోసం ఐక్యరాజ్య సమితి 2013లో మార్చి 3తేదీన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం జరపాలని ప్రకటించింది. 2015 నుంచి వివిధరకాల ఇతివృత్తాలతో ఈ దినోత్సవాన్ని ప్రజల్లో వన్యప్రాణుల సంరక్షణ స్పృహపెంచే లక్ష్యంతో ప్రపంచమంతా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది 'పెద్ద పులులు-ముప్పులో క్రూరమృగాలు' అనే ఇతివృత్తంతో ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంస్థలు ఆధ్వర్యంలో వివిధ అవగాహనా కార్యక్రమాలు జరిగాయి. ఆధునికయుగంలో ముఖ్యంగా పెట్టుబడీదారీ సామాజిక వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి ఈ భూగోళంపై సంభవించిన 'ఆరవ మహా నిర్మూలనం' దశలో జీవజాలం అంతరించిపోయే రేటు చాలారెట్లు పెరిగింది. పుట్టే రేటు కంటే కొన్ని రెట్లు అధికంగా వేటాడం, వన్యజీవుల ఆవాసాల విధ్వంసం (అడవుల నరికివేత), వ్యవసాయ క్షేత్రాలు ఏర్పడడం వల్ల అడవుల మధ్య అడవుల ఏకఖండత నాశనం కావడం, పరిసరాలలో లేని ఇతర ప్రాంతాల నుంచి తరలించడం ద్వారా జీవుల సుమతుల్యత దెబ్బతినడం జరిగే నష్టం, నిర్ధిష్ట పర్యావరణంలో నివసించే జీవజాలం పరస్పర ఆధారిత దెబ్బతినడం వల్ల కలిగే వైపరీత్యం వంటి మానవ కార్యకలాపాల పర్యవసానంగా వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి. మానవ కార్యకలాపాల ఫలితంగా భూగోళంపై ఏర్పడిన తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆ జీవజాతులు అంతరించడం చారిత్రక 'మానవీకరణ' విషాదం. మనిషి మనుగడను సైతం ప్రశ్నార్థకంగా మారే ఆకస్మిక వాతావరణ పరిస్థితులు నెలకొనే తరుణం ఆసన్నమైందని ఈ జీవుల అంతర్ధాన విషాదగాథ మనల్ని హెచ్చరిస్తోంది.

మనుషుల ఆహారం తదితర అవసరాల కోసం, వారి ఉత్పత్తి కార్యకలాపాల్లో విడుదలవుతున్న వ్యర్థాల వల్ల భూమిపై, మంచినీటి వనరుల్లోను, సముద్రాల్లోనూ నివసించే అసంఖ్యాక జీవులు ఆవాసస్థలాలు కలుషితం కావడం లేదా ధ్వంసమవడంతో అవి అంతరించిపోతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. జలవనరులు, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణ వ్యవస్థలు జీవుల మనుగడకు ప్రతికూలంగా పరిణమించాయని, వాటి తక్షణ పరిరక్షణ అవసరమని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. భూమిపై ప్రధానంగా ఉన్న 45వేల సకశేరుకాలు (వెన్నెముక గల ప్రాణులు) ఆహారం తదితర అవసరాల కోసం చంపి వినియోగించడం వల్ల 37 శాతం, వాటి ఆవాసాల పరిస్థితి క్షీణించడం లేక ప్రతికూలంగా మారిపోవడం వల్ల 31 శాతం, ఆవాసాలు కోల్పోవడం వల్ల 13 శాతం, వాతావరణ మార్పు వల్ల 7 శాతం, ఇతరత్రా కారణాల వల్ల 11 శాతం వన్యప్రాణుల జనాభా అంతరించి పోతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి. పునరుత్పత్తి కాని సహజ వనరులను ఖర్చు చేయడంతో పాటు చెట్లు, జంతువులు, మత్స్యసంపద, నీటి నిల్వలను మానవులు మితిమీరి వినియోగిస్తున్నారు. అమెరికా వినియోగ స్థాయి కోసం నాలుగు భూగోళాలు అవసరం కాగా, బ్రిటన్ అవసరాల కోసం రెండున్నర భూగోళాలు, భారత్ అవసరాల కోసం రెండు భూగోళాలు కావలసిన స్థితికి చేరుకున్నాయి. భూగోళం సకల జీవ జాతులతో కళకళలాడాలంటే అమెరికా, యూరోపియన్ యూనియన్ తదితర సంపన్న పారిశ్రామిక దేశాలు వెలువరించే ఘన జల వాయు కాలుష్యాలను నియంత్రించక తప్పని పరిస్థితి తలెత్తిందని పర్యావరణ వేత్తలు ఘోషిస్తున్నారు.

భారీనీటి ప్రాజెక్టులు, ఫార్మా, రసాయనిక కాలుష్యాల కారణంగా మంచినీటి వ్యవస్థలలోని జీవులు అన్నింటికన్నా వేగంగా 75 శాతం దాకా అంతరించిపోవడం బాధాకరం. ప్రపంచంలో 45 వేలకు పైగా బహుళార్థక సాధక ప్రాజెక్టులు సహా కోటీ యాభై లక్షలు పైగా డ్యాంలు సంభవిస్తున్న పర్యావరణ అనర్థాల అనుభవాలు ఉన్నప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లోని పాలకులు పర్యావరణ విధ్వంసక, సామాజిక సంక్షోభకారకాలైన, వివాదాస్పద భారీనీటి ప్రాజెక్టులు, ఫార్మా, రసాయనిక ప్రాజెక్టుల ఏర్పాటులో పోటీపడుతున్నారు. పారిశ్రామిక ఉత్తరార్ధగోళ దేశాల, వ్యవసాయ ఆధారిత దక్షిణార్ధగోళ దేశాలు పర్యావరణ విధ్వంసం, వాతావరణ మార్పు, జీవ వైవిధ్య పరిరక్షణపై 2010లో జపాన్‌లోని నగోయాలో జరిగిన 'జీవవైవిధ్య సదస్సు'లో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2020 నాటికి 13-17 శాతం భూభాగాన్ని జీవరక్షిత ప్రాంతాలుగా మార్చే లక్ష్యంతో రూపొందించిన 'అయిచి లక్ష్యాల' అమలుకు కృషిచేయాలి. పర్యావరణ పరిహంతక అభివృద్ధి శ్మశాన సౌభాగ్యం వంటిది. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తుల అత్యాశకు ప్రభావితం కాకుండా వన్య జీవజాలం సంరక్షణలోనే మానవ సౌభాగ్యం ఉందన్న అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, పర్యావరణహిత సుస్థిర అభివృద్ధి విధానాలను రూపొందించాలి.

బొగ్గుతో కాలుష్యం భగ్గు!



సమాచారం

అమెరికాలో విద్యుత్ పవర్ స్టేషన్ల కంటే బొగ్గు దహన స్టేషన్లు సగం ఎక్కువవున్నాయి. సామాజిక ఆరోగ్యంపై శాస్త్రవేత్తలు (ఫిజీషియన్స్ అండ్ అదర్ రెస్పాన్స్‌బిలిటీ -పీఎస్ఆర్) నివేదిక ప్రకారం బొగ్గు దహనం వల్ల మెర్క్యురీ, నైట్రోజన్ ఆక్సైడ్స్, సల్ఫర్ డై ఆక్సైడ్, ఇలా ఒకటేమిటి ఆరోగ్యానికి భంగం కలిగించే ఎన్నో వాయువులు ఉత్తత్తి అవుతాయి. అవి మన శ్వాసకోశాలు, హృదయకోశ సంబంధిత, నాడీవ్యవస్థలపై ఎంతో ప్రభావం చూపుతాయి. ఫలితంగా ఆస్మా, ఊపిరితిత్తుల క్యాన్సర్, రక్తప్రసారణలపై ప్రభావం చూపి గుండెపోటుకు దారితీస్తుంది. అమెరికా ప్రధానంగా విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గుపై ఆధారపడివుండడంతో దాని ప్రభావం మన ఆరోగ్యంపై తీవ్రంగా చూపుతోందని నివేదిక రూపొందించిన అలెన్ లుక్‌వుడ్ తెలిపారు. బఫెలో యూనివర్సిటీలో ఆయన న్యూరాలజీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. బొగ్గుతవ్వకం వల్ల ఆరోగ్యం, పరిసరాలు, నీరు తదితరాలపై తీవ్ర ప్రభావం పడుతోందని నివేదిక హెచ్చరించింది. బొగ్గు గనుల్లో పనిచేస్తున్న వారిలో అనేక మంది ఉపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారని తెలిపింది.

మహి డెస్క్

'ప్రత్యేక పర్యావరణ జోన్'గా ప్రకటించాలి



మహి లేఖ

జయశంకర్ జిల్లా ములుగు మండలంలోని గట్టుమ్మగుట్ట నుంచి రేగొండ మండలం వరకు విస్తరించిన వరుస గుట్టలు వన్యప్రాణులకు నివాపయోగ్యంగా ఉన్నాయి. ఈ గుట్టలు ఆధ్యాత్మికంగా ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. అపార ఖనిజసంపదకు ఆలవాలమైన విషయం విదితమే. ఈ సంపదపై కాంట్రాక్టర్ల కన్నుపడి, ప్రభుత్వం అనుమతితో తవ్వకాలు మొదలుపెట్టారు. ఈ గుట్టల్లో అడవి పందులు, నక్కలు, కుందేళ్లు వంటివి చెల్లాచెదురై ఊళ్లలోకి వచ్చేస్తున్నాయి. కాంట్రాక్టర్ల కారణంగా ఈ ప్రాంతంలో తీవ్ర పర్యావరణ సమస్య తలెత్తి జీవవైవిధ్యం దెబ్బతినే ప్రమాదం పొంచివుంది. ఈ క్వారీ తవ్వకాల వల్ల దుమ్ము, ధూళితో పాటు పెరిగిన వాహనాల రాకపోకల వల్ల తీవ్ర పర్యావరణ సమస్య తలెత్తుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు క్వారీ అనుమతులను వెంటనే రద్దుచేయాలి. గట్టుమ్మ గట్టు నుంచి పాండవుల గుట్ట వరకు ఉన్న గుట్టలను 'ప్రత్యేక పర్యావరణ జోన్'గా ప్రకటించాలని కోరుతున్నాను.

నల్లెల్ల రాజయ్య,
కన్వీనర్, పాండవుల గుట్టల పరిరక్షణ సమితి,
ఉమ్మడి వరంగల్

ఏపీ ప్రజల తరఫున..
కేసీఆర్‌కు థాంక్స్



(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ పుట్టేది కాదని.. సకాలంలో తెలంగాణ రాష్ట్రం ఇచ్చి ఉంటే టీఆర్ఎస్ ఆవిర్భవించేది కాదని, అలాగే రాష్ట్ర విభజనను సక్రమంగా, సవ్యంగా చేసి ఉంటే జనసేన కూడా వచ్చేది కాదని ఆయన అన్నారు. ప్రాంతీయ సమస్యలను జాతీయ పార్టీలు విస్మరించడం వల్లే ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయని చెప్పారు. గతంలో అమిత్ షా ఒకసారి తనతో మాట్లాడారని, భవిష్యత్తులో జాతీయ పార్టీలదే ప్రధాన పాత్ర అంటూ తనను బీజేపీలోకి వచ్చేయాలని పిలిచారని పవన్ అన్నారు. ఆ మాటలు తననెంతో బాధించాయన్నారు. తాను గత ఎన్నికలలో బీజేపీ-టీడీపీలకు సాయం చేస్తే.. తమ ఉనికినే చంపేస్తామంటే ఎలాగని ప్రశ్నించారు. బూర్జువా పార్టీలు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చనందువల్లే రాజకీయాల్లో వచ్చానని, ప్రజల ఆకాంక్షాలను, భావాలను జాతీయ పార్టీలు అర్థం చేసుకోవడం లేదు కాబట్టే థర్డ్ ఫ్రంట్ అనే మాట వచ్చిందని తెలిపారు. యూపీఏ పాలనలో ప్రజల సమస్యలను విస్మరించారని, ఎన్డీయేలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, అందుకే థర్డ్ ఫ్రంట్ ఆవశ్యకత వచ్చిందని అన్నారు. దీనిపై పలు రాజకీయ పార్టీలు, సంఘాల మధ్య చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. తన అభిప్రాయం, జనసేన పార్టీ అభిప్రాయం ప్రకారం జాతీయ పార్టీలకు ఒక ప్రత్యామ్నాయం ఉండి తీరాలని స్పష్టం చేశారు. అసలు దక్షిణ భారతం గురించి మాట్లాడాలంటేనే మారుమూల అంటారని... ఏపీ, తెలంగాణ, కర్ణాటక ఎంత అంటారని పవన్ మండిపడ్డారు. ఈ రాష్ట్రాల్లో వచ్చే నాలుగైదు సీట్ల గురించి పట్టించుకోనవసరం లేదంటారని.. సరిగ్గా ఇదే అంశం దేశ సమగ్రతను దెబ్బతీస్తుందని చెప్పారు. ఇందుకోసం కొత్త రక్తం, కొత్త రాజకీయం రావాలని.. అందుకే థర్డ్ ఫ్రంట్ ఉండాలని అన్నారు. దీనకి అంకురార్పణ చేయాలనుకున్న తెలుగువారైన కేసీఆర్‌ను స్వాగతిస్తున్నానని, తెలుగువాడిగా మద్దతు పలుకుతున్నానని చెప్పారు. దేశ వ్యాప్తంగా నాయకులతో పరిచయాలు ఉండి.. ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా కేసీఆర్ దీనికి సరైన నాయకుడన్నారు. మూడో ఫ్రంట్‌పై ఎప్పటి నుంచో చర్చ జరుగుతోందని, కేసీఆర్ అంకురార్పణ చేస్తే తాను మద్దతు ఇస్తానని తెలిపారు. 2019లో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఎంతో బాధలు అనుభవించారని.. ఇంకా అనుభవించాల్సిన అవసరం లేదని అన్నారు. కేసీఆర్‌పై తనకు నమ్మకం ఉందని చెప్పారు.

కలిసి పోరాడాలి

పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా సాధనకు వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, టీఆర్ఎస్ కలసికట్టుగా పోరాడాలని పవన్ పిలుపునిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదాపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంకెల వెనుక దాక్కుని గందరగోళం సృష్టించవద్దని, ప్రజల మనోభావాల్ని దెబ్బతీయద్దని ఆయన అన్నారు. శనివారం నాడు మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై మాట్లాడే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఏపీకి ప్రత్యేక హోదాపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారని చెప్పారు. జేఎఫ్‌సీ, సీఎం కేసీఆర్ ప్రెస్‌మీట్‌లు వేరైనా ఇద్దరిదీ ఒకటే భావజాలమైందని పవన్ అన్నారు.

కేసీఆర్ ఏం ఉద్ధరిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

కూర్చోవడం, సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను కొనడం, ప్రజాసంఘాలను నిర్బంధించడం, రైతులకు బేడీలు వేయడం, ఇంటికొక ఉద్యోగం అని హామీ ఇచ్చి, ఆ తర్వాత మాట మార్చడం ఇదేనా గుణాత్మక మార్పు అంటే అని ఆయన ప్రశ్నించారు. వాపును చూసి బలుపుగా భ్రమిస్తున్న కేసీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, రాజకీయ వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని ఆరోపించారు. వాళ్ల కుటుంబం కోసమే పార్టీ పని చేస్తుందని విమర్శించారు. ప్రధాని అనే గౌరవం కూడా లేకుండా మోదీని తిట్టారని, కేసీఆర్ పొరపాటున నోరుజారాడని కేటీఆర్, కవితలే అంగీకరించారని, ఇప్పటికైనా కేసీఆర్ తప్పును ఒప్పుకుంటే హుందాగా ఉంటుందన్నారు. 70 ఏళ్లుగా సాధ్యం కాని అభివృద్ధిని మోదీ నాలుగేళ్లలో చేసి చూపారన్నారు. ఓటమి అంచుల్లో కొట్టుమిట్టాడుతున్న పార్టీలను కేసీఆర్ పోగేసే ప్రయత్నం చేస్తున్నారని, దేశప్రజలు ఇంతకుముందు కూడా ఎన్నో కూటములను చూశారని, సుస్థిరమైన నాయకత్వం కోసమే బీజేపీని గెలిపించారని, నరేంద్ర మోదీని ప్రధానిని చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ పెట్టే ఫ్రంట్లకు టెంట్లు కూడా దొరకవని లక్ష్మణ్ ఎద్దేశా చేశారు. గత అసెంబ్లీలో కనీసం ఒక్క స్థానం కూడా లేని బీజేపీ త్రిపురలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని, శూన్యం నుంచి శిఖరానికి బీజేపీ ఎదిగిందని అన్నారు. అవినీతిరహిత పాలన, మోదీ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో పాటు, ఈశాన్య రాష్ట్రాల్లోని బీజేపీ కార్యకర్తల త్యాగాల వల్ల సీపీఎం కంచుకోటను బద్దలు కొట్టగలిగామన్నారు. కమ్యూనిస్టుల హింసావాద రాజకీయాల నుంచి ప్రజలు విముక్తి కోరుకున్నారని, ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు అని లక్ష్మణ్ అభివర్ణించారు. రేపు కర్ణాటక, ఆ తర్వాత తెలంగాణలోనూ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచంద్రరావు, మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ, పార్టీ అధికార ప్రతినిధులు కృష్ణ సాగర్, శ్రీధర్ రెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు వర్గాల్లో విస్త ృత చర్చ జరుగుతుంది. గతంలో హైదరాబాద్ నగర సీపీగా పని చేసిన మహేందర్‌రెడ్డికి ప్రభుత్వం పదోన్నతి కల్పించి డీజీపీని చేసింది. గత నవంబర్ నుంచి వీవీ శ్రీనివాసరావు నగర కమిషనర్ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. నగర సీపీగా తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న జితేందర్‌ను నియమించే అవకాశం ఉందని తెలిసింది. అదనపు కమిషనర్ స్వాతిలక్రాను సైబరాబాద్ కమిషనర్‌గా, హోం శాఖ కార్యదర్శిగా గోపికృష్ణ లేదా గోవింద్‌సింగ్, పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా సందీప్‌శాండిల్యాను నియమించే అవకాశం ఉందని సమాచారం. జిల్లాల ఎస్పీలను పూర్తి స్థాయిలో మారుస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. వరంగల్ కమిషనర్ సుధీర్‌బాబును హైదరాబాద్ రేంజ్ డీఐజీగా బదిలీ చేసి ఆ స్థానంలో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ రవీందర్‌ను నియమిస్తారని వినికిడి. రీజియన్ ఐజీలుగా నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్రలను కీలక విభాగాలకు బదిలీ చేయనున్నట్లు తెలిసింది. హైదరాబాద్ శాంతి భద్రతల అదనపు సీపీగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మెనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మల్లారెడ్డిని, ఆ స్థానంలో అదనపు డీజీపీ సంతోష్ మెహ్రాను బదిలీ చేయనున్నారు. డీఎస్ చౌహాన్‌ను వరంగల్ కమిషనర్‌గా, అనిల్‌ను నార్త్ ఐజీగా నియమించనున్నట్లు తెలిసింది. శాంతిభద్రతల అదనపు డీజీపీగా ఐజీ ర్యాంకులో ఉన్న అధికారిని నియమించనున్నారు. బదిలీలకు సంబంధించి మొత్తం 49 మందితో కూడిన జాబితా సిద్ధమయ్యిందని, అధికారికంగా బుధవారం ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. కాగా, బదిలీల వార్త పోలీసుశాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

మూడోది కాదు..
ముఖ్య కూటమి!



(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. ''స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల దాటుతున్న తర్వాత కూడా ఈ దేశం ఎటు పోతోంది.. ఇక్కడి పరిస్థితులేంటని ఆలోచిస్తే నాకే ఆశ్చర్యంగా ఉంది. ఓ నాలుగు మాటలు చెబితేనే దేశం నలుమూలల నుంచి ఒకటే ఫోన్లు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఫోన్ చేశారు. 'కేసీఆర్ తమ్ముడూ నువ్వు ఏం చెబితే అలాగే ముందుకెళ్దాం' అన్నారు. ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరన్ మద్దతు తెలిపారు. మహారాష్ట్ర నుంచి కూడా కొందరు ఎంపీలు ఫోన్ చేశారు. దీన్ని బట్టి ఈ దేశంలో కాంగ్రెస్, బీజేపీల నేతృత్వంలో పాలనావ్యవస్థ దారుణంగా విఫలమైనట్లు తెలుస్తోంది'' అని ఆయన అన్నారు.

మన్ను తింటున్నామా?

''70 ఏళ్ల తర్వాత కూడా దేశంలో రైతుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయి. నీళ్లు లేవా? 70వేల టీఎంసీలు ఉన్నాయి. చాలా విషయాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటాలు తేల్చరు. జర్మనీ వాడు బంగారం తింటున్నాడా? అమెరికా వాడు వెండి తింటున్నాడా? మనం ఏమన్నా మన్ను తింటున్నామా.. ఏం జరుగుతోంది. ఎన్ని విధాల విభజన. ప్రజలను వేరు చేసి రాజకీయ ఆటలాడుతున్నారే తప్ప వాస్తవ దృక్పథంతో పనిచేయడం లేదు. నాకు పనిలేక కాదు. ఏడాదిన్నర పోతే కోటి ఎకరాలకు నీరు వస్తుంది. మన బాధ పోతుంది'' అని కేసీఆర్ చెప్పారు.

హిమాలయాల అవతల వాళ్లు.. ఇవతల మనం

''కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీ వాళ్లకు ఓటేశాం. ఏం జరిగింది? నాలుగేళ్లలో రైతులు.. నిరుద్యోగులు.. ఎవరికైనా ఏం జరిగింది. మళ్లీ వీళ్ల మీద కోపమొస్తే వాళ్లొస్తారు. చైనా 24 ఏళ్లలోనే అమెరికా తర్వాత అత్యంత బలమైన దేశంగా రూపొందింది. హిమాలయాల అవతల వాళ్లున్నారు. ఇవతల మనమున్నాం. ఢిల్లీ పోయినప్పుడు కొందరితో మాట్లాడితే చైనాలో వేరే కానూన్ ఉందన్నారు. నీ కానూన్ నువ్వు మార్చుకో. ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో ఇంకొకరో దేశంలో ఎవరున్నా ప్రజలకోసమే కదా.''

రాజకీయ లబ్ధి కోసం యత్నిస్తున్నారు!

''జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు కూడా ఢిల్లీ నుంచే డబ్బులు వేసే ప్రజాస్వామ్య వ్యవస్థ మనది. ఆరోగ్య విధానం, విద్యా విధానం, వ్యవసాయ విధానం, రాష్ట్రాలకు అప్పగించాలి. పట్టణాభివృద్ధి కూడా రాష్ట్రాలకే ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వానికి దవాఖాన, మున్సిపల్ మోరీల వద్ద ఏం పని? వాళ్లు చేయాల్సిన పని చేయరు. విదేశీ వ్యవస్థ, ఆర్మీ, నేషనల్ హైవేస్ మీద పనిచేయాలి. అమెరికాలో రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఉంటుంది. సిటీ కమిషనర్.. నగర మేయర్ కింద పనిచేస్తారు. రాష్ట్రాల మీద పెత్తనం ఉండదు. కానీ, ఇక్కడ పరిస్థితి వేరు. రిజర్వేషన్లు ఇవ్వాలి. తెలంగాణలో అధిక శాతం దళితులు, గిరిజనులు, ముస్లింలు ఉన్నారు. ఒకటే దేశం రెండు రాజ్యాంగాలు ఉంటాయా? 85 శాతం ప్రజలకు 50% లోపు రిజర్వేషన్లు అసలెలా సాధ్యం? కొన్ని రాష్ట్రాల్లో ఓసీలుగా ఉన్నవారు కూడా బాధపడుతున్నారు. ఏదీ తేల్చరు. ఏదీ తెగదు. ఏదీ జరగదు.''

14ఏళ్లయింది!

''మన కృష్ణా, గోదావరి నదీ జలాల లెక్కలు తేల్చడానికి 2004లో బ్రిజేష్ ట్రైబ్యునల్ వేశారు. 14 ఏళ్లు అయింది. ఇప్పటికీ తేల్చలేదు. నది నీళ్ల పంపిణీకి ఇన్నేళ్లా? ఇలాంటి ఢిల్లీనా ప్రజలకు కావాల్సింది. దేశంలో 3.20 లక్షల మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. దేశం వాడుకుంటుందా? భారతదేశంలోని కరెంటు భారతీయులు వాడరు. ఝార్ఖండ్‌లో అనేక ప్రైవేటు సంస్థలు మూతపెట్టుకున్నారు. రెండో పక్క కొన్ని రాష్ట్రాల్లో చీకట్లున్నాయి. అందరికీ జీతాలు పెరుగుతయ్. సబ్బులు, నూనెలు, చక్కెర ధర పెరుగుతుంది. రైతు పండించే ధాన్యం మద్దతు ధర మాత్రం పెరగదు. దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే.. ఇప్పుడు కూడా.. ఏమన్నా మాట్లాడితే జైల్లో పెడతామంటూ బెదిరిస్తున్నారు. జైలుకు భయపడితే కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడడతాడా? దగా చేసినవాళ్లు, కుంభకోణాలు చేసిన వాళ్లకు భయం ఉంటుంది. మేం నిటారుగా ఉన్నాం. కొందరిని పట్టుకుంటే భస్మమవుతారు. ఎవరైనా మాట్లాడితే నిందలు వేయడం.. వెటకారం చేయడం కాదు. ఒక పద్ధతిగా మాట్లాడాలి.''

అద్భుత మార్గదర్శనం కావాలి

''ఈ దేశ ప్రజానీకానికి ఓ అద్భుతమైన మార్గదర్శనం చూపిస్తాం. నేను ఢిల్లీకి వెళ్లాక 12వ పంచవర్ష ప్రణాళికలు అమలైతే వాటిని చదివా. నేను ఆ రోజుల్లో ఇందిరాగాంధీకి పెద్ద అభిమానిని. భూ సంస్కరణ చట్టం తెచ్చి పేదలకు గుడిసెలు వేయించి కొన్ని కార్యక్రమాలు తెస్తే గొప్ప నాయకురాలని పొంగిపోయా. కానీ, పెద్దగా జరగలేదు. దాని తర్వాత రాజీవ్‌గాంధీ వచ్చారు. బాగా ఆశపడ్డా. మోదీగారితో చాలాసార్లు మాట్లాడా. రైతులకు, గిరిజనులకు ఏమైనా చేయాలని అడిగాను. తర్వాత వెళ్లినప్పుడు ఫసల్‌బీమా యోజన తెచ్చామని చెప్పారు. అది కూడా బాగాలేదు. ప్రతి ఒక్కరి దగ్గర ప్రీమియం తీసుకుంటారు. పంట పాడైతే మాత్రం డబ్బులు రావు. రైతుల ఆత్మహత్యలు ఎప్పుడు బంద్ కావాలి. కనీస మద్దతు ధర రూ.500 పెంచమంటే ఎందుకు పెంచరు. ఇది జరగాలంటే ఈ దేశంలో ఒక మార్పు రావాలి. అది ఎక్కడో చోట మొదలవ్వాలి. అది తెలంగాణ నుంచే ప్రారంభమైంది. వంద శాతం మనం విజయం సాధిస్తాం. కచ్చితంగా మీ ఆశీర్వాదంతో నేను ముందుకెళ్తాం. ఈ సందర్భంగా మమతా బెనర్జీకి కృతజ్ఞతలు తెలుపుతున్నా. త్వరలో ఏకాభిప్రాయం ఉన్న నేతలతో మాట్లాడతా. ఆర్థిక నిపుణులు, శాస్త్రవేత్తలు, రైతులతో మాట్లాడి ఈ దేశానికి అవసరమైన ఓ చక్కటి ఎజెండా తయారు చేసి ముందుకుపోదాం. ఇప్పటికైనా ఈ రెండు జాతీయ పార్టీలు పంథా మార్చుకోవాలి.''

నిజమైన ఫెడరలిజం రావాలి

''నాన్ కాంగ్రెస్.. నాన్ బీజేపీ కూటమి ఏర్పాటు కావాలి. ఈ దేశానికి నిజమైన ఫెడరలిజం రావాలి. అధికారాలు రాష్ట్రానికి అప్పజెప్పి పరిమిత అధికారాలు కేంద్రం వద్ద ఉంటేనే దేశం బాగుపడుతుంది. తెలంగాణలో ప్రారంభమైన ఈ ప్రస్థానం యావద్దేశం చుట్టుముడుతుంది. మీ ఆశీస్సులతో కేసీఆర్ వందశాతం విజయసాధిస్తాడని చెబుతూ మీ అందిరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. జై తెలంగాణ జై భారత్'' అంటూ ప్రసంగం ముగించారు.





వంట సామన్లను పరిశీలిస్తున్న ఎంపీ కవిత

హాస్టల్‌లో ఎంపీ కవిత ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, మార్చి 4(మనం ప్రతినిధి): నిజామాబాద్ పట్టణంలోని నాగారం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను నిజామాబాద్ ఎంపీ కవిత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డార్మేటరీ, బాత్‌రూంలను పరిశీలించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలంటూ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల దుస్తులను రోజూ ఉతికించాలని సిబ్బందికి సూచించారు. కిచెన్‌ను శుభ్రంగా ఉంచాలని సూచించిన ఎంపీ.. వంట నూనె, బియ్యం, పప్పు ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. బోధన, చదువుకు సంబంధించిన గదులలో తగిన వెలుతురు ఉండేలా చూడాలని కవిత అధికారులను అదేశించారు. పరీక్షల సమయం కావడతంతో వేళకు భోజనం, నిద్ర నిర్దేశిత సమయం ప్రకారం జరిగేలా చూడాలని ఇంచార్జి ప్రిన్సిపాల్ మూస్తాఫాకు సూచించారు.

జిన్ పింగ్ గొప్పనేత.. గొప్ప వ్యక్తి

- చైనాలో శక్తివంతమైన నాయకుడు
- అమెరికాకు శాశ్వత అధ్యక్షుడు ఉండాలి:ట్రంప్

వాషింగ్టన్, మార్చి 4: చైనా నా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను అమెరికా అధ్యక్షుడు పొగడ్తలతో ముంచెత్తారు. ఆయన గొప్ప వ్యక్తి అని.. చైనాలో గత వందేళ్లలో అత్యంత శక్తిమంతమైన అధ్యక్షుడు ఆయనేనని కొనియాడారు. చైనాలో అధ్యక్ష పదవిని రెండుసార్లు మాత్రమే చేపట్టే నిబంధనను అక్కడి అధికారిక కమ్యూనిస్ట్ పార్టీ శనివారం తొలగించింది. దీంతో జిన్‌పింగ్ నిరవధికంగా ఆ పదవిలో కొనసాగేందుకు మార్గం సుగమం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం దక్షిణ ఫ్లోరిడా ఎస్టేట్‌లో నిర్వహించిన విరాళాల సేకరణ కార్యక్రమంలో రిపబ్లికన్ దాతలనుద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ చైనా అధ్యక్షుడిపై ప్రశంసలు కురిపించారు.''ఆయన ప్రస్తుతం జీవితకాలపు అధ్యక్షుడు. ఎంతో గొప్పవ్యక్తి. ఆయన అలా చేయగలిగారు. దీన్ని నేను గొప్ప విషయంగా భావిస్తున్నా. అమెరికా కూడా జీవితకాలపు అధ్యక్షుడిని ఏదో ఒకరోజు కలిగి ఉంటుంది'' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఆ దేశ అధ్యక్షుడిగా ఒక వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశం ఉంది. గతంలో ఫ్రాంక్లిన్ రూస్‌వెల్ట్ 1932 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు అమెరికా అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తర్వాత 1951లో అమెరికా రాజ్యాంగానికి సవరణలు చేసి.. ఒక వ్యక్తి అధ్యక్ష పదవిని రెండు పర్యాయాలకంటే ఎక్కువ సార్లు చేపట్టకుండిబంధన తీసుకువచ్చారు. శాశ్వత అధ్యక్షుడి వల్ల దేశం ఐక్యత దెబ్బతినకుండా ఉంటుందని ట్రంప్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

జార్ఖండ్‌లో వివాహ వేడుకలో విషాదం

- జనపైకి దూసుకెళ్లి కారు.. ఏడుగురు మృతి

రాంచీ, మార్చి 4: జార్ఖండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లటంతో ఏడుగురు మృతి చెందగా.. ఏడుగురు గాయపడ్డారు. జంషెడ్‌పూర్‌కు 90 కిలోమీటర్ల దూరంలో చియాబస పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి చియాబాసా-ఛాకర్దార్ హైవేపై బరోడా బ్రిడ్జి వద్ద ఉన్న ఓ గుడిలో రెండు గిరిజన కుటుంబాలు వివాహ వేడుకల కోసం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆ సమయంలో రోడ్డుపై వేగంగా వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి వారిపైకి దూసుకెళ్లింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే మ తి చెందగా.. మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బీసీ బిల్లుపై గళం విప్పండి

- ఎంపీలకు జాజుల బహిరంగ లేఖ

హైదరాబాద్‌సిటీ, మార్చి 4(మనం ప్రతినిధి): రేపటినుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు కోసం, కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు జరిగిన అన్యాయంపై తెలంగాణకు చెందిన 17మంది ఎంపీలు తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వంపై బీసీల పక్షాన పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. దీనిపై బీసీ సంక్షేమ సంఘం ఆదివారం 17 మంది ఎంపీలకు బహిరంగ లేఖ రాసింది. బీసీల ఓట్లతో గెలిచి బడుగులతో జెండాలు మోయించుకొని పార్లమెంట్‌లో అడుగుపెట్టిన మీరు బీసీల గురించి మాట్లాడకపోతే వచ్చే సాధారణ ఎన్నికల్లో మళ్లీ బీసీల ఓట్లను అడిగే నైతిక హక్కు కోల్పోతారని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం సీఎం కేసీఆర్ జరిపిన పార్టీ ఎంపీల సమావేశంలో కేంద్రంపై వత్తిడి పెంచాల్సిన ఎజెండాలో బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం మరిచి పోయారెందుకని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ ఈసారి ఢిల్లీ పర్యటనలో బీసీ బిల్లు అంశం ఎజెండాగా ఉంచాలని కోరారు.

సిరుల గని సిన్నబోయేనా?

(మొదటి పేజీ తరువాయి)

టన్నుల లక్ష్యాన్ని సింగరేణి యాజమాన్యం నిర్దేశించుకుంది. గడిచిన 11 నెలల్లో కేవలం 54.64 మిలియన్ టన్నుల బొగ్గును మాత్రమే కంపెనీ సాధించింది. దీంతో కొంత ఆందోళనకు గురైన యాజమాన్యం అంతర్గతంగా 62 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష ్యంగా చేసుకోవడం గమనార్హం. అయితే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అంతర్గత లక్ష ్యమైనా సాధ్యమవుతుందా లేదా అనే మీమాంసలో అధికారులు పడ్డారు. సరైన ప్రణాళికలు లేకుండా కేవలం ప్రభుత్వం మెప్పు కోసమే ఉన్నతాధికారులు ఉత్పత్తి లక్ష్యాలను భారీగా పెట్టుకున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

నష్టాల నుంచి లాభాల బాటలోకి

నష్టాల బాటలో ఉండి బీఎఫ్ఐఆర్‌లోకి వెళ్లనున్న సింగరేణి కంపెనీని కార్మికులు, అధికారులు సమష్టి కృషితో లాభాల బాటలోకి తీసుకువచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ, కార్మిక సంఘాల పోరాటంతో సింగరేణి బీఎఫ్ఐఆర్‌లోకి వెళ్లకుండా ఉంది. నాటి నుంచి నేటి వరకు దాదాపు 15 ఏండ్ల కాలంగా సింగరేణి రారాజుగా విరాజిల్లుతోంది. నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలకు ఆదర్శంగా నిలిచింది. వరుసగా ఉత్పత్తి లక్ష్యాలను సాధించటంతో పాటు లాభాలను ఆర్జిస్తూ వచ్చింది. దీంతో కార్మికులకు లాభాల్లో వాటాను ఇచ్చే ఆనవాయితీకి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాగా ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో 11 ఏరియాల్లో విస్తరించిన బొగ్గు గనుల్లో 2017-18 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 66 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధన గగనంగా మారింది. 2017 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 2018 వరకు కేవలం 54.64 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న క్రమంలో లక్ష్యాలను సాధించేందుకు యాజమాన్యం ముమ్మర కసరత్తు చేపట్టింది.

ఉత్పత్తి లక్ష్యం కుదింపు

2017-18 ఆర్థిక సంవత్సరంలో 66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని యాజమాన్యం నిర్దేశించుకుంది. లక్ష్య సాధన కష్టంగా కనిపించడంతో యాజమాన్యం దానిని 62 మిలియన్ టన్నులకు కుదించుకుంది. ఫిబ్రవరి నెలాఖరుకు 59.69 మిలియన్ టన్నులకు గానూ 54.64 మిలియన్ టన్నుల బొగ్గును మాత్రమే సాధించింది. అయితే 62 మిలియన్ టన్నుల బొగ్గును కూడా సాధించటం కూడా అంత సులువేం కాదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ప్రతి ఏడాది 10శాతం బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలని యాజమాన్యం భావించింది. 2014-15 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఏడాది 10 శాతం ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వస్తోంది. కాని ఈ ఏడాది లక్ష్య సాధన అందనంత దూరంలో ఉంది.

ప్రణాళిక లోపమేనా...

ప్రణాళికల రూపకల్పనలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వహిస్తుందనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. గనుల వారీగా లక్ష్యాలను నిర్దేశించే క్రమంలో సాధ్యాసాధ్యాలను అంచనా వేయడంలో యాజమాన్యం విఫలమయ్యిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. గత 11 నెలల్లో కొత్తగూడెం, మణుగూరు, రామగుండం-3, బెల్లంపల్లి గనులు మాత్రమే లక్ష్యాలు సాధించాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఉత్పత్తి లక్ష్య సాధనపై దృష్టి పెట్టని అధికారులు.. పుణ్య కాలం ముగిసిన తర్వాత హడావుడి చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొన్ని కొత్త గనులు అందుబాటులోకి వస్తాయని ఆశించి యాజమాన్యం ఉత్పత్తి లక్ష్యాలను భారీగా పెట్టుకుంది. కొత్త గనులు సకాలంలోఅందుబాటులోకి రాకపోవటంతో ఇప్పుడు ఉత్పత్తి లక్ష్యానికి బ్రేక్ పడుతుంది. అసలే ఉత్పత్తి లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న సమయంలో సీఎం కోల్‌బెల్ట్ పర్యటన సందర్భంగా కొన్ని ఏరియాలకు సెలవు ప్రకటించటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. లక్ష్యసాధన జరగకపోతే కార్మికులకు ప్రతిఏటా వచ్చే లాభాల బోనస్‌కు మంగళం పాడే అవకాశాలున్నాయని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి లక్ష్యాల సాధనపై దృష్టి పెడితే ఇప్పుడు ఈ ఇబ్బంది ఉండేది కాదని కార్మికులు పేర్కొంటున్నారు. కొత్త గనులు వస్తాయో లేదో సరైన అంచనా వేయకుండా ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించుకోవడం ఎంతవరకు సమంజసమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

సీఎం కేసీఆర్ అండగా ఉన్నా

సింగరేణి కార్మికులను దేశ సరిహద్దు సైనికులుగా పోల్చిన సీఎం కేసీఆర్, సంస్థకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సింగరేణి ప్రైవేటీకరణ జరగదని, అవసరమైతే కేంద్రం వాటాను కొంటామని ఇటీవల ప్రకటించారు. కారుణ్య నియామకాల విషయంలో కార్మికులకు భరోసా ఇచ్చారు. అనేక రకాలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సంస్థకు అండగా ఉంటున్నా.. యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోంది. సరైన ప్రణాళిక లేకుండా ఉత్పత్తి లక్ష్యాల సాధనలో వెనుకబడడం శోచనీయమని కార్మికులు వాపోతున్నారు.



ఎస్పీకి బీఎస్పీ మద్దతు!

- గోరక్‌పూర్ ఉప ఎన్నికల్లో అనూహ్య పరిణామం

లఖ్‌నవ్, మార్చి 4: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు బద్ధ శత్రువులైన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రానున్న ఉప ఎన్నికల్లో అధికార బీజేపీకి గట్టిపోటీనిచ్చేందుకు చేతులు కలిపాయి. యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఎంపీగా గెలుపొందిన సొంత లోక్‌సభ నియోజకవర్గమైన గోరఖ్‌పూర్‌కు త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలో ఎస్పీకి మద్దతు తెలుపుతున్నట్లు బీఎస్పీ నేత ఘన్‌శ్యామ్ ఖార్‌వార్ అధికారికంగా వెల్లడించారు. గోరఖ్‌పూర్‌తో పాటు పుల్పూర్‌లో లోక్‌సభ ఉప ఎన్నిక జరగనుంది. ఈ రెండు స్థానాలకు చెందిన ఎంపీలు యోగీ ఆదిత్యనాథ్, కేశవ్ ప్రసాద్ మౌర్య రాజీనామాతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు ఈ రెండు పార్టీలు ఒక్కటవడం ప్రస్తుతం యూపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.ట



నేటి నుంచి పార్లమెంటు

- కీలక అంశాలపై చర్చలు.. పీఎన్‌బీ స్కాం ప్రస్తావన

న్యూఢిల్లీ, మార్చి 4: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు విరామం తర్వాత సోమవారం ప్రారంభంకానున్నాయి. ఈ సమావేశాల్లో కీలక అంశాలు చర్చకు రానున్నాయి. దేశాన్ని కుదిపేసిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్టు సమాచారం. నెల రోజుల విరామం తర్వాత లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు జరగనున్నాయి. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి ఎన్డీయే ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. బడ్జెట్‌పై ఉభయ సభల్లో చర్చ జరగనుంది. అలాగే బ్యాంకు రుణాల ఎగవేత దారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టం తీసుకురావాలనే కృతనిశ్చయంతో ఉంది. పీఎన్‌బీకు 12,700 కోట్ల రూపాయలను ఎగవేసి వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే. గతంలో విజయ్ మాల్యా కూడా బ్యాంకులకు టోకరా వేసి బ్రిటన్ పారిపోయాడు. దీనిపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి.

హోదా కోసం ఏపీ ఎంపీల నిరసన

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటులో టీడీపీ, వైసీపీ ఎంపీలు నిరసన తెలపనున్నారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని ఇప్పటికే వైసీపీ ప్రకటించింది. పార్లమెంటు సమావేశాల్లోగా స్పష్టమైన హామీ ఇవ్వకుంటే తమ పార్టీ ఎంపీలు రాజీనామా చేస్తారని జగన్ ప్రకటించారు. ఎన్డీయేకు మిత్రపక్షమైన టీడీపీ కూడా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

పాక్‌లో దళిత హిందూ మహిళకు పట్టం

- సెనేటర్‌గా ఎన్నికైన కృష్ణ కుమారి కోలి

కరాచీ, మార్చి 4: అది పాకిస్థాన్. కరడుగట్టిన ముస్లిం మత ఛాందసవాద దేశం. అలాంటి దేశంలో ఒక హిందూ మహిళ.. అది కూడా దళిత మహిళ సెనేటర్‌గా ఎన్నికయ్యారు. పాక్‌లోని సింధ్ రాష్ట్రానికి చెందిన కృష్ణకుమారి కోలి (39) ఈ పదవికి ఎన్నికైనట్లు పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ తెలిపింది. బిలావల్ భుట్టో నేతృత్వంలోని పార్టీలో ఆమె ఎప్పటినుంచో సభ్యురాలు. సింధ్‌లో మైనారిటీలకు రిజర్వు అయిన ఒక సీటు నుంచి పోటీచేసి ఆమె గెలిచారు. పీపీపీ ఆమెకు టికెట్ ఇచ్చింది. పాకిస్థాన్‌లో మహిళలు, మైనారిటీల హక్కుల సాధన విషయంలో ఆమె ఎన్నిక ఒక ముందడుగుగా భావించవచ్చు. ఇంతకుముందు రత్నా భగవాన్‌దాస్ చావ్లా తొలి హిందూ మహిళగా పీపీపీ నుంచి ఎన్నికయ్యారు. సింధ్ రాష్ట్రంలోని నగర్‌పార్కర్ జిల్లాలో ఓ మారుమూల గ్రామానికి చెందిన జుగ్నూ కోలి అనే పేద రైతు కుటుంబంలో 1979 ఫిబ్రవరిలో ఆమె పుట్టారు. ఉమర్‌కోట్ జిల్లాలోని కున్రి గ్రామంలో ఓ భూస్వామికి చెందిన ప్రైవేటు జైల్లో కోలి తల్లిదండ్రులు మూడేళ్ల పాటు ఖైదీలుగా ఉన్నారు. ఆ సమయంలో ఆమె మూడోతరగతి చదివేది. తొమ్మిదో తరగతి చదువుతుండగా 16 ఏళ్ల సమయంలో ఆమెను లాల్‌చంద్ అనే భూస్వామికిచ్చి పెళ్లి చేశారు. అయినా ఆమ తన చదువు కొనసాగించి 2013లో సింధ్ యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఆ తర్వాత తన సోదరుడితో కలిసి ఆమె పీపీపీలో సామాజిక కార్యకర్తగా చేరారు. ఆ తర్వాత ఆమె సోదరుడు యూనియన్ కౌన్సిల్ బెరానోకు చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. కోలి కూడా పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని అణగారిన వర్గాల సంక్షేమం, వారి హక్కుల కోసం కృషిచేసేది. కోలి వంశంలో కురువృద్ధుడైన రూప్లో కోలి స్వాతంత్ర్య సమరయోధుడు. సింధ్ మీదకు బ్రిటిష వారు దండెత్తినపుడు ఆయన వారిపై పోరాడారు. తర్వాత బ్రిటిష్‌వారు 1858 ఆగస్టు 22న ఆయనను అరెస్టుచేసి



ఉరి తీశారు. నవాజ్ షరీఫ్‌కు చెందిన పీఎంఎల్-ఎన్ పార్టీ సింధ్ సెనేట్‌లో 15 సీట్లు గెలుకుని పార్లమెంటు ఎగువసభలో అతిపెద్ద పార్టీగా అవతరించింది.

కన్రాడ్ సంగ్మాకు పీఠం

మేఘాలయ కొత్త సీఎంగా రేపు ప్రమాణం.. కొలువుదీరనున్న ఎన్‌పీపీ సంకీర్ణ సర్కారు

- బీజేపీ సహా నాలుగు పార్టీల అండదండలు
- 34 మంది ఎమ్మెల్యేల మద్దతున్నట్లు ప్రకటన

షిల్లాంగ్, మార్చి 4: మేఘాలయలో ప్రజా తీర్పు 'త్రిశంకు సభ'కు దారితీసిన నేపథ్యంలో రాష్ట్రంలోని 'చిన్న' పార్టీ ఎన్‌పీపీకే 'పెద్దన్న' పాత్ర దక్కింది. ఈ మేరకు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) అధినేత, లోక్‌సభ మాజీ స్పీకర్ పి.ఎ. సంగ్మా కుమారుడు కన్రాడ్ సంగ్మా ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన తురా లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన ఈ మేరకు మంగళవారం (6న) ఉదయం 10:30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అంతకుముందు తమకు మద్దతు ప్రకటించిన యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ), బీజేపీ, హిల్ స్టేట్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (హెచ్ఎస్‌పీడీపీ)ల ఎమ్మెల్యేలతో కలసి ఆదివారం ఆయన గవర్నర్ గంగాప్రసాద్‌ను కలిశారు. తమకు 34 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నదని, ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ ఈశాన్య రాష్ట్రాల వ్యూహకర్త హిమంత విశ్వశర్మ కూడా ఆయన వెంట ఉన్నారు. కన్రాడ్ విజ్ఞప్తిని అంగీకరించిన గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆయనను ఆహ్వానించారు. అనంతరం సంగ్మా విలేకరులతో మాట్లాడుతూ 'పెద్ద పార్టీగా అవతరించడం ఒక్కటే చాలదు... ఆధిక్యమే ప్రధానం' అని కాంగ్రెస్ నుద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ సీఎం అభ్యర్థిగా తన పేరు వినిపించడాన్ని తొలుత తోసిపుచ్చిన ఆయన- సంకీర్ణ భాగస్వాముల ఒత్తిడి మేరకు అంగీకరించినట్లు చెప్పారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీకి వ్యతి రేకంగా తీర్పు ఇచ్చారని, అధికారంలోకి రాబోయేది తామేన ని శనివారం ఆయన ప్రకటించడం గమనార్హం. కాగా, ఇతర పార్టీల భుజాలమీదనుంచి బీజేపీ తమపై తుపాకీ ఎక్కుపెట్టే రాజకీయాలకు పాల్పడిందంటూ కాంగ్రెస్ నేత, మాజీ సీఎం ముకుల్ సంగ్మా దుయ్యబట్టారు.



కాంగ్రెస్‌కు 'చే'జారిపోయిన అధికారం

మొత్తంమీద పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి, ప్రస్తుతం 21 స్థానాలతో ఆధిక్యానికి 9 సీట్ల దూరంలో నిలిచిపోయిన కాంగ్రెస్‌కు అధికారం 'చే'జారింది. దీంతో గోవా శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత సకాలంలో మద్దతు కూడగట్టడంలో విఫలమైన రీతిలోనే మేఘాలయలోనూ కాంగ్రెస్ వైఫల్యం స్పష్టమైంది. ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన తమకే ప్రభుత్వ ఏర్పాటు అవకాశం ఇవ్వాలన్న ఆ పార్టీ వినతిని గవర్నర్ తోసిపుచ్చారు. తమకు మద్దతిచ్చే పార్టీల నుంచి లేఖలను అందజేయకపోవడంతో కాంగ్రెస్‌కు దారులు మూసుకుపోయాయి. మరోవైపు మధ్యాహ్నం వేళ యూడీపీ అధినేత డాక్టర్ డోంకుపర్ రాయ్ ఎన్‌పీపీకి మద్దతు ప్రకటించారు. కాంగ్రెసేతర, సుస్థిర ప్రభుత్వమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆరు స్థానాలు గెలిచిన యూడీపీతో పాటు రెండేసి సీట్లు సాధించిన బీజేపీ, హెచ్ఎస్‌పీడీపీల మద్దతుతో ఎన్‌పీపీ బలం 29కి పెరిగింది. అటుపైన నాలుగు స్థానాలున్న పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్), ఓ స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతుతో సంకీర్ణం బలం 34కు పెరిగింది. కాబట్టి ఎన్‌పీపీ నేతృత్వంలో సంకీర్ణ సర్కారు నిలదొక్కుకోవడం ఖాయమే! ఎన్‌పీపీ అధినేత కన్రాడ్ సంగ్మా ఈ మేరకు ధీమా వ్యక్తం చేశారు.

గవర్నర్‌ను కలిసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ – ''సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం ఆషామాషీ ఏమీ కాదు. కానీ, మాతో చేయి కలిపి న ఎమ్మెల్యేలందరూ రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి కట్టు బడి ఉన్నారు. మేమంతా సమష్టిగా మేఘాలయ సర్వతో ముఖాభివృద్ధికి కృషిచేస్తాం'' అని ప్రకటించారు. తమ ప్రభు త్వ ఏర్పాటుపై సందిగ్ధం తొలగిపోయిందని, రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి పదవి ఉండబోదని హిమంత కూడా ప్రకటించారు.

వేగంగా మారిన సమీకరణాలు

రాష్ట్రంలో 'త్రిశంకు సభ'ను నివారించే దిశ గా సాగిన రాజకీయ పరిణామాలతో సమీకర ణాలు వేగంగా మారిపోయాయి. కాంగ్రెస్ అధి ష్ఠానం శనివారం రాత్రే అహ్మద్ పటేల్, సీపీ జోషి, కమల్‌నాథ్‌లను రాష్ట్ర రాజధాని షిల్లాంగ్ పంపింది. అలాగే కాంగ్రెస్‌కు మూడోసారి అధికారం దక్కనీయరాదన్న లక్ష్యం ప్రకారం బీజేపీ ఈశాన్య రాష్ట్రాల వ్యూహకర్త హిమంత విశ్వశర్మ కూడా ఆదివారం తెల్లవారేసరికి రాజధానిలో వాలిపోయారు. మరోవైపు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి కిరణ్ రిజిజు మధ్యాహ్నం వేళ యూడీపీ అధినేత డోంకుపర్ రాయ్‌తో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ– బీజేపీకి దక్కింది రెండు సీట్లే కాబట్టి కీలకపాత్ర ఏదీ ఉండబోదన్నారు. అప్పటికే ఎన్‌పీపీకి మద్దతిస్తున్నట్లు రాయ్ ప్రకటించగా, ఈ నిర్ణయాన్ని వాపసు తీసుకోవాలని కాంగ్రెస్ నేత, మాజీ సీఎం ముకుల్ సంగ్మా ఆయనను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదు. యూడీపీ నేతృత్వంలో ప్రాంతీయ పార్టీలన్నీ కలిస్తే ప్రభుత్వ ఏర్పాటుకు తామే మద్దతిస్తామని ఆఫర్ కూడా ఇచ్చినట్లు సమాచారం.

బీజేపీ.. ఓ బొద్దింక!


- ఈకలు పెట్టుకుని నెమలి అయిపోయానని భావిస్తోంది
- ఈశాన్య రాష్ట్రాల్లో కమలం విజయంపై మమత ఎద్దేవా



కోల్‌కతా, మార్చి 4: ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుతో ఊపు మీద ఉన్న భారతీయ జనతా పార్టీని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బొద్దింకతో పోల్చారు. త్రిపుర శాసనసభ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ పశ్చిమ బెంగాల్, ఒడిశాలలో బీజేపీ ఎన్నటికీ గెలవబోదని ఘంటాపథంగా చెప్పారు. బీజేపీని విమర్శిస్తూ ''బొద్దింక ఓ నెమలి ఈకలను తగిలించుకుని తానే నెమలి అయిపోయినట్లు కలలు కంటోంది'' అని ఎద్దేవా చేశారు త్రిపురలో బీజేపీ గెలుపుకు కారణాలను విశ్లేషిస్తూ సీపీఎం పూర్తిగా లొంగిపోయిందని, పొత్తు కుదుర్చుకోవడానికి కాంగ్రెస్ అంగీకరించలేదని, అందుకే బీజేపీ గెలిచిందని అన్నారు. రాహుల్ గాంధీ ఒకవేళ తృణమూల్ కాంగ్రెస్, స్థానిక పార్టీలతో పొత్తుకు అంగీకరించి ఉంటే ఇటువంటి ఫలితాలు వచ్చి ఉండేవి కాదన్నారు. ఈ ఫలితాలు బీజేపీకి త్వరలో జరిగే ఇతర రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఉపయోగపడవన్నారు. 26 లక్షల మంది ఓటర్లు, 2 లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రంలో కేవలం 5 శాతం ఓట్లతో గెలిచినందుకు సంతోషించవలసిందేమీ లేదన్నారు. త్రిపురలో వామపక్ష కూటమికి-బీజేపీకి మధ్య 5 శాతం ఓటింగ్ మాత్రమే తేడా ఉందని అన్నారు.

లెఫ్ట్ 'చేయి' కలపాల్సిందే!

- త్రిపుర ఓటమితో సీపీఎం పునరాలోచన
- కాంగ్రెస్‌తో కలిసేందుకు సానుకూలం?
- గతంలోనే సీతారాం ఏచూరి ప్రతిపాదన
- అప్పట్లో తిరస్కరించిన పార్టీ కేంద్ర కమిటీ
- మనుగడకు పొత్తు తప్పదంటున్న నేతలు
- త్రిపుర అనుభవంతో మారనున్న వ్యూహం
- ఏచూరి.. బెంగాల్ లాబీ కాంగ్రెస్‌కు అనుకూలం
- కేరళ విభాగం.. ప్రకాష్ కరత్ వ్యతిరేకం
- వచ్చే నెలలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం



కోల్‌కతా, మార్చి 4: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోవడంతో.. భవిష్యత్ రాజకీయ వ్యూహాల గురించి సీపీఎం పునరాలోచనలో పడింది. అవసరమైతే కాంగ్రెస్‌తో 'సర్దుబాటు' తప్పదని భావిస్తోంది. వచ్చే నెలలో జరిగే కీలక సమావేశంలో దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. త్రిపురలో ఘోర ఓటమి పార్టీలో పలు ప్రశ్నలు రేకెత్తించింది. పార్టీ బతికి బట్టకట్టాలంటే సరైన వ్యూహాన్ని అవలంబించాలని నాయకులు అంటున్నారు. త్రిపురలో ఐపీఎఫ్‌టీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ.. ఏకంగా మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. దాంతో ఆ రాష్ట్రంలో పాతికేళ్లుగా కొనసాగుతున్న లెఫ్ట్‌ఫ్రంట్ పాలనకు తెరపడింది. బీజేపీ, ఐపీఎఫ్‌టీ కలిసి 43 స్థానాలు గెలుచుకున్నాయి. సీపీఎం కేవలం 16తో సరిపెట్టుకోగా కాంగ్రెస్‌కు 9 సీట్లు వచ్చాయి. పార్టీ చాలా కష్టకాలంలో ఉందని, సరైన కొత్తమార్గం వెతుక్కోక తప్పదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు హన్నన్ మొల్లా అన్నారు. కాంగ్రెస్‌తో ఎలాంటి అవగాహన అవసరం లేదని తాము తమ ముసాయిదా తీర్మానంలో చెప్పుకొన్నామని, కానీ ప్రస్తుతం త్రిపురలో ఓటమి తర్వాత పూర్తిగా కొత్త పరిస్థితి ఏర్పడిందని.. తమ రాజకీయ వ్యూహాల విషయంలో పునరాలోచించుకోవాల్సి ఉందని ఆయన అన్నారు.

అప్పుడు ఏచూరి చెప్పినా వద్దని..


ఈ ఏడాది జనవరి 21న పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కాంగ్రెస్‌తో చేతులు కలుపుదామని ప్రతిపాదిస్తూ చేసిన రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని సీపీఎం కేంద్ర కమిటీ తిరస్కరించింది. సాధారణంగా ముసాయిదా తీర్మానం ఆమోదిస్తే దాన్ని తర్వాతి నెలలో పార్టీ కాంగ్రెస్ ముందు పెడతారు. కానీ అప్పుడు మాత్రం ఆయన చెప్పినా వినిపించుకోకుండా.. కాంగ్రెస్‌తో కలిసేది లేదన్నారు. ఇప్పుడు పొత్తు అంశాన్ని పార్టీ కాంగ్రెస్‌లో చర్చించాల్సి ఉందని, చర్చ తర్వాత మార్పులకు కూడా అవకాశం ఉంటుందని మొల్లా అన్నారు. త్రిపురలో ఓటమి సహా అన్ని అంశాలను పార్టీలో చర్చిస్తామని, అవసరమైతే రాజకీయ వ్యూహాలు మార్చుకుంటామని మరో పొలిట్‌బ్యూరో సభ్యుడు మహ్మద్ సలీమ్ చెప్పారు.

కాంగ్రెస్ పార్టీతో జతకలిసేందుకు అవకాశాలన్నీ ఉన్నాయని కేంద్ర కమిటీ సీనియర్ సభ్యుడొకరు చెప్పారు. కాంగ్రెస్‌తో కలిసేందుకు మధ్యేమార్గం అవలంబించాల్సి ఉంటుందని అన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తుల మధ్య విభేదాలతో బీజేపీని లబ్ధి పొందనివ్వబోమని అన్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన పలువురు నేతలతో పాటు సీతారాం ఏచూరి కూడా బీజేపీని అడ్డుకోడానికి కాంగ్రెస్‌తో కలవాలని వాదిస్తున్నారు. ఈ వాదనను సీపీఎంలో కరడుగట్టిన నాయకుడైన ప్రకాష్ కరత్‌తో పాటు పార్టీ కేరళ విభాగం వ్యతిరేకిస్తోంది. కానీ వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత నుంచి కాంగ్రెస్ పార్టీని ఎక్కువ కాలం దూరం పెట్టడం సరికాదని త్రిపురకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడొకరు చెప్పారు.

ఇప్పుడు త్రిపుర ఫలితాలతో ఏచూరి వాదనకు, బెంగాల్ లాబీకి బలం పెరిగింది. బీజేపీని ఎదుర్కోవాలంటే కాంగ్రెస్‌ను కూడా కలుపుకోవాలన్న వాదన బలం పుంజుకుంటోంది. బీజేపీ నుంచి ముప్పు ఉందన్న విషయం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని బెంగాల్‌కు చెందిన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడొకరు అన్నారు. బీజేపీ విభజన రాజకీయాల ఫలితాన్ని ఇప్పటికే త్రిపుర అనుభవిస్తోందని, ఆర్ఎస్ఎస్ నుంచి పదే పదే దాడులు ఎదురవుతున్నా పార్టీ కేరళ విభాగం మాత్రం దాన్ని అర్థం చేసుకోలేకపోతోందని ఆయన చెప్పారు. సీపీఐ కూడా కాంగ్రెస్‌తో పొత్తును సమర్థిస్తోంది. పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ చౌధురి లాంటివాళ్లు సీపీఎం కలిసొస్తే మంచిదని చెబుతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఉపయోగం ఉండదని, అందువల్ల సీపీఎం తన రాజకీయ విధానాల గురించి ఇప్పుడే ఆలోచించాలని ఆయన సూచించారు.

స్టాలిన్ దరిదాపుల్లోకి పుతిన్

రష్యాను 29 ఏళ్ల పాటు పరిపాలించిన జోసెఫ్ స్టాలిన్ తర్వాత దాదాపు ఆ స్థాయికి చేరువగా వస్తున్న నేత వ్లాదిమిర్ పుతిన్.. రష్యా అధ్యక్షుడిగా నాలుగో పర్యాయం కూడా గెలిచి, పూర్తికాలం పదవిలో ఉంటే పుతిన్ 25 ఏళ్లపాటు రష్యాను పాలించినట్లవుతుంది. రష్యన్ల ఆమోదం పొందిన నియంత స్టాలిన్ పాలన తర్వాత అంత సుదీర్ఘంగా పాలించిన నేతగా పుతిన్ చరిత్రకెక్కనున్నారు. ఈ క్రమంలో రష్యా పాలకుల్లో ఎవరెవరు, ఎంతెంత కాలం పాలించారనే వివరాలు...



పుతిన్ అధికారంలోకి వచ్చాక.. అమెరికాకు నలుగురు అధ్యక్షులు మారారు. బ్రిటన్‌లో నలుగురు ప్రధాన మంత్రులు, జర్మనీలో ఇద్దరు చాన్సలర్లు మారారు.

పీఎన్‌బీ అధికారికి భారీగా లంచాలు

- బంగారు, వజ్రాభరణాలు ముట్టజెప్పిన నీరవ్: సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 4: పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కాంలో సీబీఐ సంచలన విషయాలను వెల్లడించింది. ఈ కుంభకోణంలో ఓ పీఎన్‌బీ అధికారికి నీరవ్ మోదీ.. బంగారు, వజ్ర ఆభరణాలను లంచంగా ఇచ్చినట్లు సీబీఐ చెప్పింది. 12 వేల కోట్లకుపైగా జరిగిన ఈ స్కాంలో నీరవ్ మోదీ ప్రధాన నిందితుడన్న విషయం తెలిసిందే. విదేశాల్లోని ఇండియన్ బ్యాంక్స్ నుంచి లోన్లు పొందేందుకు అవసరమైన అండర్‌టేకింగ్ లేఖలను ఇవ్వడానికి పీఎన్‌బీ అధికారులకు నీరవ్ లంచాలు ఇచ్చాడని తొలిసారి సీబీఐ చెప్పడం గమనార్హం. ఈ కేసులో ఇప్పటికే 14 మందిని అరెస్ట్ చేశారు. ఒక అధికారికి నగల రూపంలో భారీ లంచం ముట్టినట్లు సీబీఐ స్పష్టంచేసింది. ఆ అధికారి పేరు యశ్వంత్ జోషి అని, ఇతను ముంబై పీఎన్‌బీ బ్రాంచ్‌లో ఫారెక్స్ డిపార్ట్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని తెలిపింది. ఆయనకు నీరవ్ మోదీ 60 గ్రాములున్న రెండు బంగారు కాయిన్స్, బంగారం, వజ్రాలు పొదిగిన చెవిపోగులు లంచంగా ఇచ్చినట్లు సీబీఐ వెల్లడించింది. ఈ ఆభరణాలను సీబీఐ అధికారులు జోషి ఇంట్లో నుంచి స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై నీరవ్ మోదీ ఈ స్కాంకు పాల్పడినట్లు చెప్పడానికి ఇదే నిదర్శనమని సీబీఐ అంటున్నది. నీరవ్‌కు అండర్‌టేకింగ్ లెటర్స్ ఇవ్వడానికి ఇలా జోషి లంచాలు తీసుకుంటూనే ఉన్నాడని చెప్పింది.

లీక్‌తో '2.0'కు షాక్


● రజనీకాంత్

భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించే దర్శక నిర్మాతలకు లీకేజీల రూపంలో సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి. ఈ సమస్యలకు ఏదో ఒక రూపంలో అడ్డుకట్ట వేయాలని యూనిట్ సభ్యులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు కానీ.. కుదరడం లేదు. ఇప్పుడు రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 'రోబో' సీక్వెల్‌గా రూపొందుతోన్న చిత్రం '2.0'. నాలుగు వందల కోట్ల బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా గురించి అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీపై ఇప్పటికీ సందిగ్ధం నెలకొని ఉండగా.. కనీసం టీజర్‌నైనా చూడాలని ఆశపడుతున్న రజనీ అభిమానులకు ఆ ఆశ కూడా నెరవేరడం లేదు. దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది దుండగులు.. తాజాగా టీజర్‌కు సంబంధించిన కొన్ని దృశ్యాలను ఆన్ లైన్‌లో లీక్ చేసేశారు. ఈ విషయంపై ట్విట్టర్ వేదికగా రజనీ కుమార్తె సౌందర్య స్పందిస్తూ.. ''అధికారికంగా విడుదల కాని టీజర్‌ను ఇలా ఆన్ లైన్‌లో విడుదల చేయడం సహించరానిది. ఇటువంటి వాటిని ప్రోత్సహించ కూడదు. కొన్ని నిమిషాల ఆనందం కోసం నిర్మాతల కృషినీ, ప్రయత్నాన్ని, కష్టాన్ని విస్మరించి ఇలా చేయడం మతిలేని చర్య'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



చైతు 'ప్రేయసి'

అక్కినేని నాగచైతన్య, శివ నిర్వాణ కలయికలో ఓ సినిమా రూపొందనుందని వార్తలు వినిపిస్తున్న సంగతి విదితమే. ఈ సినిమాలో చైతు సతీమణి, హీరోయిన్ సమంత నటిస్తుందని అంటున్నారు. 'నిన్నుకోరి' వంటి ప్రేమకథా చిత్రంతో సక్సెస్ అందుకున్న దర్శకుడు శివ నిర్వాణ మరోసారి ఫ్యామిలీ కంటెంట్‌తోనే ప్రేక్షకులను మెప్పించనున్నారు. అయితే ఇప్పుడు చైతన్య.. చందు మొండేటి దర్శకత్వంలో 'సవ్యసాచి' సినిమా చేస్తున్నారు. అలాగే మారుతి దర్శకత్వంలో 'శైలజారెడ్డి అల్లుడు' (వినపడుతున్న టైటిల్) సినిమా చేయాల్సి ఉంది. త్వరలోనే మారుతి సినిమా సెట్స్‌కి వెళ్లనుంది. ఈ సినిమా ముగిసిన తర్వాతే శివ నిర్వాణ దర్శకత్వంలో చైతన్య సినిమా ఉంటుంది. ఈ సినిమాకు 'ప్రేయసి' అనే టైటిల్ పరిశీలనలో ఉందని సమాచారం.



నాని విడుదల చేసిన 'పరిచయం' టీజర్

అసిన్ మూవీ క్రియేషన్స్ పతాకంపై 'హైద్రాబాద్ నవాబ్స్' ఫేమ్ లక్ష్మీకాంత్ చెన్నా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరిచయం'. ఈ చిత్రం టీజర్, ఫస్ట్‌లుక్‌ని హీరో నాని విడుదల చేసారు. విరాట్ కొండూరు హీరోగా పరిచయం అవుతున్న ఈ మూవీలో సిమ్రత్ కౌర్ హీరోయిన్. టీజర్ విడుదల సందర్భంగా నాని మాట్లాడుతూ ''ఈ చిత్రం టీజర్ చాలా ఫ్రెష్‌గా ఉంది. మణిరత్నంగారి 'గీతాంజలి' మూవీ గుర్తొస్తోంది. హీరో, హీరోయిన్ కథకి బాగా స్యూట్ అయ్యారు, ఈ చిత్రం ద్వారా నా మిత్రుడు, దర్శకుడు లక్ష్మీకాంత్ చెన్నాకి, చిత్ర నిర్మాత రియాజ్‌గారికి పెద్ద సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. నిర్మాత రియాజ్ మాట్లాడుతూ ''నాని గారు టీజర్, ఫస్ట్‌లుక్ లాంచ్ చేసినందుకు థాంక్స్. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో సినిమాని రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. దర్శకుడు లక్ష్మీకాంత్ చెన్నా మాట్లాడుతూ ''నానిగారు మా టీజర్‌ని గీతాంజలి లాంటి మంచి మూవీతో పోల్చటం ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో లవ్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఒక మంచి స్ట్రాంగ్ ఎమోషన్ ఉంటుంది'' అన్నారు.



బాలీవుడ్‌కి అమలాపాల్

దక్షిణాది తారలంతా బాలీవుడ్‌లో సినిమాలు చేయాలనుకోవడం.. మంచి అవకాశం వస్తే నటిస్తుండటాన్ని మనం గమనించే ఉంటాం. ఇటీవల రెజీనా బాలీవుడ్‌లో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదే దారిలో మరో దక్షిణాది తార అమలా పాల్ కూడా అడుగులు వేస్తుంది. వివరాల్లోకెళ్తే.. నరేశ్ మల్హోత్రా దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాలో అమలా పాల్ హీరోయిన్‌గా నటించనుందని.. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రానుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. డైరెక్టర్ ఎ.ఎల్.విజయ్‌తో పెళ్ళి, విడాకులు, కోర్టు సమస్యలు ఇన్నింటి మధ్య అమలా పాల్ వరుస అవకాశాలను దక్కించుకుంటూ ముందుకెళుతుండటం విశేషం.



అనుపమ ఫోటోగ్రఫీ

'అఆ', 'ప్రేమమ్', 'శతమానం భవతి', 'ఉన్నది ఒకటే జిందగీ' చిత్రాలతో తెలుగువారికి దగ్గరైన మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నాని ద్విపాత్రాభినయం చేస్తున్న 'కష్ణార్జున యుద్ధం'లో ఓ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో.. అభినయానికి అవకాశమున్న పాత్రలో అనుపమ కనిపించనుందని తెలిసింది. ఇందులో ఆమెది ఫోటోగ్రాఫర్ పాత్ర అని.. ఆమె కోసమే ఆ పాత్ర పుట్టిందా అన్నట్లుగా క్యారెక్టర్ ఉంటుందని చిత్ర వర్గాలు పేర్కొంటున్నాయి. గత నాలుగు చిత్రాలలో తన హావభావాలతో కుర్రకారుని ఫిదా చేసిన అనుపమ.. ఇందులోనూ తన పాత్రతో యువతని అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పుకొస్తున్నారు. కాగా, ఏప్రిల్ 12న ఈ చిత్రం తెరపైకి రానుంది.

మల్టీస్టారర్‌లో మరో హీరోయిన్


● సమంత

'బాహుబలి' తర్వాత దర్శకుడు రాజమౌళి ఏ సినిమా చేస్తారనే విషయంలో ఇప్పటివరకు సరైన సమాచారం లేదు. అయితే ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో మల్టీస్టారర్ చేయబోతున్నారని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. రాజమౌళి తరపున ఈ సినిమా గురించి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కానీ, ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని తెలుస్తోంది. ఈ చిత్రంలో రాశి ఖన్నా ఓ హీరోయిన్‌గా ఎంపికైందన్న వార్త కూడా బయటికి వచ్చింది. ఈ వార్తలపై రాజమౌళి ఏవిధంగానూ స్పందించకపోవడంతో ఈ సినిమా విషయం నిజమేనని ఆయన అభిమానులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు మరో హీరోయిన్ పేరు వినిపిస్తోంది. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఈగ' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన సమంత ఈ మల్టీస్టారర్‌లో ఓ హీరోయిన్‌గా నటిస్తుందట. రామ్‌చరణ్ సరసన 'రంగస్థలం' చిత్రంలో నటించిన సమంత ప్రస్తుతం కన్నడలో సూపర్‌హిట్ అయిన 'యూ టర్న్' చిత్రాన్ని సొంతంగా నిర్మిస్తూ, నటిస్తోంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఓ సినిమా చేస్తుండగా, బోయపాటి శ్రీను, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాజమౌళి దర్శకత్వంలో రూపొందే మల్టీస్టారర్ అక్టోబర్‌లో ప్రారంభమవుతుందని తెలుస్తోంది.

ఫైట్ మాస్టర్ తనయుడు హీరోగా..

ప్రముఖ ఫైట్‌మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ హీరోగా, కావ్య థాపర్ హీరోయిన్‌గా వి.ఎస్.క్రియేటివ్ వర్క్స్ బేనర్‌పై ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. రాము కొప్పుల దర్శకుడు. దివ్య విజయ్ నిర్మాత. ఈ చిత్రం టాకీ పార్ట్‌ను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాము కొప్పుల మాట్లాడుతూ ''సినిమా టాకీ పార్ట్ అంతా అనుకున్న విధంగా పూర్తయింది. మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. రాహుల్ బాడీ లాంగ్వేజ్‌కి సరిపోయే కథ ఇది. తను అద్భుతంగా నటించారు'' అన్నారు. నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ ''డైరెక్టర్ రాముగారు రాహుల్‌ను హీరోగా చక్కగా ప్రజెంట్ చేశారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమా అందరినీ మెప్పించేలా ఉంటుంది. మణిశర్మ అద్భుతమైన బాణీలను అందించారు. అలాగే శ్యామ్ కె.నాయుడుగారి సినిమాటోగ్రఫీ సినిమాకు మరో ఎసెట్ అవుతుంది. టాకీ పార్ట్ పూర్తయిన ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి'' అన్నారు. రాజేంద్రప్రసాద్, మురళీశర్మ, పవిత్ర లోకేష్, పోసాని, ఈశ్వరీరావు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: శ్యామ్ కె.నాయుడు, ఎడిటింగ్: నవీన్ నూలి, ఫైట్స్: విజయ్, నిర్మాత: దివ్య విజయ్, రచన, దర్శకత్వం: రాము కొప్పుల.


● రాహుల్, కావ్య థాపర్

అల్లరి @ 55



అల్లరి నరేష్, నిర్మాత అనిల్ సుంకర కాంబినేషన్‌లో వచ్చిన 'ఆహా నా పెళ్లంట, యాక్షన్ 3డి, జేమ్స్ బాండ్' చిత్రాలు మంచి ఆదరణను పొందిన విషయం తెలిసిందే. ఇప్పుడే నాలుగోసారి అల్లరి నరేశ్, అనిల్ సుంకరల కాంబినేషన్‌లో నాలుగో చిత్రం రానుంది. ఏ టీవి సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మాణ సారథ్యంలో.. 'నందిని నర్సింగ్ హోమ్' ఫేమ్ పి.వి.గిరి దర్శకత్వంలో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలను ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించారు. ఇది అల్లరి నరేష్ నటించే 55వ సినిమా కాగా.. ఎ.కె.ఎంటర్ టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న 15వ చిత్రమిది. ఈ చిత్రానికి కెమెరా: నగేశ్, కళ: గాంధీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికపాటి, నిర్మాత: రామబ్రహ్మం సుంకర, సమర్పణ: ఎ టీవి, నిర్మాణం: ఎకె ఎంటర్‌టైన్మెంట్స్, దర్శకత్వం: పి.వి.గిరి.

గ్యాంగ్‌స్టర్ మందిర

ప్రభాస్ కొత్త సినిమా 'సాహో' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'బాహుబలి'తో ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న ప్రభాస్ నటిస్తున్న మరో ప్రెస్టీజియస్ మూవీ ఇది. యు.వి. క్రియేషన్స్ పతాకంపై పలు భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాలో భారీ తారాగణం నటిస్తోంది. ఈ సినిమాకి సంబంధించిన తాజా షెడ్యూల్ దుబాయ్‌లో ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌లు, ఛేజ్‌లు భారీగా చిత్రీకరిస్తారు. ఈ ఒక్క షెడ్యూల్‌కే దాదాపు 40 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయనున్నారు. ప్రభాస్ సరసన శ్రద్ధా కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నీల్ నితిన్ ముఖేష్, చుంకీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో ఓ లేడీ గ్యాంగ్‌స్టర్ క్యారెక్టర్ కూడా కీలకంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ క్యారెక్టర్ కోసం ఎంతో మందిని అనుకున యూనిట్ చివరికి మందిరా బేడీని ఎంపిక చేసుకుందట. కథ, క్యారెక్టర్లు, యాక్షన్, బడ్జెట్.. ఇలా అన్ని విధాలుగా భారీగా ఉండే ఈ సినిమాలో మందిర క్యారెక్టర్‌ని కూడా అంతే భారీగా తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది.



అమరావతిలో భారీ విగ్రహాలు

- 250 అడుగుల భారత సైనికుడు
- 200 అడుగుల బుద్ధుడి విగ్రహం
- ప్రపంచంలో ఎత్తైనవి ఏర్పాటు
- 'స్మార్ట్ పార్క్స్ ఇన్‌ఫ్రా' ఒప్పందం
- ప్రాజెక్టు సాకారంపై సందేహాలు


అమరావతి ఊహా చిత్రం

విశాఖపట్నం, మార్చి 4 (మనం న్యూస్ బ్యూరో): అమరావతిలో రాజధాని నిర్మాణం పనులు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయో కానీ, అక్కడ పర్యాటకాభివృద్ధి పేరిట భారీ ఒప్పందాలు జరిగిపోతున్నాయి. కొత్త రాజధానిలో కృష్ణా నదీ తీరాన ప్రపంచ రికార్డును సృష్టించే అంతటి రెండు భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తామంటూ స్మార్ట్ పార్క్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు ముందుకు వచ్చింది. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకొనే స్ట్రీట్ టూరిజంలో భాగంగా రూ.6,100 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు సిద్ధమంటూ.. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డుతో (ఏపీఈడీబీ) ఆ సంస్థ ఒప్పందం కూడా కుదుర్చుకుంది. కృష్ణా నదీ తీరంలో ప్రభుత్వం కేటాయించే 130 ఎకరాల భూమిలో ప్రపంచంలోనే ఎత్తైన 250 అడుగుల భారతీయ సైనికుడి విగ్రహాన్ని ఒక వైపు, 200 అడుగుల బుద్ధుడి విగ్రహం మరోవైపు ఏర్పాటు చేయలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందుకోసం కృష్ణా నదీ తీరంలో రెండు విగ్రహాలకు మధ్య రెండు కిలోమీటర్ల పొడవున 80 అడుగుల విస్తీర్ణంలో ట్రాఫిక్ ఫ్రీ రహదారిని నిర్మిస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ తవ్వా పేర్కొన్నారు. ఇందుకు సుమారు 130 ఎకరాల భూమి అవసరమవుతుందని ఒప్పందంలో స్పష్టం చేశారు. బండ్ స్ట్రీట్ లేదా డెస్టినేషన్ స్ట్రీట్ గా పిలిచే ఈ పర్యాటక కారిడార్‌లో థీమ్ పార్కులు, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్‌లు, హోటళ్లు, ఐకానిక్ కన్వెన్షన్ సెంటర్లు, మాల్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ షాపింగ్ చేసేవారు చైనా, జపాన్, కొరియా వంటి ఆసియా దేశాల్లో వస్తువులను కొనుగోలు చేసే అనుభూతిని పొందేవిధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారిడార్ కృష్ణానది ఒడ్డునే రానున్నందున ఒక ఎక్వేరియంను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఒప్పందంలో స్పష్టం చేశారు. రాజధాని అమరావతి పనులే ఇంకా ప్రారంభం కాని సమయంలో వేల కోట్ల భారీ పెట్టుబడులతో పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకోవడం అతిశయోక్తే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత భాగస్వామ్య సదస్సుల్లో కుదిరిన ఒప్పందాలు మరుగనపడ్డట్టే ఈ భారీ పర్యాటక ప్రాజెక్టు కూడా పట్టాలెక్కడం కష్టమన్న అభిప్రాయం వ్యకమవుతోంది.

ఏవోబీలో అలజడి

- తెలంగాణలో భారీ ఎన్‌కౌంటర్
- తివ్వకొండల్లోకి మావోయిస్టులు?
- దట్టమైన అడవుల్లో శిక్షణ శిబిరాలు
- గుట్టుచప్పుడు కాకుండా కూంబింగ్
- భయాందోళనలో ఏజెన్సీ గిరిజనం
- అలా ఏమీ లేదంటున్న పోలీసు వర్గాలు

శ్రీకాకుళం, మార్చి 4 (మనం న్యూస్ బ్యూరో): తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో భారీ ఎన్‌కౌంటర్ జరిగి.. మావోయిస్టులకు అపార నష్టం వాటిల్లడంతో అగ్రనాయకులతో పాటు అనుచరులు కూడా మరోసారి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో ఉన్న ఏవోబీ ప్రాంతంలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలంగా మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) అయితే అత్యంత సురక్షితంగా ఉంటుందని భావించి.. శ్రీకాకుళం నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు విస్తరించిన తివ్వకొండల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. శత్రు దుర్భేద్యమైన ఈ ప్రాంతంలోనే అగ్రనేతలు కూడా ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. కానీ పోలీసు వర్గాలు మాత్రం.. అసలీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికే లేదని చెబుతున్నారు.

శ్రీకాకుళం జిల్లా అంటేనే.. ఉద్యమాల ఖిల్లా. అసలు నక్సలైటు ఉద్యమం ఊపందుకున్నది ఇక్కడి నుంచే. పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ తర్వాత శ్రీకాకుళంలోనే ఉద్యమం తారస్థాయికి చేరుకుంది. చాలాకాలం పాటు ఈ మూడు జిల్లాలు కేంద్రంగా మావోయిస్టులు తమ కార్యకలాపాలను నిర్వహించేవారు. దట్టమైన అడవీ ప్రాంతం ఉండటం, ప్రజల్లో సానుభూతి కూడా ఉండటంతో వారికి ఇది పెట్టని కోటగా తయారైంది. కానీ.. కొంతకాలం తర్వాత ప్రజల్లో చైతన్యం రావడంతో పాటు పోలీసుల నుంచి కూడా ఒత్తిడి పెరగడంతో గిరిజనుల వైపు నుంచి సహకారం తగ్గింది. దాంతో మావోయిస్టులు కూడా ఇటు నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. కానీ.. అప్పుడప్పుడు మాత్రం ఏవోబీ పరిధిలో ఉన్న తివ్వకొండల్లోకి వచ్చి వెళ్తుంటారని గిరిజనులు చెబుతారు. ఒడిశాలోని రాయగడ, కొంధమాల్, బిసంకటక్, నవరంగ్‌పూర్, గజపతి, గంజాం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఏవోబీ పరిధిలో ఉన్నాయి. అక్కడినుంచి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగుతుంటాయి.

తాజాగా తెలంగాణలో భారీ ఎన్‌కౌంటర్ తర్వాత ఛత్తీస్‌గ ఢ్, ఒడిశా, తెలంగాణ, ఏపీ పోలీసులంతా మావోయిస్టు అగ్రనేతల మీదే దృష్టి పెట్టారని సమాచారం. ఎన్‌కౌంటర్ సమయంలో అక్కడ అగ్రనేతలు కొందరున్నా.. మూడంచెల భద్రతతో వాళ్లు సురక్షితంగా తప్పించుకున్నారంటున్నారు. అక్కడి నుంచి చాలామంది ఇటు తివ్వకొండల వైపు వచ్చారని విశ్వసనీయ సమాచారం. ఇక్కడున్న దట్టమైన అడవులలో అణువణువూ మావోయిస్టు నేతలకు సుపరిచితం. బయటివాళ్లు ఈ అడవిలోకి వస్తే.. తిరిగి బయటకు వెళ్లడం చాలా కష్టం. అందుకే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

అణువణువూ జల్లెడ..

తివ్వకొండల్లోకి మావోయిస్టులు వచ్చి ఉంటారన్న అనుమానం పోలీసు అధికారుల్లోనూ ఉంది. అందుకే గుట్టుచప్పుడు కాకుండా కూంబింగ్ ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారు. దీంతో సరిహద్దు గ్రామాల ప్రజలు ఉలిక్కి పడుతున్నారు. ఒకవైపు పోలీసుల పదఘట్టనలు.. మరోవైపు మావోయిస్టుల నుంచి ఒత్తిళ్ల మధ్య తాము నిరంతరం నలిగిపోతుంటామని, కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్లు తమ పరిస్థితి తయారవుతోందని వారు వాపోతున్నారు. కూంబింగ్ అసలు చేయడం లేదని, ఇక్కడ మావోయిస్టుల ఉనికే లేదని పోలీసు అధికారులు పైకి చెబుతున్నా.. మళ్లీ ఏదైనా భారీ ఘటన జరిగితేనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి.


మావోయిస్టులను మీడియా ముందు హాజరుపరిచిన విశాఖ ఎస్పీ

లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టులు

- త్వరలో మరికొందరు: విశాఖ ఎస్పీ రాహుల్ దేవ్

విశాఖపట్నం క్రైం, మార్చి 4 (మనం న్యూస్): విశాఖపట్నం జిల్లాలో ఆరుగురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. విశాఖ ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ వారిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. చింతపల్లికి చెందిన కొర్రా రాజుబాబు అలియాస్ రాజు(42) 2012 నుంచి 2018 వరకు మావోయిస్టుగా పనిచేశాడు. జీకే వీధికి చెందిన వంతల సేతు అలియాస్ తిలుసు(25) గాలికొంబ ఏరియా కమిటీ కమాండర్‌గా విధులు నిర్వహించాడు. 2011 నుంచి 2018 వరకు మావోయిస్టు బృందంలో కీలకంగా వ్యవహరించాడు. చింతపల్లికి చెందిన వంతల రామకృష్ణ (35) కోరుకొండ ఏరియా కమిటీ సభ్యుడిగా 2010 నుంచి విధులు నిర్వహించాడు. చింతపల్లికి చెందిన వంతల రవి అలియాస్ పిప్పుడు (30) కోరుకొండ ఏరియా కమిటీ సభ్యుడిగా పనిచేశాడు. 2010 నుంచి 2018 వరకూ వీరు నలుగురు మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొని ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వీరిపై తలా రూ.లక్ష చొప్పున రివార్డు ప్రకటించింది. వీరితో పాటు మిలీషియా సభ్యులైన కొర్రా మల్లన్న (30), పొంగి బాస్కరావు అలియాస్ పులు(35) స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు ఎస్పీ తెలిపారు. వీరిపై ప్రకటించిన రివార్డు మొత్తం వారికే అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని, పునరావాసం కూడా కల్పిస్తామని తెలిపారు. త్వరలో మరికొంతమంది మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని వీరి ద్వారా సమాచారం అందిందని చెప్పారు. మావోయిస్టు కార్యకలపాలపై విసుగుచెంది, ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడం, దళం నుంచి ఎటువంటి సహయం రాకపోవడంతో స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు ఎస్పీ తెలిపారు.



నేటి నుంచి అసెంబ్లీ

- తొలిరోజు గవర్నర్ నరసింహన్ ప్రసంగం
- ఈ సమావేశాలకూ వైసీపీ సభ్యుల దూరం
- పరిసర ప్రాంతాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు

అమరావతి, మార్చి 4 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమవుతుంది. ఇందుకోసం అసెంబ్లీ, రాష్ట్ర పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజు గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. సమావేశాల నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచే అసెంబ్లీ పరిసర ప్రాంతాలు, విజయవాడ, గుంటూరు నగరాల్లో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. వైసీపీ ఈ సారి కూడా బహిష్కరణ బాటనే ఎంచుకుంది. దీంతో సభలో బీజేపీ, టీడీపీ సభ్యులే ఉంటారు. అయితే సభలో పరిస్థితి మాత్రం మునుపటిలా ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు సరిగ్గా లేని కారణంగా ఈ సారి సభ సజావుగా జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఏపీ సర్కార్ వైఫ్యలాలను బీజేపీ సభ్యులు ప్రశ్నించే అవకాశముంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక హోదా, రైల్వే జోన్‌కు సంబంధించి ధర్నాలు, దీక్షలు జరుగుతున్నందున అసెంబ్లీ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు మినహా, అసెంబ్లీకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు.




వేటు వేస్తేనే అసెంబ్లీకి!

- ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతకు వైసీపీ డిమాండ్
- స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు వినతిపత్రం

విజయవాడ, మార్చి 4: ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తేనే వైసీపీ శాసనసభ్యులు అసెంబ్లీకి హాజరవుతారని ఆ పార్టీ మరోసారి స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ఫిరాయించిన 22 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీరు మాట్లాడుతూ.. తమ పార్టీ నుంచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని డిమాండ్ చేశారు. వారిపై వేటు వేస్తే ఈ నెల 5 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే, టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. చింతమనేనికి కోర్టు రెండేళ్లకుపైగా జైలు శిక్ష విధించినందున ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరు అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా పేర్కొంటూ స్పీకర్ నోటిఫై చేయాలన్నారు. దీనిపై గతంలో స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పీకర్ వ్యవహరించాలని కోరామన్నారు. కాగా, ఈ నెల 21న కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని పునరుద్ఘాటించారు. ముందుగా ప్రకటించినట్టుగానే ఏప్రిల్ 6న తమ పార్టీ ఎంపీలు రాజీనామా చేస్తారని చెప్పారు.

ప్రతి పేదకు ఇల్లు

- సీఎం లక్ష్యం అదే: మంత్రి నారాయణ



విశాఖపట్నం, మార్చి 4 (మనం న్యూస్ బ్యూరో): ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని, దానిని తమ ప్రభుత్వం సాకారం చేస్తుందని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ఆదివారం ఆయన విశాఖ జిల్లా అనకాపల్లి వద్ద నిర్మిస్తున్న పేదల గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖ నగరంలో పేదల కోసం మొత్తం 77,549 ఇళ్లు మంజూరు చేశామన్నారు. అనకాపల్లిలో సత్యనారాయణపురం వద్ద 2520 ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. 15 నెలల్లో ఇళ్లను లబ్ధిదారులకు అందించబోతున్నామని, ఇది భారతదేశంలోనే ఒక రికార్డుగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ధనవంతుల ఇళ్లలో ఉండే అత్యున్నత ప్రమాణాలు, అన్ని సౌకర్యాలతో పేదల ఇళ్లు నిర్మిస్తున్నామని, భూకంపాలను కూడా తట్టుకునే సామర్థ్యం ఉండేలా ఆధుని టెక్నాలజీ వినియోగిస్తున్నామని వివరించారు. పదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పేరుతో 4500 కోట్లు దుర్వినియోగం చేసిందని మంత్రి నారాయణ ఆరోపించారు. తమ ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో ఇళ్ల నిర్మాణంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు.

ఏపీలో నిరసనల హోరు

- కేంద్రం అన్యాయంపై ఆందోళనలు
- విజయవాడలో 'మార్చ్ ఫర్ ఏపీ'
- కదం తొక్కిన యువత, పార్టీలు
- నిరసనలో పాల్గొన్న టీడీపీ నేతలు



అమరావతి, మార్చి 4 (మనం ప్రతినిధి): ఆంధ్ర రాష్ట్రం నిరసనల హోరుతో దద్దరిల్లుతోంది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమ స్ఫూర్తితో కదం తొక్కుతున్నాయి. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలంటూ కొద్ది రోజులుగా చేపడుతున్న నిరసనలను ఇప్పుడు తారస్థాయికి చేరాయి. ఈ నిరసనల్లో అధికార పార్టీ కూడా ప్రత్యక్షంగా పాల్గొనేందుకు సిద్ధమవడంతో రాష్ట్రంలో వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. మిత్రపక్షంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, చట్టపరంగా రావాల్సిన హక్కులు, నిధులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని టీడీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో టీడీపీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీకి జరుగుతున్న ద్రోహానికి నిరసనగా ఆదివారం విజయవాడలో భారీ ఎత్తున చేపట్టిన నిరసన ప్రదర్శనలో టీడీపీ నేతలు తమ గళం విప్పారు. 'మార్చ్ ఫర్ ఏపీ' పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీలో వేలాది మంది విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులతో పాటు టీడీపీకి చెందిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్, శాప్ ఛైర్మన పీఆర్ మోహన్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్లకార్డులు చేతపట్టి.. ఏపీకి ద్రోహం చేయొద్దంటూ నినదించారు. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు. నాలుగు బడ్జెట్లోనూ ఏపీకి తీవ్ర నిరాశే మిగిలిందని చెప్పారు. ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టు, కేంద్ర విద్యాసంస్థలు, రహదారులు, రాజధాని అభివృద్ధి ఇలా అన్నింటా అన్యాయమే జరిగిందని వారు వాపోయారు. కేంద్ర రాష్ట్రానికి న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని వెల్లడించారు.

మన్యం బంద్ ప్రశాంతం

- గిరిజన జేఏసీ నిరసన
- పర్యాటక ప్రాంతాల మూసివేత

విశాఖపట్నం, మార్చి 4 (మనం న్యూస్ బ్యూరో): బోయ, వాల్మీకులు, మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చొద్దంటూ గిరిజన జేఏసీ చేపట్టిన మన్యం బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆందోళనలో భాగంగా అరకు లోయలో పర్యాటక ప్రదేశాలు, షాపులు స్వచ్ఛందంగా మూసేశారు. అలాగే విశాఖ చింతపల్లిలో సీపీఎం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతగిరి, బొర్రా గుహల వద్ద ఆందోళనల నేపథ్యంలో ఆయా పర్యాటక కేంద్రాల సందర్శనను తాత్కాలికంగా నిలిపేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏజెన్సీలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. కాగా, ఈ బంద్‌కు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు అజశర్మ, యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి మద్దతు తెలిపారు.

పులివెందులలో ఉద్రిక్తత

- టీడీపీ.. వైఎస్ఆర్‌సీపీ పరస్పర సవాళ్లు
- ఇరు వర్గాల రాళ్లదాడి.. ఎస్ఐకి గాయాలు
- పులివెందుల అభివృద్ధిపై పోటాపోటీ వాదన
- బహిరంగ చర్చకు రావాలని నేతల పిలుపు
- ఉద్రిక్తతలతో నగరంలో 144 సెక్షన్ విధింపు
- వైఎస్ఆర్‌సీపీ.. టీడీపీ నేతల గృహ నిర్బంధం


అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు


పులివెందులలో రాళ్ల దాడితో ఉద్రిక్త పరిస్థితి

కడప/పులివెందుల, మార్చి 4 (మనం న్యూస్ బ్యూరో): రాజకీయంగా అత్యంత సున్నితమైన పులివెందులలో ఆదివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. వైఎస్ఆర్‌సీపీ.. టీడీపీ కార్యర్తల మధ్య రాళ్లదాడి జరగ్గా, దాన్ని అడ్డుకోడానికి వెళ్లిన పోలీసులకూ గాయాలయ్యాయి. పులివెందుల పూల అంగళ్ల సర్కిల్‌లో తొలుత తోపులాటతో మొదలై.. తర్వాత అది రాళ్ల దాడి వరకు వెళ్లింది. ఈ దాడిలో గాయపడిన ఎస్ఐ చిరంజీవిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ముందు జాగ్రత్త చర్యగా నగరంలో 144 సెక్షన్ విధించారు. పులివెందుల అభివృద్ధి గురించి రెండు పార్టీలకు చెందిన నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకున్నారు. ఆదివారం సాయంత్రం బహిరంగ చర్చకు రావాలని సవాలు చేసుకున్నారు. ఈ చర్చకు ఇతర నియోజకవర్గాల నుంచి కూడా వైఎస్ఆర్‌సీపీ.. టీడీపీ కార్యకర్తలు, నేతలు భారీ సంఖ్యలో తరలి వస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా సరిహద్దులలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి.. బయటివారిని పట్టణంలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. పులివెందులలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు ఐపీఎస్ అధికారులు, నలుగురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలతో పాటు ఎస్ఐలు, ఏఎస్ఐలు, స్పెషల్‌పార్టీ పోలీసులను పులివెందులలో మోహరించారు. టీడీపీ, వైసీపీ కార్యాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు పార్టీ కార్యకర్తలను కట్టడి చేసేందుకు ప్రయత్నించినా మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో పూల అంగళ్ల వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఇరు వర్గాల వారు రాళ్ల దాడి చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్పీ బాబూజీ అట్టాడ పులివెందులకు చేరుకుని సమీక్షించారు. పోలీసులు లాఠీచార్జి చేసి ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపు చేయడానికి 6 మార్లు బాష్పవాయువును ప్రయోగించారు. అంతకుముందు పోలీసులు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి సతీష్ కుమార్, ఇతర నేతలతో చర్చించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. ముందుజాగ్రత్తగా నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. ప్రస్తుతం పులివెందులో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియక స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

కుంటిసాకులు వద్దు: అవినాష్ రెడ్డి

బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, ప్రజలకు పులివెందుల అభివృద్ధి విషయంలో వాస్తవాలు తెలియాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. పులివెందులకు దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ఏం చేశారో చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, టీడీపీ నేతలు కుంటిసాకులు చెప్ప కుండా తామేం చేశారో చెప్పడానికి చర్చకు రావాలని ఆయన తెలిపారు. ఫలప్రదమైన చర్చ జరగాలనే తాను కోరుకుంటున్నట్లు అవినాష్ రెడ్డి చెప్పారు.



ఆధార్‌కు లింకయిన బ్యాంకు ఖాతాలు 87 కోట్లు

న్యూఢిల్లీ: ఇప్పటివరకు 80 శాతం బ్యాంకు ఖాతాలు, 60 శాతం మొబైల్ కనెక్షన్స్ ఆధార్‌తో అనుసంధానమయ్యాయని యూఐడీఏఐ సీనియర్ అధికారి ఆదివారం వెల్లడించారు. లెక్కలో లేని నల్లధనాన్ని వెలికితీసే ఉద్దేశంతో మార్చి 31, 2018 నాటికి ప్రతి బ్యాంకు ఖాతాదారుడు 12 నెంబర్లు కలిగిన ఆధార్ సమర్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉద్దేశంతోనే పాన్‌కార్డును కూడా జతచేయాలని పేర్కొంది. మొబైల్ ఫోన్ వినియోగదారుల గుర్తింపు కోసం ఈ మార్చి 31 కల్లా మొబైల్ నంబర్లను ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందాలంటే కొన్నింటికి ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయడానికి సుప్రీంకోర్టు సైతం సుముఖంగా ఉంది. ఆ దిశలో పాన్ కార్డులకు, మొబైల్ సిమ్ కార్డులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేశారు. ఇప్పుడు బ్యాంకు ఖాతాల విషయంలో పనులు చాలా వేగంగా సాగుతున్నాయి. దేశ వ్యాప్తంగా మొత్తం 109.9 కోట్ల బ్యాంకు ఖాతాలుంటే అందులో 87 కోట్ల ఖాతాలు ఆధార్ సంఖ్యతో అనుసంధానం అయినట్లుగా యూఐడీఏఐ అధికారి చెప్పారు. ఇందులో 58 కోట్ల ఖాతాలకు సంబంధించి వెరిఫికేషన్ పూర్తికాగా మిగిలిన ఖాతాల విషయంలో బ్యాంకులకు పత్రాలు అందగా, వాటిని బ్యాంకు ఖాతా వివరాలతో అధికారులు సరిపోల్చి చూసే ప్రక్రియ సాగుతోందని ఆ అధికారి తెలిపారు.



ఎప్పుడూ డిపాజిట్లేనా!

సిప్ మార్గంలో ఫండ్లలో పెట్టుబడి

దీని ద్వారా ఎంతో ప్రయోజనం





పొదుపునకు వీటిని ప్రయత్నించండి

న్యూఢిల్లీ: మధ్య తరగతి వారికి పొదుపు పథకాలు అంటే మొదటగా గుర్తొచ్చేవి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు. పెద్దగా వడ్డీ లెక్కలు తెలియకపోయినా పొదుపు చేయాలనే ఆలోచన ఉన్నవారికి ఇవి బాగా ఇష్టం ఉంటాయి. ఇంచుమించు ఈ పథకాలను పోలిన మరో పొదుపు పథకమే 'సిప్'. ఇటీవల కాలంలో సిప్ పథకాల్లో పెట్టుబడుల పెట్టేవారి సంఖ్య అన్ని వర్గాల్లోనూ పెరుగుతుంది. రికరింగ్, ఫిక్స్‌డ్ పథకాలకు సమాంతరంగా 'సిప్' పథకాలూ అంతే ఆదరణ పొందుతున్నాయి. అయితే సిప్‌లలో పెట్టుబడి పెట్టడం, అంతకుతగ్గ లాభాలు పొందడం అంత తేలికైన విషయం కాదు. వాటిపై సరైన అవగాహన ఉండాలి. అప్పుడే సిప్‌లతో లాభసాటి అంటున్నారు ఆర్థికనిపుణులు.

అసలు 'సిప్' పథకాలంటే ఏమిటి? వాటిని ఎలా ప్రారంభించాలి?

ప్రాచుర్యంలో ఉన్న పొదుపు పథకాల్లో మాత్రమే ఎక్కువమంది పెట్టుబడి పెడుతుంటారు. కొత్తగా వచ్చే పథకాలు, షేర్ ఆధారిత డిపాజిట్స్ వంటి వాటిల్లోకి తొంగి చూడాలంటే కొంతమంది భయపడతారు. కానీ, సంప్రదాయ పథకాల్లో వచ్చే వడ్డీ కంటే కాస్తంత మెరుగ్గా, పెట్టిన పెట్టుబడికి వచ్చేరాబడులూ వేగవంతం కావాలనే ఆలోచన చేసేవారికి కాస్తంత అనుకూలమైనవి సిప్ పథకాలని చెప్పొచ్చు. అయితే అందుకు తగ్గ అవగాహన కావాలి. ఒకవేళ నష్టం వచ్చినా భరించగలిగే శక్తి ఉండాలి.

సిప్ అంటే?




సిప్ అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. వీటిని ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందిస్తాయి. సిప్ పథకాలన్నీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా అసోసియేషన్ (యాంఫి) నియంత్రణలో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలంటే సిప్ పథకమంటే కొంత రిస్క్ ఉంటుంది. అలాగని పెట్టే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఏమీ ఉండదు. సంప్రదాయ వనరుల్లో కాకుండా కాస్తంత లాభాలు తెచ్చిపెట్టే షేర్లు, బంగారం వంటి పెట్టుబడి సాధనాల్లో ఈ సిప్‌ల ద్వారా ఫండ్ సంస్థలు ఇన్వెస్ట్ చేస్తాయి.

పొదుపు చేయడం ఎలా?!

సిప్‌లలో కూడా నెలకి కొంత చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు. ఆర్‌డీకి, వీటికి ఉన్న తేడా ఏంటంటే.. సిప్‌లలో మనం నెల నెలా కట్టే డబ్బుకి సరిపడా.. ఫండ్ సంస్థలు యూనిట్లు కేటాయిస్తాయి. ఆయా ఫండ్స్ నికర అసెట్ విలువ (ఎన్ఏవీ-నెట్ ఎస్సెట్ వాల్యూ)ను బట్టి మనకు లభించే యూనిట్ల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఆయా షేర్లు, బంగారం రేట్లలో హెచ్చుతగ్గులను బట్టి ఫండ్ నెట్ ఎస్సెట్ వాల్యూ సిప్ విధానంలో ఎన్ఏవీ తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ యూనిట్లు, అలాగే ఎన్ఏవీ ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ యూనిట్లు చేతికి వస్తాయి. అయితే, సిప్‌లలో నిర్దిష్టంగా ఇంత రాబడి వస్తుందని ఉండదు. కొన్ని సందర్భాల్లో లాభాలు తగ్గనూ వచ్చు.

కాలపరిమితి

జాతీయ బ్యాంకులతోపాటు కొన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో సిప్ పథకాలు ప్రారంభించవచ్చు. రోజువారీ చెల్లింపులు మొదలుకొని, వీక్లీ, నెలవారీ, మూడునెలలు, ఏడాది, మూడేళ్ళు, ఐదేళ్ళు కాలపరిమితిన చెల్లింపులు ఉంటాయి. సిప్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బును ప్రధానంగా ఆయా కంపెనీలు షేర్ మార్కెట్, బంగారం కొనుగోలు వంటి ఇతర లాభసాటి రంగాల్లో యూనిట్లుగా పెట్టుబడి పెట్టడం.. ఈ కారణంగా వాటిపై వచ్చే రాబడి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్స్ కంటే మెరుగ్గా ఉండే అవకాశం ఉంది. ఫిక్స్‌డ్, రికరింగ్ సేవింగ్స్ కంటే ఎక్కువ అంటే సాలీనా 9 శాతం కంటే 12 నుంచి 15 శాతం వరకూ గ్యారంటీగా లాభాలు రావొచ్చు. ఒక్కొక్కసారి ఇంతకంటే ఊహించని లాభాలు పెరగొచ్చు. అలాగే షేర్‌మార్కెట్, బంగారం, డాలర్ ధరలు పడిపోతే కనీస రాబడి ఉండకపోవచ్చు. అందుకు సిద్ధపడాలి. యూనిట్లు మెరుగ్గా ఉన్నప్పుడు లాభసాటిగా అమ్ముకోవచ్చు.



మ్యూచువల్ ఫండ్స్

షియోమీ 'ఎంఐ మిక్స్ 2ఎస్' స్మార్ట్‌ఫోన్..!

న్యూఢిల్లీ: అత్యంత ప్రజాదారణ పొందిన మొబైల్స్ తయారీ సంస్థ 'షియోమీ' తన నూతన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ 'ఎంఐ మిక్స్ 2ఎస్'ను త్వరలో విడుదల చేయనుంది. ఇందులో ఐఫోన్ 10 తరహాలో 'ఎడ్జ్ టు ఎడ్జ్ డిస్‌ప్లే' ఫీచర్ ఉంది. ఇంకా ఈ ఫోన్‌లో... అధునాతన స్నాప్‌డ్రాగన్ 845 ప్రాసెసర్, 8 జీబీ ర్యామ్, 4కె వీడియోలను తీసే కెమెరాలు తదితర పవర్‌ఫుల్ ఫీచర్‌లను పొందుపరిచారు. దీని ధర వివరాలను షియోమీ ఇంకా వెల్లడించలేదు. గతంలో 'ఎంఐ మిక్స్ 2' విడుదల చేసిన సంగతి తెలిసిందే. 6 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్‌తో విడుదల చేసిన ఈ ఫోన్ ధర రూ.32,999గా ఉంది.



షియోమీ ఎంఐ మిక్స్ 2ఎస్ ఫీచర్లు...

5.99 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 1080-2160 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్, 2.8 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 845 ప్రాసెసర్, 8 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, డ్యూయల్ సిమ్, 12 మెగాపిక్సెల్ బ్యాక్ కెమెరా, 5 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జీ వీవోఎల్‌టీఈ, 3400 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్.

2018లో భారతదేశపు 10 బెస్ట్ ఎయిర్‌లైన్స్

ముంబై: ప్రయాణ సాధానాలలో కెల్లా విమానం చాలా గొప్పది. సుదూర తీర ప్రయాణాలను కొన్ని గంటల్లోనే పూర్తి చేస్తుంది. విమానయాన సేవలకు డిమాండ్ అధికమయ్యేసరికి ఎన్నో ఎయిర్‌లైన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

టాప్-10 బెస్ట్ ఎయిర్‌లైన్స్



ఇండిగో

చౌక విమానయాన సంస్థలలో ఒకటిగా పేరుగాంచిన సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్. గుర్గావ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థను 2006 లో స్థాపించారు. ప్రస్తుతం ఈ సంస్థ 97 విమానాలను దాదాపుగా 38 దేశీయ మరియు ఐదు అంతర్జాతీయ గమ్యస్థానాలకు ప్రయాణికులను చేరవేస్తోంది. ఇండిగో సంస్థ రోజుకు 633 విమాన సర్వీసులు అందిస్తోంది. ఈ సంస్థ విమానాలలో ప్రయాణించిన ప్రయాణికుల అభిప్రాయం ప్రకారం ఇది మొదటి స్థానంలో ఉంది.

స్పైస్‌జెట్



రెండవ స్థానంలో ఉన్న సంస్థ స్పైస్‌జెట్ దీనిని మే 18, 2005 లో ప్రారంభించారు. ఇది చెన్నై అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ 34 విమానాలతో 41 గమ్యస్థానాలకు సేవలు అందిస్తోంది. స్పైస్‌జెట్ రోజుకు 270 విమాన సర్వీసులు అందిస్తోంది.



జెట్ ఎయిర్‌వేస్

జెట్ ఎయిర్‌వేస్ సంస్థ స్థాపించబడి చాలా సంవత్సరాలే అయినప్పటికీ, టాప్-10 జాబితాలో మూడవ స్థానంలో నిలిచింది. జెట్ ఎయిర్‌వేస్ విమానయాన సంస్థ మే 5, 1993 నుండి సర్వీసులను ప్రారంభించింది. ప్రస్తుతం ఇది ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కేంద్రంగా సేవలందిస్తోంది. ఇది దాదాపుగా 300 విమానాలతో ప్రపంచ వ్యాప్తంగా గల 74 గమ్యస్థానాల సర్వీసులు అందిస్తోంది.

ఎయిర్ ఇండియా

అక్టోబర్ 15, 1930 లో టాటా ఎయిర్‌లైన్స్‌గా స్థాపించబడిన ఈ సంస్థ కాలక్రమంలో ఎయిర్ ఇండియాగా రూపాంతరం



చెందింది. ప్రస్తుతం ఇది 107 విమానాలతో దాదాపుగా 85 గమ్యస్థానాలకు సేవలు అందిస్తోంది. ఆర్థిక సమస్యలు మరియు ఉద్యోగుల ఇబ్బందుల కారణంగా నాలుగవ స్థానానికే పరిమితమైంది.

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్



మే 2004 లో స్థాపించబడి ఏప్రిల్ 29 2005 నుండి సేవలు ప్రారంభించిన సంస్థ అనతి కాలంలోనే ప్రసిద్దిగాంచింది. ఇది ప్రస్తుతం కేరళలోని కాలికట్ కేంద్రంగా పని చేస్తోంది. ఎయిర్‌లైన్స్ ఎయిర్ ఇండియా భాగస్వామ్యంతో నడుస్తున్న లో-కాస్ట్ ఎయిర్‌లైన్స్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. ఇది ఒక వారానికి దాదాపుగా 175 విమానాలను నడుపుతోంది.



గో ఎయిర్

ముంబై కేంద్రంగా పనిచేస్తున్న మరొక చౌక విమానయాన సంస్థ గోఎయిర్. దీనిని 2005లో స్థాపించారు. ప్రస్తుతం ఇది 140 విమానాలతో 22 నగరాలకు సేవలను అందిస్తోంది. వారానికి 975 విమాన సర్వీసులు ఉన్నాయి.

జెట్ కనెక్ట్



1991లో సహారా ఎయిర్‌లైన్స్ పేరుతో స్థాపించబడిన సంస్థ ఇప్పుడు జెట్ కనెక్ట్‌గా సేవలు అందిస్తోంది. ఇది కూడా చౌక విమాయాన సేవలు అందిస్తున్న వాటి సరసన చేరిపోయింది. జెట్ కనెక్ట్ ఎయిర్‌లైన్స్ ఇందిరా గాంధి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఇది తొమ్మిది విమానాల ద్వారా 43 గమ్యస్థానాలకు సేవలందిస్తోంది.

ఎయిర్ ఏసియా



''ఎవరివన్ కెన్ ఫ్లైయ్'' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఎయిర్ ఏసియా పేరుకు తగ్గట్లుగానే చౌక విమానయాన సంస్థ ప్రసిద్ధి చెందింది. ఏయిర్ ఏసియా బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఐదు విమానాల ద్వారా 10 నగరాలకు సర్వీసులను అందిస్తోంది.



విస్తారా ఎయిర్‌లైన్స్

టాటా గ్రూపు మరియు సింగపూర్ ఎయిర్ లైన్స్ వారి ఉమ్మడి భాగస్వామ్యంతో నెల కొల్పిన ఈ సంస్థ జనవరి 9, 2015 నుండి అందు బాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఇది ఆరు ఎ320-232 ఎయిర్‌బస్ విమానాల ద్వారా సేవలు అందిస్తోంది.

ఎయిర్ కోస్తా



టాప్-10 లో స్థానం దక్కించుకున్న ఈ ఎయిర్ కోస్తా తెలుగువారు స్థాపించినది. ఇది ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. దీనిని అక్టోబర్ 5, 2013 న ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగు విమానాల ద్వారా 9 నగరాలకు సేవలు అందిస్తోంది.

రెనో డస్టర్ మీద లక్ష రూపాయల తగ్గింపు

న్యూఢిల్లీ: డస్టర్ ఎస్‌యూవీ అంటే ఇష్టం ఉన్నప్పటికీ ధర భారం కారణంగా ఎంచుకోలేకపోయిన వారికి గుడ్ న్యూస్. భారతదేశపు మోస్ట్ పాపులర్ కాంపాక్ట్ ఎస్‌యూవీ రెనో డస్టర్ ధరలు భారీగా దిగివచ్చాయి. 2018 రెనో డస్టర్ మీద ఏకంగా లక్ష రుపాయలు తగ్గింది.


రెనో డస్టర్‌ను చాలా వరకు ప్రాంతీయంగా తయారు చేయడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గాయి. ఇందుకు అనుగుణంగా డస్టర్ మొత్త ధరలను సమీక్షించి సవరించిన అనంతరం కొత్త ధరలను వెల్లడించింది.


ధరల తగ్గింపు అనంతరం, కొత్త ధరల ప్రకారం రెనో డస్టర్ ప్రారంభ వేరియంట్ ధర రూ. 7.95 లక్షలు, డస్టర్ టాప్ ఎండ్ డీజల్ వేరియంట్ ధర రూ. 12.79 లక్షలు ఎక్స్-షోరూమ్(ఢిల్లీ)గా ఉన్నాయి.




ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న రెనో విక్రయ కేంద్రాల నుండి ఎంచుకునే డస్టర్ మీద లక్ష రూపాయలు వరకు లాభ పడవచ్చు.

రెనో ఇండియాకు డస్టర్ అతి ముఖ్యమైన మోడల్. విపణిలోకి విడుదల చేసినప్పటి నుండి రెనో యొక్క బెస్ట్ సెల్లింగ్ మోడల్‌గా నిలిచింది. మార్కెట్లోకి విడుదలయ్యే కొన్ని సంవత్సరాలు కావస్తున్నా... ఇప్పటికీ కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఆధిపత్యం చెలాయిస్తోంది.







మనం ఆరోగ్యం
సోమవారం, 5 మార్చి 2018
www.manamnews.com



అంతులేని అలసట

పని ఎక్కువైనప్పుడో, నిద్ర సరిగా పోనప్పుడో అలసిపోవటం మామూలే. కానీ, ఇలాంటి కారణాలేవీ లేకుండా అదేపనిగా.. రోజూ అలసట ముంచుకొస్తుంటే మాత్రం తప్పకుండా అనుమానించాల్సిందే. థైరాయిడ్ పనితీరు అస్తవ్యస్తం కావటం కూడా తీవ్రమైన అలసటకు దారితీయొచ్చు. సీతాకోకచిలుక ఆకారంలో గొంతుకు పట్టుకొని ఉండే థైరాయిడ్ గ్రంథి ఉత్పత్తి చేసే హార్మోన్లు మనకు ఎంతగానో తోడ్పడతాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను, గుండె వేగాన్ని నియంత్రించటం దగ్గరనుంచి తిన్న ఆహారాన్ని శక్తిగా మార్చే జీవక్రియలో పాలు పంచుకోవటం వరకూ పలురకాల పనులకు దోహదం చేస్తాయి. అందువల్ల థైరాయిడ్ పనితీరు అస్తవ్యస్తమైతే అవయవాలకు తగినంత శక్తి అందక చతికిల పడిపోతాయి. దీంతో పెద్ద పెద్ద పనులు అటుంచి.. రోజువారీ పనులు చేసుకోవటమే కష్టంగా మారిపోతుంది. థైరాయిడ్ సమస్యలు మధ్యవయసు మహిళల్లో ఎక్కువ. చాలావరకు మన రోగనిరోధకశక్తి పొరపాటున థైరాయిడ్ మీదే దాడి చేయటం వల్ల ఇలాంటి సమస్యలు ముంచుకొస్తాయి. దీంతో థైరాయిడ్ గ్రంథి నుంచి హార్మోన్ల ఉత్పత్తి తగ్గిపోవచ్చు (హైపోథైరాయిడిజమ్). దీంతో తీవ్రమైన అలసటతో పాటు బరువు పెరగటం, జుట్టు వూడటం వంటివీ మొద లవుతాయి. ఇక థైరాయిడ్ గ్రంథి చురుకుగా పనిచేస్తే హార్మోన్ల ఉత్పత్తి అవసరమైన దాని కన్నా ఎక్కువ వుతుంది (హైపర్ థైరాయిడిజమ్). ఇది గుండె దడ, ఆందోళన మాత్రమే కాదు నిస్సత్తువకూ దోహదం చేయొచ్చు. దీంతో ఏ పని చేయాలన్నా ఒంట్లో శక్తి లేదనే అనిపిస్తుంటుంది. సమస్యలు తీవ్రమైతే ఇంట్లో రోజువారీ పనులు చేసుకోవటమూ ఇబ్బందిగా పరిణమిస్తుంది. అలసట నిద్ర పోయినా కూడా తొలగకపోవటం గమనార్హం.

పాదాలు పదిలమా?



మన శరీర బరువును మోస్తాయి. ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్తాయి. మనం నడక నేర్చినప్పటి నుంచీ నిరంతరం శ్రమిస్తూనే ఉంటాయి. అయినా ఇతర అవయవాల మాదిరిగా పాదాల ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకోం. చూసీ చూడనట్టు వదిలేస్తుంటాం. బిగుతుగా ఉన్నా చెప్పులు, షూ ధరిస్తుంటాం. ఇలాంటివన్నీ పాదాలపై తీవ్రమైన ఒత్తిడి కలగజేస్తాయి. ఏళ్లకేళ్లుగా శ్రమిస్తుండటం వల్ల పాదాలకు రక్త సరఫరా తగ్గటం వంటి జబ్బులూ దాడిచేయొచ్చు. అందువల్ల పాదాలను జాగ్రత్తగా కాపాడుకోవటం ఎంతో అవసరం. వ్యాయామం చేయటం ద్వారా.. ముఖ్యంగా నడకతో పాదాలకు రక్తసరఫరా బాగా మెరుగుపడుతుంది. కుర్చీలో కూచొని మడమలను అటూ ఇటూ గుండ్రంగా తిప్పటం వంటి తేలికైన వ్యాయామాలూ ఎంతో మేలు చేస్తాయి. పాదాల సమస్యలు కొన్నిసార్లు మధుమేహం, కీళ్లవాపు, నాడీ సమస్యల వంటి తీవ్ర జబ్బులకూ తొలి సంకేతం కావచ్చు. వీటిని ముందుగానే గుర్తిస్తే తీవ్రమైన సమస్యల బారినపడకుండా కాపాడుకోవచ్చు. కాబట్టి పాదాలను ఓ కంటి కనిపెట్టటం మంచిది. ఎక్కడైనా గీసుకుపోవటం, బొబ్బలు, గోళ్లు లోపలి వైపునకు పెరగటం వంటివి ఉన్నాయేమో గమనిస్తుండాలి. పాదాల్లో తీవ్రమైన నొప్పి, మొద్దుబారటం వంటివి కనిపిస్తే తాత్సారం చేయకుండా డాక్టర్‌ను కలవాలి.



భోజనం చేయకుండా కొద్దిరోజులు జీవించొచ్చు. నీళ్లు తాగకుండా కొన్ని గంటలు గడపొచ్చు. కానీ శ్వాస తీసుకోకుండా ఒక్క క్షణమైనా నిలవలేం. మన ప్రాణాలు నిలబడటానికి అత్యవసరమైన ఆక్సిజన్ అందటం నిమిషం ఆలస్యమైనా ఉక్కిరిబిక్కిరైపోతాం. కాబట్టే ఊపిరితిత్తులకు అంతటి ప్రాధాన్యం. ఇవి ప్రకృతి నుంచి లభించే ఆక్సిజన్‌ను శ్వాస ద్వారా లోపలికి తీసుకుంటూ.. దాన్ని రక్తం ద్వారా అన్ని కణాలకు సరఫరా అయ్యేలా చేస్తూ.. అవసరం లేని కార్బన్ డయాక్సైడ్‌ను బయటికి పంపిస్తూ.. మన జీవం, జీవితం సజావుగా సాగటానికి నిరంతరం అలుపెరగకుండా పనిచేస్తుంటాయి. ఇలాంటి ఊపిరితిత్తుల్లో ఏ చిన్న సమస్య తలెత్తినా ఇబ్బందే. అలాంటిది అనుక్షణం శరీరాన్ని కబళిస్తూ.. అహరహం నిర్వీర్యం చేసే కేన్సర్ ముంచుకొస్తే? పచ్చగా కళకళలాడే చెట్టుకు చీడ సోకితే వాడిపోయినట్టుగానే.. మనకు ఊపిరిని అందించే తిత్తులూ వాడి పోవటం మొదలెడతాయి. ఊపిరితిత్తుల కేన్సర్ ఎందుకొస్తుందో కచ్చితంగా తెలియదు. ఎవరికి వస్తుందో తెలియదు. కానీ రావటానికి దోహదం చేసే కొన్ని కారణాలను మాత్రం మనం తప్పకుండా నిలువరించుకోవచ్చు. అందుకే దీనిపై వివరాలు మీ కోసం...

లంగ్ కేన్సర్


మన ప్రాణానికి, జీవానికి శ్వాస అత్యంత కీలకం. గుండె కొట్టుకోవటం వంటి ఇతర ప్రక్రియలు సజావుగా జరుగుతున్నా.. శ్వాస సరిగా సాగకపోతే శరీరం వెంటనే కుప్పకూలుతుంది. తగినంత ఆక్సిజన్ అందక కణాలన్నీ చేతులెత్తేస్తాయి. కాబట్టే ఊపిరితిత్తులకు ఎలాంటి సమస్య వచ్చినా భరించటం కష్టం. ఇక క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యలు ముంచుకొస్తే జీవితం మరింత నరకప్రాయంగా మారుతుంది. మనదేశంలో అతి ఎక్కువగా కనబడే ఐదు



రకాల కేన్సర్లలో ఊపిరితిత్తుల కేన్సర్ ఒకటి. ఒకప్పుడు పురుషుల్లో నోటి కేన్సర్, గొంతు కేన్సర్, జీర్ణాశయ కేన్సర్లు ఎక్కువగా కనబడుతుండేవి. ఇప్పుడు ఊపిరితిత్తుల కేన్సర్ వీటన్నింటినీ అధిగమించి ప్రథమ స్థానాన్ని ఆక్రమించేసింది. స్త్రీలు, పురుషులు.. ఇద్దరినీ పరిగణనలోకి తీసుకుంటే రొమ్ము కేన్సర్ తర్వాత రెండో స్థానం కూడా దీనిదే కావటం గమనార్హం. మనదేశంలో కొత్తగా బయటపడుతున్న కేన్సర్ కేసుల్లో 6.9% కేసులు వూపిరితిత్తుల క్యాన్సర్‌కు సంబంధించినవే. కేన్సర్ల మూలంగా చనిపోతున్న వారిలో 9.3% మంది ఊపిరితిత్తుల కేన్సర్ బాధితులే. అయినా కూడా మన సమాజంలో దీనిపై చాలామందికి అవగాహన ఉండటం లేదు. దీనిలోనూ క్షయ మాదిరి లక్షణాలు కనబడుతుండటం పొరబడటానికి దారితీస్తోంది. క్షయకు చికిత్స తీసుకుంటున్నా కూడా లక్షణాలు తగ్గుముఖం పట్టకపోయిన సందర్భాల్లోనూ కేన్సర్‌ను అనుమానించటం లేదు. అలాగే విచ్చలవిడిగా పెరిగిపోతున్న పొగాకు అలవాట్లు, వాయు కాలుష్యం వంటివీ ఊపిరితిత్తుల కేన్సర్‌కు ఆజ్యం పోస్తున్నాయి.

ఏమిటీ కేన్సర్?

మన ఒంట్లో కణాలన్నీ కూడా ఒక క్రమ పద్ధతి ప్రకారం విభజన చెందుతూ.. వృద్ధి చెందుతుంటాయి. ఈ ప్రక్రియను జన్యువులు నియంత్రిస్తుంటాయి. కణ విభజన అవసరం లేదని అనిపించినప్పుడు కణంలోని లేదా పక్కనున్న కణంలోని సంకేత వ్యవస్థ 'ఇక చాలు' అని చెబుతుంది. దీని మూలంగానే మన శరీరంలో ఎదుగుదల ఒక క్రమంలో, కట్టుదిట్టంగా సాగుతుంది. ఎందుకో తెలియదు గానీ కొన్నిసార్లు ఈ నియంత్రణ ప్రక్రియ అస్తవ్యస్తమవుతుంటుంది. ఫలితంగా అవసరం లేకపోయినా కణ విభజన జరగొచ్చు. లేదూ కణాలు మరణించకుండా అలా పెరుగుతూనే ఉండొచ్చు. ఇవన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి కేన్సర్ కణితులుగా మారతాయి. ఇవి పెరుగుతున్నకొద్దీ ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుంది. రక్తంలోకి ఆక్సిజన్ సరఫరా కావటం తగ్గుతూ వస్తుంది.



క్షయకు దగ్గరి పోలిక

ఊపిరితిత్తుల కేన్సర్, క్షయ.. రెండింట్లోనూ దగ్గు, ఆయాసం, బరువు, ఆకలి తగ్గటం, జ్వరం వంటి లక్షణాలు కనబడుతుంటాయి. దీంతో వీటి మధ్య తేడాను గుర్తించటం చాలా కష్టమవుతోంది. ఊపిరితిత్తుల కేన్సర్ చికిత్స కోసం వచ్చేవారిలో క్షయ చికిత్స తీసుకొని, ఇంకా దగ్గు తగ్గలేదని వచ్చేవారు దాదాపు 15-50% మంది కనబడుతుంటారు. అప్పటికే వీరిలో కేన్సర్ ముదిరిపోయి ఉంటుంది. అందువల్ల వీలైనంత త్వరగా వీటి మధ్య తేడాను గుర్తించటం చాలా అవసరం. సాధారణంగా క్షయ చికిత్స ఆరంభించిన మూడు, నాలుగు వారాల్లో లక్షణాలు తగ్గుముఖం పట్టాలి. ఆరోగ్యమూ కాస్త మెరుగవ్వాలి. లేకపోతే వెంటనే అప్రమత్తం కావాలి. ఎక్స్‌రే, సీటీస్కాన్.. అవసరమైతే బయాప్సీ చేసి వూపిరితిత్తుల కేన్సర్ ఉందేమో చూడాలి.

ఆలస్యమే.. పెద్ద సమస్య

ఊపిరితిత్తుల కేన్సర్‌తో పెద్ద చిక్కటేంటంటే చాలా ఆలస్యంగా బయటపడుతుండటం. ఊపిరితిత్తి పెద్ద అవయం. దీనిలో కణితి తలెత్తినా కూడా.. అది కీలకమైన భాగాలకు తగిలేంత వరకూ ఎలాంటి లక్షణాలు కనబడవు. అందువల్ల ఊపిరితిత్తుల కేన్సర్ బయటపడేసరికే ముదిరిపోయి ఉంటోంది.



పొగ తాగకపోతే రాదనుకోవద్దు..

పొగ తాగే అలవాటు లేనంత మాత్రాన ఊపిరితిత్తుల కేన్సర్ రాదని అనుకోవటానికి లేదు. నిజానికి ఊపిరితిత్తుల కేన్సర్ బాధితుల్లో పొగ అలవాటు గలవారు 30 శాతమే. మిగతా 70% మంది పొగ అలవాటు లేనివారే. అలాగని దీన్ని తప్పుగా అర్థం చేసుకోవటానికీ లేదు. మన సమాజంలో పొగ తాగే వారికన్నా తాగని వారే ఎక్కువ. అందువల్ల ఊపిరితిత్తుల కేన్సర్ బాధితుల్లోనూ పొగతాగని వారి సంఖ్యే ఎక్కువ. అయితే పొగ అలవాటు లేనివారితో పోలిస్తే.. పొగ తాగే అలవాటున్న వారిలోనే ఎక్కువ శాతం మంది ఊపిరితిత్తుల కేన్సర్ బాధితులు కనబడుతుంటారు.

జీవనకాలం మెరుగు

టార్గెటెడ్, ఇమ్యూనోథెరపీలు ఆయా రకాలకు, వ్యక్తులకు అనుగుణంగా చికిత్స చేయటానికి బాగా తోడ్పడతాయి. వీటి ద్వారా 60% రోగులకు కీమోథెరపీని తప్పించే అవకాశముంది.

లక్షణాలేంటి?

ఊపిరితిత్తులకు మాత్రమే పరిమితమైన కణితులు, ఇతర భాగాలకు విస్తరించిన కణితులను బట్టి వేర్వేరు లక్షణాలు కనబడుతుంటాయి.

- విడవకుండా దగ్గు
- శ్వాసతీసుకోవటంలో ఇబ్బంది
- కళ్లెలో రక్తం పడటం
- బరువు తగ్గటం
- ఆకలి తగ్గిపోవటం
- గొంతు బొంగురు పోవటం
- ముద్ద మింగటంలో ఇబ్బంది
- ఆయాసం
- బ్రాంకైటిస్, న్యుమోనియా
- జ్వరం
- నిస్సత్తువ
- కామెర్లు
- తలనొప్పి, వాంతి
- నాడీ సమస్యలు



ఇతరత్రా జబ్బుల్లో చేసే పరీక్షల్లో యాదృచ్ఛికంగా బయటపడటం తప్పించి.. తొలి దశలో ఊపిరితిత్తుల కేన్సర్‌ను గుర్తించటం చాలా అరుదు. సుమారు 70-80% మందిలో ఇది మూడు, నాలుగు దశల్లోనే బయటపడుతోంది. దీన్ని ఒకటో దశలోనే గుర్తించి శస్త్రచికిత్స చేయగలిగితే 90% వరకు నయం చేయొచ్చు. రెండో దశలో 70% వరకు నయం కావొచ్చు. అదే మూడో దశలో నయమయ్యే అవకాశం 30 శాతానికి పడిపోతుంది. ఇక నాలుగో దశలోనైతే నయం కావటం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవాలి.



నివారణ కీలకం

ఊపిరితిత్తుల కేన్సర్‌ను తొలిదశలో గుర్తించటం కష్టం. అందుకే అమెరికా వంటి దేశాల్లో ఊపిరితిత్తుల కేన్సర్‌కు ముందస్తు పరీక్షలు చేస్తున్నారు. 55 ఏళ్లు పైబడి.. 20 ఏళ్లకు పైగా పొగ తాగే అలవాటున్నవారికి ఏడాదికి ఒకసారి తక్కువ మోతాదు సీటీస్కాన్ పరీక్ష చేస్తున్నారు. కానీ మనదేశంలో ఇదంత సులువైన పని కాదు. అందువల్ల నివారణ మీదే దృష్టి పెట్టటం చాలా అవసరం. కేన్సర్‌కు దారితీసే పొగాకు జోలికి వెళ్లకపోవటం అన్నింటికన్నా మంచిది. ఒకవేళ పొగ తాగటం, పొగాకు నమలటం అలవాటుంటే వెంటనే మానెయ్యాలి. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యం పరిమితం చేసుకోవాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

పీల్చే గాలి పరిశుభ్రంగా ఉండాలి

తినే తిండి, తాగే నీరు మాత్రమే కాదు.. పీల్చే గాలీ పరిశుభ్రంగా ఉండాలి. తిండి తినకుండా కొద్దిరోజులు, నీళ్లు తాగకుండా కొన్ని గంటలు ఉండొచ్చేమోగానీ గాలి పీల్చకుండా నిమిషమైనా నిలబడలేం. ఇంతటి కీలకమైన గాలి స్వచ్ఛంగా లేకపోతే? నైట్రోజెన్ డయాక్సైడ్, నుసి పదార్థం వంటి కాలుష్య కారకాలు ఊపిరితిత్తులోకి చేరిపోతే? పలు శ్వాస సమస్యలు ముంచుకొస్తాయి. మన ఊపిరితిత్తులు, దానిలోని గాలి గొట్టాల పొర చాలా సున్నితంగా ఉంటుంది. దీన్ని యాంటీఆక్సిడెంట్లు నిరంతరం కాపాడుతుంటాయి. సాధారణంగా మనం కలుషితమైన గాలిని పీల్చుకుంటే వెంటనే ఈ యాంటీఆక్సిడెంట్లు రంగంలోకి దిగి కాలుష్య కారకాలతో పోరాడటం మొదలెడతాయి. అయితే కాలుష్య కారకాల స్థాయిలు మితిమీరితే ఇవీ చేతులెత్తేస్తాయి. ఇవి బలహీన పడగానే కాలుష్య కారకాలు విజృంభించి ఊపిరితిత్తులు, గాలిగొట్టాల లోపలి పొరపై దాడిచేస్తాయి. ఫలితంగా పొర ఉబ్బుతుంది. ఇది దీర్ఘకాల బ్రాంకైటిస్, ఎంఫెసీమా, ఆస్థమా, పిల్లికూతలు, దగ్గు, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది వంటి సమస్యలకు దారితీస్తుంది. గుండెజబ్బు, ఊపిరితిత్తుల కేన్సర్‌కూ దారితీయొచ్చు. ప్రస్తుతం మన నగరాల్లో, పట్టణాల్లో గాలి కాలుష్యం ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయికి ఎగబాకింది. ఇలాంటి సమయంలో మనం ఆహార పరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

దశలను బట్టి చికిత్స

ఊపిరితిత్తుల కేన్సర్‌లో ఆయా దశలను బట్టి కీమోథెరపీ, రేడియోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీల్లో ఎవరికి, ఏది పనికొస్తుందనేది నిర్ణయిస్తారు.

1, 2 దశల్లో..

మొదటి, రెండో దశ కణితులకు శస్త్రచికిత్స ఉత్తమమైన పద్ధతి. ఇందులో కణితి ఏర్పడిన భాగాన్ని పూర్తిగా తొలగిస్తారు. అవసరమైతే ఒక భాగాన్ని (లోబ్), ఒక ఊపిరితిత్తి మొత్తాన్ని కూడా తొలగించాల్సి రావొచ్చు. శస్త్రచికిత్సతో కణితిని తొలగించినప్పటికీ.. కంటికి కనిపించని అతి సూక్ష్మమైన కేన్సర్ కణాలు ఛాతీలోనో, మరెక్కడో ఇంకా లోపలే ఉండిపోవచ్చు. ఇవి పెట్ స్కాన్‌లోనూ కనబడనంత చిన్నగానూ ఉండొచ్చు. ఒకవేళ కేన్సర్ కణాలు లోపల మిగిలిపోతే జబ్బు తిరగబెట్టే ప్రమాదముంది. అందువల్ల బయటకు తీసిన కణితిని పరిశీలించి.. జబ్బు తిరగబెట్టే అవకాశం ఎంత వరకు ఉందనేది అంచనా వేస్తారు.

తిరగబెట్టే అవకాశం ఉంటే కీమో థెరపీ, రేడియో థెరపీ చేయాల్సి ఉంటుంది. కణితిని పూర్తిగా తొలగించటం సాధ్యం కానప్పుడు కొంత భాగం లోపలే వదిలేస్తుంటారు.



3వ దశలో..

వీరికి ఒకే సమయంలో కీమోథెరపీ, రేడియోథెరపీ చేయాల్సి ఉంటుంది. కొందరికి శస్త్రచికిత్స కూడా చేయాల్సి రావొచ్చు. కణితి ఏర్పడిన చోటు, సైజు, లింఫ్ గ్రంథుల ఉబ్బు వంటి వాటిని బట్టి దీన్ని నిర్ణయిస్తారు. అయితే మూడో దశలో చికిత్స చేసినా కేన్సర్ నయమయ్యే అవకాశం 30% మాత్రమే. 70% మందిలో జబ్బు పూర్తిగా తగ్గకపోవచ్చు. ఒకవేళ తగ్గినా మళ్లీ తిరగబెట్టొచ్చు.

4వ దశలో..

నాలుగో దశలో కేన్సర్ నయం కావటం దాదాపు అసాధ్యం. అందువల్ల రోగికి ఇతరత్రా సమస్యలేవీ లేకుండా.. బతికినంతకాలం ఇంట్లో హాయిగా జీవించేలా చూసేందుకే ప్రాధాన్యం ఇస్తారు. ఈ విషయంలో 'టార్గెటెడ్ థెరపీ' బాగా ఉపయోగపడుతుంది. కీమోథెరపీ కేన్సర్ కణాల మీదే కాదు. ఇతర కణాలపైనా ప్రభావం చూపుతుంది.

మనం స్పోర్ట్స్
సోమవారం 5 మార్చి 2018
www.manamnews.com



శ్రీలంక వేదికగా జరిగే టి20 ట్రై సిరీస్‌లో భారత్ ఎన్నడూ లేని విధంగా ప్రయోగాలు చేయనుంది. ఆరుగురు సీనియర్ల స్థానంలో జట్టులో ప్లేస్ సంపాదించిన కొత్త కుర్రాళ్లకు ఈ సిరీస్ అగ్నిపరీక్షగా మారింది. వచ్చే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకని సెలెక్టర్లు పెడుతున్న ఈ పరీక్షలో కుర్రాళ్లు పాసవుతారా.. ఫెయిలవుతారా...

మిషన్ 2019



శ్రీలంక టి20 ట్రై సిరీస్‌లో కుర్రాళ్ల సత్తాకు పరీక్ష



న్యూఢిల్లీ: సౌతాఫ్రికా సిరీస్ అనంతరం భారత క్రికెట్ జట్టు కొలంబోలో జరిగే ముక్కోణపు టి 20 సిరీస్‌లో ఆడుతుంది. గతంలో టూర్ల కంటే భిన్నంగా కొత్త కుర్రాళ్లతో ఈ సిరీస్‌లో భారత్ ప్రయోగాలు చేస్తోంది. వచ్చే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లుఈ ప్రయోగాలు చేస్తున్నారటంలో సందేహం లేదు. ఆరుగురు సీనియర్లకు విశ్రాంతి ఇచ్చిన సెలెక్టర్లు దేశవాళీ టోర్నీల్లో రాణిస్తున్న యంగ్ ప్లేయర్లను ఈ టోర్నీలో ఆడించను న్నారు. భారత జట్టుకు ఎంపికైన యువ ఆటగాళ్లం దరికీ ఇదో కఠిన పరీక్ష. రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు బంగ్లాదేశ్, శ్రీలంకలతో ఈ టోర్నీలో ఆడుతుంది. కేవలం రెండే రెండు టి ట్వంటీలు ఆడిన వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్‌తో పాటు హైదరాబాద పేస్ బౌలర్ సిరాజ్‌లకు ఈ టోర్నీలో అవకాశం కల్పించారు. ఈ టోర్నీలో పంత్ ఎలా ఆడతాడన్నదే ఆసక్తిరేపుతోంది. స్టార్ కీపర్, మాజీ కెప్టెన్ ధోనీ కెరీర్ అయిపోతుందనుకున్న తరుణలో తెరపైకి వచ్చిన పంత్ ఆటతీరుపై విశ్లేషకులు దృష్టిపెట్టారు.

హైదరాబాద్ నుంచి జట్టులో స్థానం సంపాదించిన ఫాస్ట్ బౌలర్ సిరాజ్ గత ఏడాది న్యూజిలాండ్, శ్రీలంకలతో జరిగిన టి ట్వంటీల్లో ఆడినా సత్తా చూపెట్టలేకపోయాడు. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు సిరాజ్‌కు మరో సారి అవకాశం కల్పించటం అదృష్టమను కోవాలి. ఈసారి సిరాజ్ అంచనాలు తప్పకపోతే రెగ్యులర్ టీమ్‌లో ప్లేస్ స్థిరపరచుకోటం ఖాయం.ఇక ముంబాయి యువ పేస్ బౌలర్ శార్ధూల్ ఠాకూర్ ఇది కూడా దాదాపు సిరాజ్ లాంటి పరిస్థితే మూడు వన్డేలు, 1 టి210ల్లో ఆడినా పెద్దగా రాణించలేకపోయాడు. దక్షిణాఫ్రికా టూర్‌లో ఫర్వాలేదనిపించిన ఠాకూర్ ఇప్పుడు లంకలో ఎలా ఆడతాడన్నదే ప్రశ్న. ఈ ఇద్దరు బౌలర్లతో పాటు తమిళనాడు స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ అదృష్టాన్ని సెలెక్టర్లు పరీక్షించనున్నారు. రెగ్యులర్ స్పిన్నర్లు చాహల్, అక్షర్ పటేల్‌లకు ధీటుగా మరో స్పిన్నర్‌ను తయారు చేయాలన్న సెలెక్టర్ల ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో మరి. వీరితో పాటు ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్ పాండ్యా జట్టులో కొనసాగుతున్నా నిరాశ పరిచే ఆటతీరును ప్రదర్శిస్తున్నాడు. దీంతో పాండ్యాకు బదులుగా బరోడా ఆల్ రౌండర్ హుడా, తమిళనాడు ఆటగాడు శంకర్‌లకు చోటు దక్కింది. గతంలో జట్టుకు ఎంపికైనా ఇంకా అరంగేట్రం చేయలలేదు. దీంతో ఈ టి20 సిరీస్ ఈ ఇద్దరు ఆల్‌రౌండర్లకు అగ్నిపరీక్షగా మారింది.

శ్రీలంకకు భారత జట్టు పయనం

శ్రీలంకలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న టి 20 సిరీస్‌లో ఆడేందుకు భారత జట్టు ముంబై నుంచి బయల్దేరింది. సీనియర్లు లేకుండానే బరిలోకి దిగుతున్న భారత్ ఈ టోర్నీలో బంగ్లాదేశ్, శ్రీలంకలతో ఆడుతుంది. బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో భారతజట్టు ఆతిథ్య శ్రీలంకతో ఆడుతుంది. ఒక్కో జట్టు ప్రత్యర్థి జట్టుతో రెండేసి మ్యాచ్‌లు ఆడతాయి. మార్చి 18న ఫైనల్ జరుగుతుంది.

వన్డేలపై గురి : ఉనద్కత్



శ్రీలంకలో జరిగే టి ట్వంటీ సిరీస్‌లో రాణించి వన్డే జట్టులో చోటు దక్కించుకుంటానని ఫాస్ట్‌బౌలర్ ఉనద్కత్ తెలిపాడు. 2016 జింబాబ్వేలో తొలి సారి టి20 మ్యాచ్ ఆడిన ఉనద్కత్ వచ్చే ప్రపంచ కప్‌లో ఆడే భారత జట్టులో చోటు దక్కించుకోవటమే లక్ష్యంగా ఆడుతున్నానని తెలిపాడు. 'టి ట్వంటీ టోర్నీలో ఆడటం మాత్రమే కాదు, ప్రపంచ కప్‌లాంటి పెద్ద టోర్నీల్లో ఆడే భారత జట్టుకు ఎంపిక కావటమే లక్ష్యంగా ఆడుతున్నా' అని జైదేవ్ తెలిపాడు. శ్రీలంకలో జరిగే టి ట్వంటీ సిరీస్ తనకెంతో ఉపయోగపడుతుందని సీనియర్లు భువనేశ్వర్, బుమ్రాలు లేకపోవటంతో భారత పేస్ బౌలింగ్ భారాన్ని మోస్తున్న ఉనద్కత్ సౌతాఫ్రికాతో జరిగిన టి ట్వంటీ సిరీస్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు.

టార్గెట్ నంబర్ 1

ఆల్‌ఇంగ్లండ్, కామన్‌వెల్త్ పోటీలకు రెడీ: సింధు



హైదరాబాద్ : అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చూపెట్టేందుకు సిద్ధమవుతోంది హైదరాబాద్ బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు. ఈనెల 14 నుంచి జరిగే ఆల్‌ఇంగ్లండ్, కామన్‌వెల్త్ క్రీడల కోసం కఠోర సాధన చేస్తోంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో గతంలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం గెలుచుకున సింధు ఈ సారి స్వర్ణంపై గురిపెట్టింది. 'ఆల్‌ఇంగ్లండ్ టోర్నీ, కామన్‌వెల్త్ క్రీడల కోసం ప్రాక్టీస్ చేస్తున్నా' పతకం గెలవటమే లక్ష్యం' అని సిందు తెలిపింది. రియో ఒలింపిక్స్‌లో రజత పతకం గెలచుకుని చరిత్ర సృష్టించిన ఆ తర్వాత పలు అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటింది. ఈ ఏడాది ఆరంభంలో ఆడుతున్న సింధు ఆడుతున్న తొలి అంతరాతీయ టోర్నీ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్ షిప్. 'చాలా అంత ర్జాతీయ టోర్నీలు ఆడాల్సి ఉంది, అత్యుత్తమమైన ఆటను ఆడటమే నా ముందున్న లక్ష్యం' అని సింధు తెలిపింది. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం సాధించటం అంత సులువు కాదని, అనేక దేశాలు పాల్గొంటున్న ఈ పోటీల్లో పతకం సాధించటం కోసం చాలా కష్టపడాలని చెప్పింది. 'ప్రతి మ్యాచ్‌లోనూ వందశాతం ఆటతీరును ప్రదర్శించటమే ముఖ్యం , గెలుపుకోసం చాలా కష్టపడాలి' అని సింధు చెప్పింది. ఏప్రిల్ 14 నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో కామన్‌వెల్త్ క్రీడలు ప్రారంభం కానున్నాయి. మునుముందు ఆడబోయే అంతర్జాతీయ పోటీల కోసం ప్రణాళిక ప్రకారం కోచింగ్ తీసుకుంటున్నాం టున్న సింధు గతవారం కెరీర్‌లోనే అత్యుత్తమంగా వరల్డ్ నంబర్ 2 ర్యాంక్‌ను సొంతం చేసుకుని హాట్ ఫేవరిట్ ప్లేయర్ అయింది. నంబర్ వన్ ర్యాంక్ చేరుకోవటమే లక్ష్యంగా కృషి చేస్తానని చెబుతోంది. ' నంబర్ వన్ ర్యాంక్ చేరుకోవటం నా కల, ఆ లక్ష్యాన్ని చేరుకోవటం కోసం కష్టపడుతున్నా' అని సింధు వివరించింది.

ఆఫ్ఘనిస్థాన్‌కు స్కాట్లాండ్ షాక్

2019 ఐసిసి వరల్డ్ కప్ క్వాలిఫైయింగ్ టోర్నీ

బులవాయో (జింబాబ్వే): ఐసిసి ప్రపంచ కప్ క్వాలిఫైయింగ్ టోర్నీలో స్కాట్లాండ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి ఆఫ్ఘనిస్థాన్‌కు షాకిచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ జట్టు 49.5 ఓవర్లలో 255 రన్స్‌కు ఆలౌట్ అయింది. ఆ తరవాత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 47.2 ఓవర్లో మూడువికెట్లు నష్టపోయి 256 పరుగులు చేసి బోణీ చేసింది. స్కాట్లాండ్ ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయినా మ్యాక్‌లియోడ్ 146 బాల్స్‌లో 23 ఫోర్లు ఓ సిక్స్‌తో 157 రన్స్ చేసి జట్టును విజయపథంలో నడిపించాడు.

చెలరేగిన విహారి

దేవధర్ ట్రోఫీ • ఇండియా 'ఏ'పై ఇండియా 'బి' విజయం

ధర్మశాల: ఆంధ్ర కెప్టెన్ హనుమాన్ విహారీ అద్భుతంగా ఆడి రాణించడంతో దేవధర్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఇండియా బి జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా ఏ జట్టు 41.2 ఓవర్లలో 179 రన్స్ చేసి ఆలౌట్ అయింది. పలు మార్లు వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఇండియా బి జట్టు 26.2 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేసింది. ఈ సమయంలో తిరిగి వర్షం కురవడంతో మ్యాచ్‌ను ఇక్కడే నిలిపేసి డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇండియా బి జట్టును విజేతగా ప్రకటించారు. ఇండియా ఏ జట్టులో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన రిక్కీ భుయి 78 పరుగులు చేసి రాణించాడు.

మళ్లీ రాకాసి బంతి భయం

మెల్‌బోర్న్: మూడేళ్ల క్రితం ప్రపంచ క్రికెట్‌లో జరిగిన విషాదం ఇంకా ఎవరూ మర్చిపోలేదు. 2014లో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన దేశవాళీ పోటీల్లో సీన్ అబాట్ వేసిన బౌన్సర్ తాకి బ్యాట్స్‌మెన్ హ్యూజ్ క్రీజ్‌లోనే కుప్పకూలిపోయాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. అయితే తాజాగా అస్ట్రేలియా దేశవాళీ పోటీల్లో అబాట్ వేసిన బౌన్సర్ తాకి మరో బౌలర్ గాయపడ్డాడు. ఆదివారం షెఫల్ షీల్డ్ టోర్నీలో న్యూసౌత్‌వేల్స్ తరపున ఆడుతున్న అబాట్ వేసిన బంతి విక్టోరి ఆటగాడు పీవుకోవ్‌స్కీ తలకు బలంగా తాకింది. బాల్ తగిలిన వెంటనే పివుకోవ్‌స్కీ కుప్పకూలిపోయాడు. దీంతో ఆటగాళ్లంతా ఒక్కసారిగా ఆందోళన చెందారు. వెంటనే వైద్యుల బృందం పివుకోవ్‌స్కీకి చికిత్స చేసింది. మెల్లగా పివ్‌కోవ్‌స్కీ తేరుకోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పెద్దగా గాయం లేదని స్కానింగ్‌లో తేలడంతో ప్రమాదం తప్పినట్టయింది.





మళ్లీ నిరాశే

ఎనిమిది పెనాల్టీ కార్నర్లు వృథా ఇంగ్లండ్‌తో మ్యాచ్ డ్రా

ఇపో (మలేసియా): అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు రెండో మ్యాచ్‌లోనూ అభిమానులను నిరాశపరిచింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో గెలిచే అవకాశాన్ని చేజార్చుకుని 1-1 గోల్స్‌తో డ్రాగా ముగించింది. అయితే తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా చేతిలో ఓడి అభిమానులను నిరాశలో ముంచెత్తిన భారత ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో కాస్త మెరుగైన ఆటతీరును కనబరిచారు.

ఆట 14వ నిమిషంలోనే అనూహ్యంగా గోల్ సాధించిన జట్టు ఆధిక్యంలోకి దూసుకుపోయింది. రమణ్ దీప్ అందించిన బంతిని సిలానంద్ లక్రా గోల్‌గా మలచి భారత్‌కు ఆధిక్యం అందించాడు. లక్రాకు ఇది తొలి ఇంటర్నేషనల్ గోల్. ఈ ఆధిక్యంతో మరింత ఉత్సాహంతో ఆడిన భారత్‌పై పట్టు కోసం ఇంగ్లండ్ ఆటగాళ్లు విశ్వ ప్రయాత్నం చేశారు.అయితే భారత డిఫెండర్లు ఇంగ్లండ్ వ్యూహాలను సమర్థంగా తిప్పికొడుతూ ఆధిక్యతను ప్రదర్శించారు. అయితేఈ సమయంలో లభించిన 9 పెనాల్టీ కార్నర్‌లను సద్వినియోగ పరచుకోవటంలో భారత్ విఫలమైంది. అనుభవం ఉన్న ఆటగాళ్లు, ఉత్సాహంతో ఉన్న కొత్త కుర్రాళ్ల దూకుడుకు ఇంగ్లండ్ ఆటగాళ్లు కళ్లెం వేశారు. డ్రాగ్ ఫ్లిక్‌స్పెషలిస్ట్ వరుణ్‌కుమార్, అమిత్ రోహిదాస్‌లు గోల్స్ చేయటంలో విఫలమవడంతో భారత్ పట్టు సాధించలేకపోయింది.

53వ నిమిషం వరకూ భారత్ ఆధిక్యతను కొనసాగించింది. మ్యాచ్ చివరికొచ్చే సరికి భారత ఆటగాళ్లు పట్టు కోల్పోయారు. నాలుగో క్వార్టర్లో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచిన ఇంగ్లండ్ ఆటగాడు మార్క్ గ్లెగ్‌హార్న్ స్కోరును 1-1 గోల్స్‌తో సమం చేశాడు. ఈ గోల్‌తో రెండు జట్లకు చెరో పాయింట్ దక్కాయి. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో భారత్ ఈ మ్యాచ్ అనంతరం నాలుగోస్థానంలో ఉంది. సోమవారం భారత జట్టుకు విశ్రాంతి దినం. ఈ టోర్నీలో అతిముఖ్యమైన మ్యాచ్‌ను భారత జట్టు మంగళవారం వరల్డ్ నంబర్ వన్ ఆస్ట్రేలియాతో ఆడుతుంది.

రిజ్వికి స్వర్ణం

షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత్‌కు పతకాల పంట



న్యూఢిల్లీ: మెక్సికోలో జరుగుతున్న ప్రపంచ కప్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు సంచలనం సృష్టించారు. తొలి సారి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న భారత షూటర్ షాజర్ రిజ్వి పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణం గెలుచుకు న్నాడు. ఇక ఈ పోటీల్లో స్టార్ షూటర్ జితూరాయ్, మెహూలి ఘోష్‌లు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. మీరట్‌కు చెందిన రిజ్వి 242.3 పాయింట్లు సాధించి 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో రియో ఒలింపిక్ చాంపియన్ క్రిస్టియన్ రిట్జ్‌ను ఓడించి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఇక జితూరాయ్ 219 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. ఇక మహిళల విభాగంలో తొలి సారి వరల్డ్ కప్ పోటీల్లో బరిలోకి దిగిన మెహూలీ 228.4 పాయింట్లతో పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఇక భారత్‌కు చెందిన ముద్గల్, అపూర్వి, నాలుగు ఏడు స్థానాల్లో నిలిచారు. ఇక ఈ పోటీల్లో భారత్ పతకాలు గెలుచుకోవటం శుభపరిణామమని జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ తెలిపింది.

నైట్ రైడర్స్ కెప్టెన్ దినేశ్ కార్తీక్



కోల్‌కతా : వచ్చే నెల్లో జరిగే ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు వికెట్ కీపర్ - బ్యాట్స్‌మెన్ దినేశ్ కార్తీక్ సారథ్యం వహిస్తాడు. మరో కీలక ఆటగాడు రాబిన్ ఉతప్ప కేకేఆర్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. జనవరిలో జరిగిన ఐపీఎల్ వేలంలో కేకేఆర్ జట్టు దినేశ్ కార్తీక్‌ను 7.4 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పటి దాకా ఐదు ఐపీఎల్ టోర్నీల్లో దినేశ్ కార్తీక్ వేర్వేరు జట్లకు ఆడాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్, కింగ్స్ లెవెన్ పంజాబ్, ఢిల్లీ డేర్ డెవిల్స్, గుజరాత్ లయన్స్ తరపున కార్తీక్ ఆడాడు. మొత్తం పది ఐపీఎల్ సీజన్లలో 152 మ్యాచ్‌లు ఆడిన కార్తీక్ 24.81 సగటుతో 2903 పరుగులు చేశాడు. వీటిల్లో 14 హాఫ్ సెంచరీలుఉన్నాయి. కీపర్‌గా 88 క్యాచ్‌లు పట్టాడు. 26 స్టంపౌట్లు చేశాడు. 2012, 2014 ఐపీఎల్ సీజన్లలో నైట్‌రైడర్స్‌కు ట్రోఫీని అందించిన గౌతం గంభీర్‌ను ఈ సారి వేలంలో దక్కించుకోలేకపోయిన జట్టు యాజమాన్యం సారథ్య బాధ్యతలు ఎవరికి అప్పగించాలా అన్న అంశంపై సుదీర్ఘ కసరత్తు చేసింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో నైట్ రైడర్స్ జట్టు తొలి మ్యాచ్‌ను బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌తో తొలి మ్యాచ్‌ను ఆడుతుంది. ఏపిల్ 8న ఈ మ్యాచ్ జరుగుతుంది.

కింగ్స్ లెవెన్ పంజాబ్ బౌలింగ్ కోచ్‌గా వెంకటేశ్ ప్రసాద్



మొహాలీ : ఇటీవల భారత జూనియర్ సెలెక్షన్ కమిటీ పదవికి రాజీనామా చేసిన మాజీ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ ఐపీఎల్‌లో ఆడే కింగ్స్ లెవెన్ పంజాబ్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. వచ్చే నెల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ ఆడే పంజాబ్ జట్టుకు వెంకటేశ్ ప్రసాద్ బౌలింగ్ కోచ్‌గా ఉంటాడని ఆ జట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇక వచ్చే మూడు ఐపీఎల్ సీజన్లకు పంజాబ్ జట్టు హెడ్ కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ ప్లేయర్ బ్రాడ్ హాగ్ బాధ్యతలు చేపడతాడు. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టును ముందుండి నడిపిస్తామని అనుభవజ్ఞులైన కోచ్‌ల సాయంతో తమ జట్టు అనుకున్న ఫలితాలను సాధిస్తుందని బ్రాడ్ హాగ్ అన్నాడు. మాజీ డాషింగ్ ఓపెనర్ సెహ్వాగ్ మెంటార్‌గా వ్యవహరిస్తున్న ఈ జట్టుకు ఢిల్లీ మాజీ ప్లేయర్ మిథున్ మన్హాస్ అసిస్టెంట్ కోచ్‌గా పని చేశాడు.

జూనియర్ టీమ్ సెలెక్షన్ కమిటీ

చైర్మన్‌గా ఆశిష్ కపూర్



న్యూఢిల్లీ :భారత జూనియర్ క్రికెట్ జట్టు సెలెక్షన్ కమిటీకి కొత్త చైర్మన్‌గా మాజీ స్పిన్నర్ ఆశిష్ కపూర్‌ను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పటి పేస్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ ఈ పదవికి రాజీనామా చేయడంతో ఆశిష్ కపూర్‌ను ఆ స్థానంలో నియమించాలని క్రికెట్ బోర్డు భావిస్తోంది. గతంలో సెలెక్షన్ ప్యానెల్‌లో సభ్యుడిగా పని చేసిన అనుభం ఉన్న ఆశిష్‌కు చైర్మన్ బాధ్యతలు అప్పగించటమే మేలని బీసీసీఐ పరిపాలన కమిటీ నిర్ణయానికొచ్చినట్టు తెలుస్తోంది. గతంలో సెలెక్షన్ కమిటీలో ఉన్న ఇద్దరు సభ్యుల్లో ఆశిష్‌కపూర్‌కు మాత్రమే టెస్టుల్లో ఆడిన అనుభవం ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.